కాబులు గత వారం ఆర్థికపై పెట్టుబ్ లాంచ్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-8-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 201 పేజీలు: 12 వెల: 6.50

గాజాపై ఇజ్రాయెల్ మలిదశ పోరాటం

అఫ్ఘాన్ బస్సులో మంటలు.. 71 మంది దుర్మరణం

9లో



బుధవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రాధాకృష్ణన్

## ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఎన్‌డిఎ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి.రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలుచేశారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు పలువురు కేంద్రమంత్రుల సమక్షంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ అధ్యక్షుడు, జెపి నడ్డా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వంటి అగ్రనేతలు ఆయన వెంట ఉన్నారు. కూటమిలోని కీలక నేతలంతా హాజరుకావడంతో ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. లోకసభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛనప్రాయమేనని రాజకీయ వర్గాలుభావిస్తున్నాయి. సంఖ్యాబలం దృష్ట్యా ఆయన ఎన్నిక ఏకపక్షంగానే జరగనుందని అంచనావేస్తున్నారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపికచేసినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రకటించిన విషయం తెలిసిందే.

# వచ్చే మార్చికి 10 లక్షల ఇళ్లు

### ఇళ్లులేని పేదలను గుర్తించేందుకు 15 రోజుల్లో సర్వే

### నెల రోజుల్లో 3 లక్షల కుటుంబాలకు గృహప్రవేశాలు

### - సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు



బుధవారం సచివాలయంలో జరిగిన గృహనిర్మాణ శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఆగస్టు 20.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతిళ్లు ఉండాలని. ఇందుకోసం తలపెట్టిన గృహనిర్మాణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో గృహ నిర్మాణ శాఖపై అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలనే లక్ష్యాన్ని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వీటిలో 3 లక్షల ఇళ్లకు వచ్చే నెలలో గృహ ప్రవేశాలు జరగాలని స్పష్టం చేశారు. సంక్రాంతి కల్లా మరో 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిర్మాణం చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలని ఆదేశించారు. దీనిపై 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు పేద కుటుంబాలకు ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. పెద్ద కుటుంబాలకు ఉమ్మడి ఇళ్లు నిర్మించే యోచన చేయాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు ఇవ్వాలని చెప్పారు.

**త్వరలో 2,73,709 మంది లబ్దిదారులకు రూ.919 కోట్ల చెల్లింపు**

రాష్ట్రానికి పిఎంఎవై(అర్బన్)బిఎల్సీ, పిఎంఎవై (గ్రామీణ్), పిఎం జన్మాన్ కింద మొత్తం 18,59,504 ఇళ్లు మంజూరు కాగా, వీటిలో ఇప్పటికి 9,51,351 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలోనే 2.81 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వచ్చే నెలలో ఇంకో 19 వేల ఇళ్లు అందుబాటులోకి వస్తాయి.

ఈ ఏడాది కాలంలో గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2,013.50 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిన మొత్తం 4,305 లే అవుట్లలో రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలికవసతుల కోసం రూ.3,296.58 కోట్ల వ్యయం కానుంది. కుప్పం నియోజకవర్గంలో 4,647 మంది గృహ నిర్మాణ లబ్దిదారులకు రూ.16.37 కోట్లు చెల్లించగా, రాష్ట్రంలోని 2,73,709 >>2

# స్టార్టప్‌లకు కొత్త ఊపిరి

### రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించిన సిఎం చంద్రబాబు

### అమరావతి సహా ఐదు చోట్ల ఆర్టీఐహెచ్ కేంద్రాలు

**విజయవాడ.ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలందరికీ ఉన్నత జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సంపద సృష్టితో పాటు పేదరిక నిర్మూలన ప్రధానమని, ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలే ప్రాధాన్యమన్నారు. ప్రభుత్వ విధానాలు రూపొందాలంటే వినూత్న ఆవిష్కరణలు ఎంతో అవసరమన్నారు. ఆవిష్కరణలు వినూత్నంగా, ఉన్నతంగా ఉంటేనే పోటీలో నిలబడగలం. నాణ్యమైన ఉత్పత్తులు తయారుచేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధించాలన్నారు. అమరావతిలో రతనాటాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. ఇన్నోవేషన్ హబ్‌ను లాంఛనంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు దీనిని ప్రారంభించారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు అయ్యింది. ప్రపంచ అవసరాలు తీర్చే స్టార్టప్ కేంద్రంగా విలసిల్లేలా కార్యాచరణను సిద్ధం చేశారు.

కుటుంబానికో పారిశ్రామికవేత్త నినాదాన్ని సాకారం చేయడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రిడ్ ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు తెలిపారు. అమరావతి కేంద్రంగా హబ్, తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, అనంతపురంలో స్పోక్‌లు ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలు సాధించడంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం కలిసి పనిచేయాలి. అంతా కలిసి పనిచేస్తేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు సాధ్యం. సమస్యకు పరిష్కారం కనుగొంటే అందరికీ ఉపయోగపడుతుందన్నారు.సమస్య కాదు పరిష్కారంపై ఆలోచనలు చేయడం ఉత్తమ విధానమన్నారు. పి4 అమలు సహా నేను ఎన్నో వినూత్నఆలోచనలు పంచుకున్నా. నా ఆలోచనలు పంచుకున్నప్పుడు ఇది అసాధ్యమని చాలామంది విమర్శించారు. ఆచరణలో ఫలితాలను చూపి అంతా అసాధ్యమనుకున్నవి సుసాధ్యం చేసి చూపామన్నారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. వినూత్న ఆలోచనలతో ముందు కొచ్చే పారిశ్రామికవేత్తలకు పారదర్శకంగా ప్రోత్సాహకాలుపోత్సహిస్తున్నామని వెల్లడించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలకవేదిక కానుందని తెలిపారు. ఆలోచనలకు తగ్గ ఫలితాల సాధనే లక్ష్యంగా ఈ వేదిక పని చేస్తుందన్నారు. అమరావతిని కా ంటమ్ వ్యాలీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు ఆవిష్కరణ ఆధారిత ఆర్థిక వ్యవస్థలకు ప్రామాణికంగా రూపొందిస్తారు. >>2




బుధవారం అమరావతిలో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు .ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు లోకేష్, వివిధ సంస్థల ప్రతినిధులు.



# ఢిల్లీ సిఎం రేఖా గుప్తాపై దాడి

### ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తుండగా ఘటన

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై దాడి జరిగింది. సివిల్ లైన్స్‌లోని అధికారిక నవాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు బిజెపి వర్గాలు వెల్లడించాయి. 35 యేళ్ల వయసున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు తెలిపాయి. తొలుత అతడు కొన్ని పేపర్లను సిఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ ఖండించారు. పోలీసులు >>2

# అర్హులైన నేతన్నలకు 'ముద్ర' రుణాలు

### కొత్త చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేయండి: మంత్రి సవిత

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతడార్తప్రతినిధి:** అర్హులైన నేతన్నలందరికీ సకాలంలో ముద్ర రుణాలు అందజేయాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఫలాలు అందజేసేలా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆప్కో ద్వారా అమ్మకాలు పెంచాలని, ముఖ్యంగా నూతన డిజైన్లతో తయారు చేసిన చేనేతదుస్తులపై సోషల్‌మీడియా ద్వారా వినియోగదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. మంగళగిరిలో చేనేత, జౌళి శాఖ కమిషనరేట్‌లో బుధవారం ఆ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత పాల్గొన్నారు. కమిషనర్ రేఖారాణి చేనేత, జౌళి శాఖలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధికార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వన్ డిస్ట్రిక్ - వన్ ప్రొడెక్ట్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 36 ఉత్పత్తులు గుర్తించినట్లు వివరించారు. ఈసందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, వన్ డిస్ట్రిక్ - వన్ ప్రొడక్ట్‌గా కింద జిల్లాలో మరిన్ని ఉత్పత్తులను ఎంపిక చేయాలని సూచించారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన ఓడీ ఓపీ అవార్డుల్లో 9 అవార్డుల ఎపికి రావడం ఆనందకరమంటూ అభినందించారు. వచ్చే ఏడాది మరిన్ని అవార్డులు వచ్చేలా కృషి చేయాలని. రాష్ట్రంలో క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, మరమగ్గం కలిగిన 11,488 కుటుంబాలకు 500 యూనిట్లు అందజేస్తున్నామన్నారు. చేనేతలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోందని మంత్రి సవిత వెల్లడించారు. నూతన సహకార సంఘాల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సహకార సంఘాల ఏర్పాటులో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నూతన సహకార సంఘాల ఏర్పాటుపై తరుచూ సమీక్షలు చేయాలని కమిషనర్ రేఖారాణిని మంత్రి సవిత ఆదేశించారు.

2025-26లో ముద్ర రుణాలు ఎంతమందికి ఇచ్చినట్లు మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. అర్హులైన నేతన్నలందరికీ ముద్ర రుణాల సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తమ పరిధిలో ఉన్న బ్యాంకర్లతో చర్చించి, రుణాల మంజూరు >>2

## ఎఐ సాయంతో 1, 2 గంటల్లో శ్రీవారి దర్శనం

### టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** శ్రీవారి భక్తులకు టిటిడి గుడ్ న్యూస్ చెప్పింది. తిరుమల శ్రీవారి దర్శనం వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. ఎఐ సాయంతో తిరుమల శ్రీవారి దర్శనం 1,2 గంటల్లోగా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే తిరుమలలో కొత్త క్యాంటీన్లు, శ్రీవాణి దర్శనం వేళల మార్పు, విఐపి దర్శన సమయం గురించి హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కీలక వివరాలు వెల్లడించారు. తిరుమల శ్రీవారి భక్తులకు టిటిడి శుభవార్త వినిపించింది. తిరుమలలో ఏటికేడు భక్తుల రద్దీ పెరుగుతోంది. శ్రీనివాసుడి దర్శనం కోసం విచ్చేస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టిటిడి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. అయితే విశేష పర్వదినాలు, ఉత్సవాలు, పండుగల సమయంలో తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటోంది. దీంతో ఇలాంటి రోజులలో శ్రీవారి దర్శనానికి గంటలు గంటలు సమయం పడుతోంది.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని టిటిడి సరికొత్త ఆలోచన చేస్తోంది. దేవదేవుడి దర్శనం కోసం వచ్చే భక్తులకు వేగంగా దర్శనం కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఆర్టిఫిషియల్‌ఇంటెలిజెన్స్ సాయంతో గంటనుంచి రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే తిరుమలలో త్వరలోనే కొత్త క్యాంటీన్లను ప్రారంభిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. టిటిడిలో పనిచేసే అన్యమత సిబ్బందిని బదిలీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాంటి వారిని స్వచ్ఛంద పదవీ విరమణ పథకం కింద పంపించేలా ప్రణాళికలురచిస్తున్నట్లు వెల్లడించారు.

అలాగే సిబ్బంది ఎవరైనా అన్యమత ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మరోవైపు తిరుమలలో శ్రీవాణి టికెట్ల దర్శన సమయాలు మారుస్తామన్న టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు.. ఉదయం శ్రీవాణి దర్శనం టికెట్లు తీసుకున్న భక్తులు సాయంత్రాని కల్లా శ్రీవారిని దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.అలాగే తిరుమలలో విఐపి దర్శనాలను ఉదయం 8 నుంచి 8.30 గంటలకు ముగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.



# ప్రధానికైనా ఉద్వాసనే!

### అరెస్టయి, 30 రోజులు నిర్బంధంలో ఉంటే పిఎం, సిఎం, మంత్రులను తొలగించే బిల్లు

### 3 కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన అమిత్‌షా

### తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షం

### బిల్లు కాపీలు చించేసిన కాంగ్రెస్ సభ్యులు

### జెపిసి పరిశీలనకు బిల్లులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు20:** దేశంలో నేరం చేస్తే ప్రధానికైనా ఉద్వాసనే జరిగేలా కేంద్ర ప్రభుత్వం బిల్లులను తీసుకొచ్చింది. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లుతో సహా మూడు బిల్లులను బుధవారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. బిల్లుల కాపీలను చింపి అమిత్ షాపైకి విసిరారు. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం,సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు విపక్షాలు ఆరోపించాయి. అయితే ఈ బిల్లులను హడావుడిగా తీసుకొచ్చారనే విమర్శలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు. నేరం చేస్తే ప్రధాని, సీఎంలు, మంత్రులకు సైతం ఉద్వాసన పలికేలా కేంద్రం ఈ మూడు కీలక బిల్లులను తీసుకువచ్చింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే బిల్లులను కేంద్ర హోం మంత్రి అమిత్ షాలోక్ సభలో ప్రవేశపెట్టారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ సవరణబిల్లు, 130వ రాజ్యాంగ సవరణబిల్లు, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులుగా వాటిని పేర్కొన్నారు. ఈ సమయంలో అధికార విపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల ఎంపీలు బిల్లు కాపీలు చింపి సభలో విసిరారు. వెల్ దగ్గరికి వెళ్లి చింపిన బిల్లు ప్రతులను టిఎంసి ఎంపీలు విసిరారు.హోం మంత్రి అమిత్‌షా స్థానం వైపు >>2

## వినాయక మండపాలకు సింగిల్‌విండో విధానం: డిజిపి

**విజయవాడ ఆగస్టు 20, ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న వినాయక చవితి పండుగను దృష్టిలో పెట్టుకుని, వినాయక ఉత్సవ మండప నిర్వాహ కులు సింగిల్‌విండో విధానం ద్వారా, ఆన్‌లైన్లో అనుమతులు పొందడానికి వీలుగా ..ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ రూపొందించిన వినాయక ఉత్సవ్. వెబ్‌సైట్‌ను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని డిజిపి హరీష్ కుమార్ గుప్తాతెలిపారు. వినాయకఉత్సవ మండప నిర్వా హకులు ఆన్ లైన్లో తమ, తమవివరాలను నమోదు చేసుకుని ఎన్‌వోసి (నిరభ్యంతరపత్రం) పొందవ చ్చని తెలిపారు. మండప నిర్వాహకులు అనుమ తులుకోసం ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ముఖ్యాధికారి మండ పాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వినాయక ఉత్సవ మండపాలకు క్యూఆర్ కోడ్‌తో కూడినా ఎన్‌ఒసి (నిరభ్యంతర పత్రం) జారీ చేస్తారని డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక ఉత్సవ మండపాలకు మాత్రమే ఈ అనుమతులు అవసరం అని డిజిపి స్పష్టం చేశారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలు వినాయక నవరాత్రి ఉత్సవాలను సురక్షి తంగా, ఆనందంగా జరపుకునేందుకు, మండప నిర్వాహకులు పూర్తి పారదర్శకంగా, సులభతరంగా పోలీసు శాఖ అనుమతులు పొందేందుకు ఈ ఆన్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. నిర్వాహకులు వినాయక ఉత్సవ్ వెబ్‌సైట్ ద్వారా అనుమతులు పొందవల సిందిగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా కోరారు.

## జైలునుంచి కాకాణి విడుదల

**నెల్లూరు క్రైం, ఆగస్టు 20, ప్రభాతవార్త:** గత 85 రోజులుగా జిల్లా కేంద్ర కారాగారంలో పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి బుధవారం జైలు నుండి విడుదలయ్యారు. సోమవారం ఉన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినప్పటికీ, ఉత్తర్వులు జైలు చేరడంలో ఆలస్యం కావడంతో మంగళవారం విడుదల కావాల్సిన కాకాణి ఎట్టకేలకు బుధవారం విడుదల అయ్యారు. విడుదల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకున్న ఆస్తి ప్రజల అభిమానమేనని, జిల్లా కేంద్ర కారాగారం లోపల అందరూ వైఎస్సార్సీ వారేనని అన్నారు. జైలు అంటే భయపడాల్సిన అవసరం లేదని,చంద్రబాబు నాయుడు దయవల్ల జైల్లో వైఎస్సార్సీ వారితో >>2

## నీటి గుంటలో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

### చిగిలి గ్రామంలో విషాదం

**కర్నూలు,ఆగస్టు 20,ప్రభాతవార్త ప్రతినిధి :** కర్నూలుజిల్లా ఆస్పరిమండలం చిగలి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం నీటి కుంటలో ఆరుగురువిద్యార్థులు మృతి చెందారు. మృతి చెందిన వారంత స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు. ఈత కోసం వెళ్లిన విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. దీంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. వివరాల మేరకు చిగిలి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్కూలువిడిచిన తరువాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఇంటిలో >>2


రాజీవ్ జయంతి సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలోని వీర్‌భూమి వద్ద నివాళులర్పిస్తున్న ప్రియాంక గాంధీ, వాద్రా తదితరులు

# ఢిల్లీ సిఎం రేఖా గుప్తాపై దాడి

>> దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా తన అధికారిక నివాసంలో ప్రతివారం 'జన్ సున్‌వాయ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ యువకుడు కొన్ని పేపర్లను ముఖ్యమంత్రికి అందించాడు. అంతలోనే గట్టిగా అరుస్తూ సిఎంపై దాడి చేశాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన వ్యక్తిగత భద్రతాసిబ్బంది నిందితుడిని అదుపులోకితీసుకున్నారు. అతడిని రాజ్‌కోట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. ఊహించని పరిణామంతో ముఖ్యమంత్రి షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఆమెను వెంటనే వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిపై దాడిని రాజకీయ పక్షాలు ఖండించాయి. ఢిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రజల కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ముఖ్యమంత్రిపై దాడిచేయడం దారుణమన్నారు. ఇది ప్రత్యర్థుల కుట్రకావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీనిలో ఏదైనా రాజకీయ పార్టీ ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత అతిశీ కూడా ఈ ఘటనను ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటులేదన్నారు. నిందితులపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి క్షేమంగా ఉన్నారని భావిస్తున్నామన్నారు. ఈ దాడిని ఖండించిన ఢిల్లీ కాంగ్రెస్.. దురదృష్టకమైన ఘటన అని పేర్కొంది. ముఖ్యమంత్రికే రక్షణ లేకుంటే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవందర్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.



బుధవారం పార్లమెంటు వద్ద నిరసన ప్రదర్శన జరిపిన పలువురు ఎంపీలు

# స్టార్టప్‌లకు కొత్త ఊపిరి

>> ప్రపంచ మేధను ఆకర్షించి పెట్టుబడులు, ఇన్నోవేషన్ ఆధారిత విధానాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఆవిష్కరణల్లో స్పోక్‌ల వారీ ప్రాధాన్యతలున్నాయి, వాటిలో అనంతపురంలో ఉత్పత్తి, ఆటోమోటివ్, టవిశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ సేవలు, ఫార్మా, మారిటైమ్‌లున్నాయి. విజయవాడకు మొబిలిటీ,పబ్లిక్ సెక్టార్,ఉత్పత్తిరంగంలో, రాజమహేంద్రవరంలో వ్యవసాయం,ఆక్వా ప్రాధాన్యతలున్నాయి. ముందున్న సవాళ్లకు తగ్గట్టుగానే అవకాశాలను అందిపుచ్చుకునే కార్యాచరణతో పని చేస్తు న్నట్లు చెప్పారు.

అమరావతి కేంద్రంగా ఏర్పాటయ్యే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్... డీప్‌టెక్,, కృత్రిమ మేధ,సుస్థిర,సమ్మిళిత ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుంది. దీనిలో భాగంగా తిరుపతిలో ఆగ్రో ప్రాసెసింగ్,ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్రంలో పని చేస్తున్నందున దేశానికి ఏపి ఆవిష్కరణల హబ్‌గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షి స్తున్నామన్నారు. వ్యాపారంఅంటే లాభాలు మాత్రమే కాదని విలువలు, మానవ త్వంతో కూడిన పని అని చాటిన మహనీయుడు రతన్ టాటా అని లోకేశ్ కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తికి ఈ వినూత్న ఆవిష్కరణల వేదికను అంకితమిస్తున్నట్లు తెలిపారు. వినూత్న నూతన ఆవిష్కరణలు సంస్కృతిగా మారాయని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ స్పష్టం చేశారు. ఆ సంస్క ృతిని అందరికీ పరిచయం చేసే బాధ్యత సీఎం చంద్రబాబు తీసుకున్నారని అన్నారు. ప్రపంచీకరణలో సమస్యల పరిష్కారానికి నూతన ఆవిష్కరణలే కీలకమవుతు న్నాయని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా వైద్య, రక్షణ, ఆర్థిక ఇలా అనేక సమస్యల పరిష్కారానికి లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. సమస్యల పరిష్కార వేదికగా ఇన్నోవేషన్ హబ్ లు కీలకపాత్ర పోషించనున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు. రతన్ టాటా పేరుతో వినూత్న ఆవిష్కరణల వేదికకు శ్రీకారం చుట్టినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖ సిబ్బందిపై ఎమ్మెల్యే, అనుచరుల దాడి

## విధుల నిర్వహణకు ఆటంకం

## కిడ్నాప్ చేసి ఫారెస్ట్ సిబ్బందిని బంధించి జీపులో తీసుకెళ్లి దౌర్జన్యం

**పెద్దదోర్నాల, ఆగష్టు 20, ప్రభాతవార్త :** శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆయన అనుచరులు విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బందిని కొట్టి దాడి చేసి దౌర్జన్యంగా జీపులో కిడ్నాపు చేసి తీసుకెళ్లి ఊరంతా తిప్పి భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన కలకలం రేపుతుంది. స్థానికంగా ఈ ఘటన తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. ప్రజా ప్రతినిధిగా ఉండి, చట్టాన్ని కాపాడాల్సిన ఎమ్మెల్యేనే దాడికి తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటని అటవీశాఖ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆయన అనుచరులు తీరు రౌడీయిజం తీరు భయభ్రాంతులకు గురి చేసిందని, అటవీ క్షేత్ర అధికారి ఇద్దరు బీట్ అధికారులు, ఇతర సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తూ వారి వద్ద ఉన్న వాకిటాకీలు, సెల్ ఫోన్లు, నగదు ఇతర వస్తువులను దోచుకున్న తీరు భయానకం సృష్టించిందని, ప్రభుత్వ వాహనమైన అటవీ క్షేత్రాధికారులలోనే సిబ్బందిని బంధించి శ్రీశైలం, సున్నిపెంట రోడ్లన్నీ తిప్పుకుంటూ దాడి చేశారని, అనంతరం గెస్ట్ హౌస్‌లో బంధించి చిత్రటహింసలకు గురి చేసి రాత్రి రెండుగంటలకు వదిలి పెట్టారని అన్నారు.

దాడికి గురైన ఉద్యోగు లంతా ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన వారే. ఈ సంఘటనపై అటవీ ఉద్యోగ సంఘాలు చెంచు గిరిజన సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి దాడి జరిగిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆయ నను, అనుచర ముఠాను అరెస్టు చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుడ్డ రాజశేఖర్‌రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే పదవికి బుడ్డా రాజశేఖర్ రెడ్డితో రాజీనామా చేయించాలని ఆంధ్ర ప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్అధికారుల అసోసియేషన్ మార్కాపురం యూని యన్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.సుధాకర్, సంయుక్త కార్యదర్శి బాల కుమారి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు శివ, జెఫిలిప్ ఇన్‌ఛార్జీ డివైఆర్‌ఓ కే.చెన్నయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రభు, ఎఫ్‌బీఓ వెంకటేశ్వర్లు బుధవారం పెద్దదోర్నాల అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో డిమాండ్ చేశార. ఈ ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అలా జరగని పక్షంలో తాము ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇలాంటి భౌతిక దాడులు చేసి, దౌర్జన్యాలకు పాల్పడటం, దుర్భాషలాడడం ప్రజా ప్రాతినిధ్యానికి ఒక చెరగని మచ్చ అని అన్నారు.

అటువంటి వారు ఎమ్మెల్యేగా ఉండడం అనర్హులని, ఉద్యోగులందరం కలిసి రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని హెచ్చరించారు. నల్లమల అరణ్యంలోని శిఖరం ఫారెస్టు చెక్ పోస్టు వద్ద మంగళవారం రాత్రి 10గంటలకు చోటు చేసుకున్న ఈ సంఘటన సంచలనం సృష్టించింది. ప్రజా ప్రతినిధుల పేరుతో జరిగే ఇలాంటి దాడులను అరికట్టకపోతే భవిష్యత్తులో అటవీ సంపద, వన్య ప్రాణి సంపద రక్షణ కష్టతరమవుతుందని, ఇలాంటి దాడులు పునరావృతం అయితే అడవిని కాపాడడం ప్రశ్నార్థకమవుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

# 'స్త్రీ శక్తి' పథకం విజయవంతం

## - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ, ఆగష్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** స్త్రీ శక్తి పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతుండటంపై సంతోషంగా ఉందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ఎప్పుడొస్తుందా అని మీడియా, ప్రతిపక్షాలు ఎదురు చూశాయన్నారు ఇప్పుడు సినిమా సక్సెస్ మీట్ లాగా, స్త్రీ శక్తి సక్సెస్ మీట్ నిర్వహించడం నాకు ఎంతో ఉత్సాహంగా ఉందని ఆయనఅన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాలలో ఒకదాన్ని మించి ఒకటి ప్రజల ఆదరణ పొందుతున్నాయని తెలిపారు. వాటిలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్న పథకం స్త్రీ శక్తి అని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభించి ఆరవ రోజుకే సుమారు 65 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసారని మంత్రితెలిపారు. ఇప్పటివరకు సుమారు ..25కోట్లు ఖర్చయిందని, ఆ మొత్తం మొత్తాన్ని ఏపీఎస్‌ఆర్టీసీకి చెల్లిస్తున్నామని వివరించారు.

ఘాట్ రోడ్ల విషయంలో మొదట్లో వచ్చిన కొన్ని విమర్శలను గంటల్లోనే పరిష్కరించామని చెప్పారు. ప్రతిపక్షాల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు కూడా స్త్రీ శక్తి పథకం అమలును కొనియాడటం రాష్ట్ర ప్రభుత్వానికి గర్వకారణమని తెలిపారు. త్వరలోనే 750 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు రానున్నాయని, రాబోయే 4 ఏళ్లలో 2500 ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. తిరుమల మినహా రాష్ట్రంలోని అన్ని ఘాట్ రోడ్లలో మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని స్పష్టం చేశారు,.రాష్ట్ర బోర్డర్ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి తెలిపారు. కండక్టర్ల కొరత అంశం తమ దృష్టికి వచ్చిందని, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పురుషులు ఇబ్బందులు పడుతున్నారనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళలకు ప్రత్యేక గుర్తింపుకోసం స్మార్ట్ కార్డ్ జారీ చేసే ఆలోచన ఉందని మంత్రి ప్రకటించారు. పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించడంలో భాగంగా మాత్రమే భూములను కేటాయిస్తున్నామని, ఆ భూములు పూర్తిగా ఏపీఎస్‌ఆర్టీసీ ఆధీనంలో ఉన్నవే అని స్పష్టం చేశారు.ఈ పథకం అమలు చేయగలగడం మా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాం. స్త్రీశక్తి భారంకాదు, ఇదిరాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. మహిళలఆశీస్సుల వలననే చంద్రబాబు గారు నాలుగోసారి సిఎం అయ్యారు. మహిళల కోసం ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వకారణం అని అన్నారు.

# ప్రధానికైనా ఉద్వాసనే!

>> కూడా విసిరారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కెసి వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండిస్తూ అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని స్పష్టంచేశారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ, రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం తగదని హితవు పలికారు.ప్రతిపాదిత బిల్లులను అమిత్ షా, సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫారసు చేశారు. ఈ బిల్లులపై విపక్ష సభ్యులకు అభ్యంతరాలుంటే జెపిసికి వెల్లడించాలని సూచించారు. ఈ క్రమంలో ప్రతిపక్షాల నిరసనలు తెలిపాయి.ఈ గందరగోళం మధ్యలోనే అమిత్ షా మూడు బిల్లుల కోసం ప్రవేశపెట్టిన తీర్మానానికి లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో విపక్షాలు వెల్‌లోకి దూసుకురాగా, సభ వాయిదా పడింది. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనలు చేశారు.ఇక ఈ బిల్లులు ప్రకారం, ఐదేళ్ల జైలు శిక్ష పడే కేసుల్లో వరుసగా 30 రోజులు అరెస్ట్ లేదా నిర్బంధంలో ఉంటే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు 31వ రోజున తమ పదవిని కోల్పోతారు. ఒకవేళ ఎవరైనా మంత్రి పదవిలో ఉండి అరెస్టైతే వారిని తొలిగించేందుకు 30 రోజుల్లోపు రాష్ట్రపతికి ప్రధాని సిఫారసు చేయకపోయినా 31వ రోజు సదరు మంత్రి పదవిని కోల్పోతారు. ఒక వేళ ప్రధాని 30 రోజుల పాటు అరెస్టైతే ఆయన 30 రోజుల్లోపు రాజీనామా చేయకున్నా 31వ రోజున పదవి కోల్పోతారు. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లుపై సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. రాజకీయాల్లో నైతిక విలువలను పునరుద్ధరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కీలక బిల్లు తెచ్చిందని స్పష్టం చేశారు. అరెస్ట్ అయి జైల్లో ఉన్న వ్యక్తులు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు వంటి ఉన్నత రాజ్యాంగ పదవుల్లో కొనసాగకుండా నిరోధించేందుకు ఉద్దేశించిన మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. స్పీకర్ అనుమతితో సభ ముందు ఈ బిల్లులను ఉంచినట్లు ఆయన తెలిపారు.

**బిల్లుల్లోని ప్రధాన నిబంధనలు ఇవే: అమిత్ షా**

1. జైల్లో ఉంటే పదవిలో కొనసాగలేరు

ఏదైనా కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న వ్యక్తి.. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిగా గానీ, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రిగా గానీ తన విధులను నిర్వర్తించలేరు. వారు తమ పదవిలో కొనసాగడాన్ని ఈ బిల్లులు పూర్తిగా నిరోధిస్తాయి.

2. 30 రోజుల గడువు

అరెస్టయిన రాజకీయ నాయకుడు 30 రోజుల్లోగా బెయిల్ పొందడంలో విఫలమైతే, 31వ రోజున వారిని పదవి నుంచి తప్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి వారిని తొలగించకపోతే, చట్టప్రకారం వారు ఆ పదవిలో కొనసాగే అర్హతను వాటంతట అవే కోల్పోతారు. అయితే, న్యాయ ప్రక్రియ ద్వారా బెయిల్ పొందిన తర్వాత తిరిగి వారిని ఆ పదవుల్లో నియమించేందుకు అవకాశం ఉంటుంది.

3. నైతిక విలువల పరిరక్షణే లక్ష్యం రాజ్యాంగాన్ని రూపొందించిన సమయంలో, నేతలు అరెస్ట్ అయిన తర్వాత కూడా నైతిక బాధ్యతతో రాజీనామా చేయరని బహుశా మన రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో కొందరు ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్ట్ అయినా రాజీనామా చేయకుండా జైలు నుంచే ప్రభుత్వాలను నడుపుతున్న దిగ్భ్రాంతికరమైన సంఘటనలు దేశం చూసిందని ఆయన గుర్తుచేశారు. ఈ జాడ్యంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను, రాజకీయాల్లో దిగజారుతున్న ప్రమాణాలను దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లులను తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా, ఒక మంత్రి, ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం సరైనదేనా? అనే విషయాన్ని దేశ ప్రజలు తేల్చుకోవాలని అమిత్ షా అన్నారు.

## మంత్రి లోకేష్ చొరవతో విద్యాశాఖకు అదనంగా నిధులు మంజూరు

**విజయవాడ,ఆగష్టు 20,ప్రభాతవార్త ప్రతినిధి:** సమగ్ర శిక్షణలో ఈ విద్యాసంవత్సరం గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్ల నిధులను రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసింది. మంత్రి లోకేష్ చొరవతో నిధుల కేటాయింపు విషయంలో రాష్ట్రానికి కేంద్రం అధిక ప్రాధాన్యతనిస్తోంది. సెకండరీ,సీనియర్ సెకండరీ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఐసిటి ల్యాబ్స్,స్మార్ట్ తరగతులు,సైన్స్ ల్యాబ్‌లఏర్పాటుకు కేంద్రం ఈసారి రూ.167.46కోట్ల అదనపు నిధులను మంజూరు చేసింది. దీంతో పాటు డైట్ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మార్చడానికి గతంలో 50శాతం మాత్రమే నిధులు వచ్చాయి. ఈ ఏడాది రూ.45 కోట్లకు గాను 96 శాతం మేర రూ.43.23 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆదివాసీ విద్యార్థులకు వసతి గృహాలకోసం రూ.11 కోట్లు మంజూరు చేసింది.

## 'వ్యూహం' చిత్ర నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ అరెస్ట్

**విజయవాడ,ఆగష్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పటమట పోలీసులు ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో జరిగినదాడి కేసుల్లో వ్యూహం చిత్ర నిర్మాణ దాసరి కిరణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసారు.కిరణ్‌కుమార్ తన సమీప బంధువు గాజుల మహేష్ దగ్గర సుమారు రూ.అయిదు కోట్లు అప్పు తీసుకున్నారు.ఈ మొత్తాన్ని చెల్లించాలని కోరుతూ మహేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి కిరణ్ ఇంటికి వెళ్లారు.కిరణ్ ఆయనకు బాకీ చెల్లించక పోగా, వారిపై దాడి చేయించారు.దీనిపై మహేష్ విజయవాడ పటమట పోలీసులకు ఫిర్యాదు చేసారు.పోలీసులు కేసు నమోదు చేసి, బుధవారం కిరణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో ఉండగా అరెస్ట్ చేసారు.

## వారం - వర్జ్యం

21-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
త్రయోదశి మ.12.48
పుష్యమి రా.12.11
వర్జ్యం : మ1.03-2.39
దు.ఉ.10.05-10.55, 2) మ.3.08-3.58
శుభసమయం: ఉ6.30-8.30
రాహుకాలం - మ.1.30-3.00

## వారఫలం

**మేషం :** బంధువుల నుండి వచ్చిన ఆనందం కలిగిస్తుంది. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**వృషభం :** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**మిథునం:** ధైర్యం, పట్టుదలతో ముందుకు సాగుతారు. ఋణాలు తీరుస్తారు.

**కర్కాటకం :** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. వాహన సౌఖ్యం.

**సింహం:** భూమి, ఇళ్ల కొనుగోలు యత్నాలు సాగిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి.

**కన్య :** ఉద్యోగులకు హోదాలు కలుగుతాయి. కళలు, రాజకీయ రంగాల వారికి అన్ని విధాలా అనుకూలిస్తాయి.

**తుల :** చిన్న చిన్న నిర్మాణపనులకు పన్నులు కట్టడానికి ధనం ఖర్చుచేయవలసి వస్తుంది.

**వృశ్చికం:** వృత్తి వ్యాపారలో చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. ధనలాభం.

**ధనుస్సు:** సెంటిమెంటు వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు పాటించండి. సోదరుల కలయిక.

**మకరం:** మీ వెంటే ఉంటూ మీ వైరి వర్గానికి సహాయసహకారాలు అందించే వారిని గుర్తిస్తారు.

**కుంభం:** కీలక వ్యావహారాలలో గోప్యతను వహించి లాభపడతారు. వస్తులాభం.

**మీనం :** దగ్గరి బంధువులతో చర్చించి ఒక శుభకార్యాన్ని ఖరారుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వచ్చే మార్చికి 10 లక్షల ఇళ్లు

>> మంది లబ్దిదారులకు రూ.919.29 కోట్లు త్వరలో చెల్లించనుంది. పిఎం జన్మాన్ కింద నిర్మించిన 15,753 ఇళ్లకు రూ.100 కోట్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద నిర్మించిన 15,582 ఇళ్లకు రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయనుంది. మరోవైపు పీఎంఏవై అర్బన్ కింద ఇళ్లు మంజూరైనప్పటికీ 1,84,510 మంది లబ్దిదారులు ఇంకా గృహ నిర్మాణం చేపట్టలేదని అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు.

**తుది దశకు 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం**

2018లో 104 పట్టణ స్థానిక సంస్థల్లో 4,54,706 టిడ్కో ఇళ్లకు టెండర్లు పిలవగా, వీటిలో ప్రస్తుతం 1,77,546 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిలో 300 చ.అ. విస్తీర్ణం కలిగిన 45,848 ఇళ్లు, 365 చ.అ. విస్తీర్ణం ఉన్న 12,550 ఇళ్లు, 430 చ.అ. విస్తీర్ణం ఉన్న 25,172 ఇళ్లు... మొత్తం 83,570 ఇళ్లను లబ్దిదారులకు ప్రభుత్వం అందించింది. మరో 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరిందన్నారు.

# జైలునుంచి కాకాణి విడుదల

>> ఎక్కువ సమయం గడిపే అవకాశం వచ్చిందని అన్నారు. హైకోర్టు బెయిలు మంజూరు చేసిన తర్వాత కూడా ఉద్దేశపూర్వకంగానే విడుదల ఆలస్యం చేశారని ఆరోపించారు. తన కోసం మంగళవారం సాయంత్రం ప్రజలు వచ్చారని, బుధవారం ఉదయం కూడా వచ్చారు ప్రజల అభిమానం మర్చిపోలేనిదని భావోద్వేగానికి గురయ్యారు. జిల్లాలో రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన వ్యక్తిని ఇన్ని రోజులు జైల్లో ఉంచడం చరిత్రలో ఇదే మొదటిసారని పేర్కొన్నారు. తనపై 6 సోషల్ మీడియా కేసులు పెట్టారని, ఓట్లు వేస్తే లిక్కర్ ఇస్తా అని తాను చెప్పానంటూ హాస్యాస్పదంగా లిక్కర్ కేసులను నమోదు చేశాని ఆరోపించారు. జైల్లో వేసినంత మాత్రాన మనోధైర్యం కోల్పోలేదని, తాను ఆరోగ్యంగానూ మానసికంగా ధైర్యంగానూ ఉన్నట్లు పేర్కొన్నారు. సోమిరెడ్డి, ఆయన కొడుకు చేసే తప్పులను కచ్చితంగా ఎత్తిచూపుతానని స్పష్టం చేశారు.

# 'ముద్ర' ఋణాలు

>> ఆలస్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్దేశించిన లక్ష్యంలో 70 శాతం మేర ముద్ర ఋణాలు అందించాలని స్పష్టంచేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 92 ఆప్కో షో రూమ్‌ల ద్వారా అమ్మకాలు మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. ఆప్కో షో రూమ్‌ల ద్వారా గతేడాది 35.60 కోట్ల అమ్మకాలు జరిగాయన్నారు. ఈఏడాది అమ్మకాలు మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కస్టమర్లకు వేగవంతమైన సేవలు అందించాలని, షో రూమ్‌లను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు. నూతన డిజైన్లతో రూపొందించిన దుస్తులను షో రూమ్‌ల్లో ప్రదర్శనగా పెట్టాలన్నారు. ముఖ్యంగా ఈ కామర్స్ ద్వారా అమ్మకాలు పెంచాలన్నారు. చేనేత దుస్తుల సోషల్ మీడియా ద్వారా చేనేత దుస్తులపై విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. ఎయిర్ పోర్టుల్లో ఉన్న ఆప్కో షో రూమ్ ల్లో చేనేత దుస్తులతో పాటు హస్త కళా రూపాలను కూడా అమ్మకానికి పెట్టాలని మంత్రి సవిత ఆదేశించారు.

# ఆన్‌లైన్ గేమ్‌లపై నిషేధం

## కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** డబ్బులతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నిషేధించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025' పేరిట తీసుకొచ్చిన ఈబిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటిశాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌లకు కొంతమంది బానిస కావడం, మనీలాండరింగ్, ఆర్థిక మోసాల వంటివి ఇటీవల కాలంలో పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ గేమ్స్, ఇ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష లేదా రూ. కోటివరకు జరిమానా లేదా ఆరెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్న వారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ. కోటి వరకు జరిమానా వేస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు. మరోవైపు.. ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్రనష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. గేమింగ్‌పై నిషేధం విధించే కంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.

# ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

**విజయవాడ.ఆగష్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 4.92 లక్షల క్యూసెక్కులుగా ఉంది. గోదావరిలో నీరు ప్రవహిస్తున్నది. భద్రాచలం వద్ద నీటిమట్టం 42.2 అడుగులు ఉంది ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగం హెచ్చరించింది. సహాయక కార్యకలాపాలకు రూ.16 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రక్షణ చర్యలకు ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. కృష్ణా నదిపరీవాహక లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాగులు/కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని పేర్కొన్నారు. కృష్ణా నదికి విస్తృతంగా వచ్చి చేరుతున్న దృష్ట్యా ప్రకాశం బ్యారేజీ ఎగువ నుంచి దిగువకు ఉన్న లోతట్టు ప్రాంతాలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. ఇప్పటికే ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలను పునారావాస కేంద్రాలకు తరలించారు.ఈ సాయంత్రానికి ఆనకట్ట వద్ద వరద నీరు తగ్గుముఖం పడుతుందని అధికారులు తెలిపారు. మరో వైపు గోదావరి నదికి వరద భారీగానే చేరింది.ధవళేశ్వరం బ్యారేజీ ప్రాంతంలోను,రాజమండ్రి వంతెన సమీపంలో పెరుగుతున్న వరదను దృష్టిలో ఉంచుకుని అనేక సహయక చర్యలను సన్నద్ధం చేసారు.

# ఆరుగురు విద్యార్థులు మృతి

>> స్కూల్ బ్యాగులు పెట్టిన అనంతరం గ్రామ శివారులోని హైస్కూల్ శివారులోని బిల్డింగ్ నిర్మాణపు పనులు జరుగుతున్న సమీపంలోని నీటి కుంటలో సరదాగా ఈత కొట్టడానికి శశికుమార్, కిన్నెరసాయి, భీమా, సాయికిరణ్, వీరేంద్ర, మహాబాబు, ధుర్గాప్రసాద్ మొత్తం ఏడు మంది విద్యార్థులు ఈతకు వెళ్లారు. ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు కుంటలోకి భారీ వర్షం నీరు చేరడడంతో కుంటలో ఈతకు దిగిన ఆరుగురు విద్యార్థులు శశికుమార్, కిన్నెరసాయి, భీమా, సాయికిరణ్, వీరేంద్ర, మహాబాబు నీటి కుంటలో మునిగిపోయారు. గమనించిన మరో విద్యార్థి ధుర్గాప్రసాద్ సమీపంలోని గ్రామంలోకి చేరుకొని జరిగిన విషయాన్ని గ్రామస్తులకు సమాచారాన్ని తెలియజేశాడు. గ్రామస్తులు వచ్చి నీటికుంటలో చిక్కుకు పోయిన 6 మంది మృత్యుదేహాలను వెలికి తీశారు. విషయం తెలుసుకున్న సిఐ గంగాధర్ పోలీసు సిబ్బందితో గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. అలాగే పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, తహాసిల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపిడివో గీతావాణీ చిగలి గ్రామాన్ని సంధర్శించి ప్రమాదం జరిగిన ఘటనా వివరాలను అధికారులు తమ గ్రామస్తులను, విద్యార్థుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నీటి కుంటలో పడి మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులను గడప గడపకు వెళ్లి ఓదార్చారు. హైస్కూల్ నిర్మాణపు పనులు జరుగుతున్న కొండ సమీపంలో అక్రమంగా గరుసును తోలడంతో పెద్దగుంత ఏర్పడి ఈ రోజు 6 మది విద్యార్థుల మృతికి కారణమైందన్నారు.

**రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిచాలి: ఎమ్మెల్యే విరుపాక్షి**

చిగలి గ్రామంలో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డ విద్యార్థుల మృతుల కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బూషినేని విరుపాక్షి ప్రభుత్వాన్ని కోరారు.

21-08Pg3 gntfffff_21-08Pg3 gntfffff.qxd 8/21/2025 12:50 AM Page 1



# అనర్హులను ఏరివేసేందుకే సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన

## - మంత్రి కొలుసు పార్థసారథి



**సచివాలయం,ఆగస్టు 20,ప్రభాతవార్త :** బోగస్ సదరం సర్టిఫికెట్లతో దివ్యాంగుల ఫింఛన్లను పొందే అనర్హులను ఏరివేసేందుకే సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు.గతంలో ఉన్న అర్హతలను బట్టి సర్టిఫికెట్ల పునః పరిశీలన జరుగుతుందని, అర్హతలను మారి ్చ ఫించనుదారులకు అన్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం ఏ మాత్రం ప్రవర్తించదు లేదని ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా ఫింఛను పథకం క్రింద దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే రూ.6000 ఫించన్ గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు కూడా మంజూరు చేసి దుర్వినియోగం చేయడం జరిగిందన్నారు.రాష్ట్ర ంలో మొత్తం 7.86లక్షల మంది దివ్యాంగ ఫింఛన్లు పొందడం జరుగుతుందని,వారిలో 5.10లక్షల మందికి చెందిన సదరం సర్టిఫికేట్లను పునఃపరి శీలించేందుకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. అయితే ఇప్పటివరకు 4.50 లక్షల మంది వారి సర్టిఫికేట్లు తనిఖీ చేయించుకోగా వారిలో దాదాపు ఒక లక్ష మంది అనరు ్హలు ఉన్నట్లు గుర్తించడమైందన్నారు.అదే విధంగా మిగిలిన వారు తమ సర్టిఫికేట్లు రీవెరిఫై చేయించుకునేందుకు ముందుకు రాలేదన్నారు. వీరందరికీ మరోసారి నోటీసులు జారీ చేస్తామని,అప్పటికీ వారు ముందుకు రాకపోతే వారి ఫించన్లు నిలుపుదల చేస్తామని తెలిపారు.అయితే వైద్యులు ఎవర్నైనాయితే అనర్హులుగా ధృవీకరించారో వారు మరోసారి తమ అర్జీని మండలాభివృద్ధి అధికారికిగాని, మున్సిపల్ కమీషనర్ కు గాని అందజేసినట్లయితే మరోసారి వారి అర్హతలను పరిశీలించడం జరుగుతుందన్నారు. అన్ని జిల్లాల్లో సదరం సర్టిఫికేట్ల రీవెరిఫికేషన్ జరిగిందని,అయితే అత్యధికంగా పులివెందులలో 1708మంది బోగస్ ఫించను దారులు ఉన్నట్లు గుర్తించడమైందన్నారు.అదే విధంగా మలికిపట్నంలో 1539మంది, చంద్రగిరిలో 1604మంది బోగస్ ఫించను దారులను గుర్తించడమైందన్నారు. అదేవిధంగా అత్యల్పంగా కాకినాడలో 19మంది,విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 39మంది మరియు తాడికొండలో 55మంది బోగస్ ఫించను దారులను గుర్తించడం జరిగిందన్నారు.గత ప్రభుత్వం రూ.3వేలు ఫించను ఇస్తానని హామీ ఇచ్చి ఘోరంగా మోసం చేయడం జరిగిందని,అయితే తమ ప్రభుత్వం రూ.3వేల నుండి రూ.4వేలకు పెంచడమే కాకుండా అధికారంలోనికి వచ్చిన మొదటి మూడు మాసాల ముందు నుండే పెంచిన ఫింఛను ఎరియర్సును కూడా ఫించనుదారులకు చెల్లించడం జరిగిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేలు,మంచంమీద నుండి లేవలేని అంగవికలురకు రూ.15వేలు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు ఫింఛన్ తమ ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఇమేజిను డ్యామేజ్ చేసే విధంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ విషం చిమ్మడం ఎంతో దురదృష్టకరమన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిపై గత ప్రభుత్వానికి ఉన్న ద్వేషంతో ఎటువంటి అభివృద్ధి పనులు నిర్వహించకుండా పోవడం వల్లే నేడు రాజధాని ప్రాంతం ముంపుకు గురవుతుందని కారణ మన్నారు. రాబోయే ప్రాంతంలో భవిష్యత్తులో జరిగే నిర్మాణాలు,కట్టడాలు ఏ మాత్రం వరద నీటికి గురవ్వకుండా ఉండేందుకు అవసరమైన వరద నీటి పారుదల వ్యవస్థలను ప్రభుత్వం ప్రణాళిక బద్దంగా నిర్మిస్తున్న ్నట్లు మంత్రి తెలిపారు.

# మహిళలకు భద్రతా కవచంలా శక్తి యాప్

## - మహిళా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు భద్రతా కవచంలా శక్తి యాప్ ఉపయోగపడుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. విజయవాడ కెబిఎన్ కళాశాలలో "మహిళల రక్షణ భద్రత, రక్షణ సాధికారికతపై" అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూమహిళల హక్కులు, భద్రత, సాధికారికత మహిళా కమిషన్ లక్ష్యమని చెప్పారు. మహిళలు, బాలికలు శక్తి యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఇటీవల సైబర్ నేరాలు అనే కొత్త ముప్పు పొంచి ఉందని, మహిళలు, డిజిటల్ భద్రతా చైతన్యం పెంచుకోవాలన్నారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ హెల్ప్లైన్స్, చట్టపరమైన రక్షణను ఉపయోగించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో మహిళలపై వేధింపులు జరుగుతున్నాయని, నకిలీ అకౌంట్లు సృష్టించి అపవాదులు వేయడం, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు దుర్వినియోగం చేయడం వంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు ప్రత్యేక రక్షణ కోసం 181 హెల్ప్లైన్ ద్వారా తక్షణ సహాయం పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది సభ్యులు రాధాకుమారి, మహిళా కమిషన్ కార్యదర్శి అనూరాధ, వన్స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## పూర్ణాహుతితో ముగిసిన సాంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం



**తిరుమల,ఆగస్టు 20ప్రభాత వార్తప్రతి నిధి:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందు భక్తులు ఐశ్వర్యం, ఆయురారోగ్యం, సంపదలు కాంక్షిస్తూ చేపట్టిన సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం మధ్యాహ్నం పూర్ణాహుతితో శాస్త్రో ్తకంగా ముగిసింది. తిరుమ లలో ధర్మగిరి శ్రీవేంకటేశ్వర వేదవిజ్ఞాన పీఠంలో నిర్వహించిన శ్రీనివాస విశ్వశాంతి మహాయాగంలో నాలుగు రోజులుగా 32మంది వేదపండితులు పాల్గొని వేదపారాయణం, సుందరకాండపారాయణం తదితర వైదిక క్రతువులు జరిపించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టిటిడి నిర్ణయం తీసుకుందని టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. త్వరలోనే ఈ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహాయాగం కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు.పూర్ణాహుతిలో టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఎస్వీవేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పాశివసుబ్రమణ్యం అవధాని, అర్చకులు. వేదపండితులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు

### - తిరుమల భక్తులకు ప్రాధాన్యత

### - దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్కుమార్శ్రీవాస్తవ



**తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** ప్రయాణీకులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా రైల్వే సేవ లందిస్తుందని, ఇంకా తిరుమల క్షేత్రాన్ని దృష్టిలో ఉంచు కుని నడుస్తున్న రైళ్ళలో భద్రతకు ప్రాధాన్యత ఉంటుందని దక్షిణమధ్యరైల్వే జిఎం సంజయ్ కుమార్శ్రీవాస్తవ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్ అంతర్జాతీయంగా విస్తరణ, అభివృద్ధి పనులు అనుకున్న స్థాయిలో సాగుతున్నా యన్నారు. పలు మార్పులు కూడా జరిగాయన్నారు. శ్రీవాస్తవ దంపతులు తిరుమలకు చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

# కేతిరెడ్డి పెద్దిరెడ్డికి హైకోర్టులో షాక్

# తాడిపత్రి వెళ్లేందుకు అనుమతి రద్దు

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎంఎల్ఏ కేతిరెడ్డి పెద్దరెడ్డి హైకోర్టులో షాక్ ఎదురైంది,ఆయనకు తాడిపత్రి వెళ్ళేందుకు ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన అనుమతిని డివిజన్ బెంచి బుధవారం కొట్టేసింది. ఎంఎల్ఏ కేతిరెడ్డికి తాడిపత్రి వెళ్ళేందుకు అనుమతినిస్తే తగిన భద్రత కల్పించలేమని అనంతపురం ఎస్పీ జగదీష్ హైకోర్టు డివిజన్ బెంచిలో హైకోర్టు డివిజనల్ బెంచీలో పిటిషన్ దాఖలు చేసారు.

ఆయన తాడిపత్రి వస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని

డివిజన్ బెంచి ఎదుట పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదించారు. దీనిపై డివిజన్ బెంచి న్యాయమూర్తులు సింగిల్ బెంచి ఇచ్చిన తీర్పును రద్దు చేసారు.

## ముంపునకు గురైన పొలాలు పరిశీలించిన తహసీల్దార్ గోపాలకృష్ణ



తెనాలి టౌన్ ఆగస్ట 20 (ప్రభాతవార్త):ఇటీవల కురిసిన భారీవర్షాలకు మరియు విజయవాడచెన్నై రైలుమార్గంలో జరుగుతున్న మూడోరైలు లైను పనుల కారణంగా నీటమునిగిన పొలాలను బుధవారం తహసీల్దార్ కేవి.గోపాలకృష్ణ పరిశీలించారు.రూరల్ గ్రామాలైన గుడివాడ, ఎరుకలపూడి ప్రాంతాల్లో సుమారు రెండువేల ఎకరాలకుపైగా మురుగునీటితో నిండిపోయాయని రైతులు ఆరోపించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ముంపుకు గురైన పొలాలు సర్వేచేయించి సంబంధిత రైల్వేశాఖ అధికారులతో మాట్లాడి రైతుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం గుడివాడ గ్రామంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద రైతులకు కాంప్లెక్స్ ఎరువుల బస్తాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా సాంబిరెడ్డి,తహసీల్దార్ గోపాలకృష్ణ ను కలిసి,యూరియా కొరతతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని,వారికి ప్రభుత్వం ద్వారా యూరియా పంపిణీచేసే విధంగా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తెనాలిలో ఘనంగా రాజీవ్గాంధీ జయంతి



తెనాలి టౌన్ ఆగస్ట 20 (ప్రభాతవార్త):మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా, పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో,తెనాలి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ,రాజీవ్ గాంధీ ప్రధానిగా దేశంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి,దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజి ని పరిచయం చేశారని,పరిపాలనలో యువతను భాగస్వాములు చేయటానికి,యువతకు ఓటు హక్కును 21సంవత్సరాల నుండి 18 సంవత్సరాలుగా కల్పించారన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లవరపు ప్రసాద్,మీడియా కోఆర్డినేటర్ మాదాల పూర్ణచంద్రరావు,భీమ రమేష్, చందు అయ్యప్ప, కోటేశ్వరరావు,స్టీవెన్ బాబు, అనిల్,వీరస్వామి,సురేష్, నాగూర్,కార్తీక్ శ్రీనివాసరావు, వెంకటేష్,మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు

## దోమలనిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ

తెనాలి టౌన్ ఆగస్ట 20 (ప్రభాతవార్త):ప్రపంచదోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా,ప్రజలకు అవగాహన కల్పించుటకు వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఏసుబాబు మాట్లాడుతూ,దోమల వ్యాప్తిని అరికట్టెందుకు ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు నీటిలో గుడ్లుపెడతాయి కాబట్టి ఇంటిచుట్టూ నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. అంతేకాకుండా ఇళ్లల్లో కిటికీలు, తలుపులులకు దోమతెరలు అమర్చుకోవటం ద్వారా దోమలు ఇంట్లోకి రాకుండా నిరోదించవచ్చున్నారు. అనంతరం గాంధీచౌక్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త క్రిమినల్ చట్టాలపై చర్చలు

## సిఎస్, డిజిపిలతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్



నూతన క్రిమినల్ చట్టాలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిర్వహించిన వీడియో సమావేశం

**విజయవాడ,ఆగస్టు20, ప్రభాతవార్తప్రతి నిధి:** నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఢిల్లీ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిజిపి హరీశ్ కుమార్ గుప్తాలతో వీడియో సమావేశం నిర్వహించారు.మన దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు అనగా భారతీయ న్యాయ సంహిత,భారతీయ నాగరిక్ సురక్ష సంహిత,భారతీయ సాక్ష్య అధినియం అనే చట్టాలు పాత క్రిమినల్ చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్,క్రిమినల్ ప్రొసీజర్ కోడ్.ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల స్థానే అమలులోకి వచ్చాయి.ఈనూతన క్రిమినల్ చట్టాలను క్షేత్ర స్థాయిలో పటిష్టవంతంగా అమలు చేసేందుకు వివిధ పోలీస్ స్టేషన్లు, కోర్టులు,జైళ్ళకు,ఫోరెన్సిక్ లేబరేటరీల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై ఆయన చర్చించారు.ఈసందర్భంగా హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ మాట్లాడుతూ ఫోరోన్సిక్ ఇకో సిస్టమ్ ను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని దానిలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలను మరింత పటిష్టం వంతం చేయాలని ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు సూచించారు.వాటిలో వివిధ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన వారిని కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయాలని చెప్పారు.నూతన క్రిమినల్ చట్టాల అమలులో ఎపి దేశానికి రోల్ మోడల్ గా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు సూచించారు.నేరం జరిగిన ప్రాంతాల్లో అనగా సీన్ ఆఫ్ అఫెన్స్ లో పూర్తిగా ఆడియో వీడియో చిత్రీకరణ చేయాలని,అన్ని ఎఫ్ఐఆర్లను ఇసాక్ష్యంలో పొందుపర్చాలని డిజిపికి హోంశాఖ కార్యదర్శికి గోవింద్ మోహన్ సూచించారు. నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి కోర్టు రూములు,జైళ్ళు, ఫోరన్సిక్ సైన్స్ లేబొరేటరీలు,ప్రభుత్వ కార్యాలయాల,బ్యాంకులు తదితర చోట్ల వీడియో కాన్ఫరెన్సింగ్ విధానం అందుబాటులో ఉండేలా చూడాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సిఎస్,డిజిపిలకు సూచించారు.అలాగే ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్,జీరో ఎఫ్ఐఆర్, ఇఎఫ్ఐఆర్,మానిటరింగ్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్,వివిధ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీల ఆధునికీకరణ,తగిన సిబ్బంది ఏర్పాటు,సిటిజన్ సెంట్రిక్ ప్రొవిజన్స్ అయిన ఎస్ఎంఎస్,ఇమెయిల్ సేవలను సిసిటిఎన్స్తో ఇంటిగ్రేషన్,ఫిర్యాదుదారులకు ఎస్ఎంఎస్ అలెర్టులు పంపించడం వంటి అంశాల్లో ఎపి పోలీసులు చేపట్టిన ఎపి పోలీస్ సేవా,సిటిజన్ పోర్టల్,శక్తి యాప్ వంటి వినూతన్న చర్యలను హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ప్రశంసించారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ: కమిషనర్ లక్ష్మీపతి



తెనాలి, ఆగస్టు 20 (ప్రభాతవార్త) : దోమల వ్యాప్తి అరికట్టేందుకు ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వల్లూరు మహాలక్ష్మీపతిరావు అన్నారు. కొత్తపేటలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం నుండి ప్రపంచ దోమల దినోత్సవ సందర్భంగా మలేరియా శాఖ అధికారులతో కలిసి కమీషనర్ బుధవారం పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, దోమలు, నీటిలో గుడ్లు పెట్టి తమ సంతతిని పెంచుకొనుట ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతాయని తెలిపారు. సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్రెడ్డి,యుపిహెచ్సి వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక, గంగానమ్మపేట యుపిహెచ్సి వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్రెడ్డి, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ జి.రవికుమార్, మలేరియా సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు, దాసరి శివ, నాగమల్లేశ్వరరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి రోడ్డుకు చైర్పర్సన్ రాధిక శంకుస్థాపన



తెనాలి మున్సిపాలిటీ, ఆగస్ట 20 (ప్రభాతవార్త): పురపాలకసంఘ పరిధిలోని, గంగానమ్మపేట అక్కల వారి వీధిలో నూతన సీసీ రోడ్డు మరియు డ్రైనేజి నిర్మాణాలకు, మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక బుధవారం శంకుస్థాపన చేశారు.నూటయాభై మీటర్ల రోడ్డు నిర్మాణానికి,పన్నెండు లక్షల రూపాయలు కేటాయించటం జరిగిందని మున్సిపల్ చైర్మన్ రాధిక తెలిపారు.ఈ కార్యక్రమంలో 35వ వార్డు కౌన్సిలర్ గొడవర్తి సైహరేరామ్,మున్సిపల్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, ఆంజనేయరాజు,పురపాలక సంఘ సిబ్బంది,సచివాలయ సిబ్బంది,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతిలో హాథీరాంజీ బాబా మఠం భవనాన్ని కూల్చొద్దు

**తిరుపతిరూరల్,ఆగస్టు20 ప్రభాతవార్త:** తిరుపతిలో పురాతన కట్టడమైన శ్రీహాథీరాంజీ బావాజీ మఠం భవనాలను కూల్చొద్దని, బాబా మఠానికి చెందిన 16వేల ఎకరాల విలువైన ఆస్తులను పరిరక్షించాలని తెలంగాణా జనసేన పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ నాయక్ డిమాండ్ చేసారు. బుధవారం తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం పంచాయతీలోని విద్యుత్ నగర్లో బంజరా బిడ్డలు నిర్మించే శ్రీహాథీరాంజీ బావాజీ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు నిలుపుదలపై ఆవేశం వ్యక్తపరిచారు. బాలలయంలో వున్న బావాజీ విగ్రహాన్ని సంపత్ నాయక్ దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సాక్షత్తు వేంకటేశ్వరస్వామితో పాచికలు ఆడిన పరమభక్తుడు బావాజీ బంజరా బిడ్డ కావడం తమ జాతి చేసుకున్న అదృష్టమన్నారు. శ్రీవారికి పరమభక్తుడైన బావాజీ మఠం నుంచే మొదటి నైవేద్యం వెళ్ళుతుందని, అంతటి వైశిష్ట్యం కలిగిన బావాజీ మఠాన్ని, ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత టిటిడిపైన, ప్రభుత్వంపైన ఉందన్నారు.

## భక్తులకు అందుబాటులో పుష్కరిణి

**తిరుమల,ఆగస్టు 20ప్రభాత వార్తప్రతి నిధి:** నెలరోజుల మరమ్మతుల అనంతరం తిరుమలలో శ్రీవారి పుష్కరిణి భక్తులకు బుధవారం నుండి అందుబాటులోకి వచ్చింది, పాతనీటిని తొలగించి ఇటీవల కొత్తగా నీటితో నింపారు. స్వామి వారి పుష్కరిణి మెట్లకు ఆకర్షణీయమైన రంగులు అద్దకంతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దాదాపు కోటిలీటర్ల నీటితో స్వామి పుష్కరిణి నింపారు. ప్రతిరోజూ నిర్వహించే పుష్కరిణి హారతి పునరుద్దరణ చేశారు

## బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న ఏడుకొండలు!

**తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్త పతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి సెప్టెంబర్ 24నుండి మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమలలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. తొమ్మిదిరోజులు పాటు జరిగే దేవుని ఉత్సవాలకు దేశవిదేశాల ఉండి అశేషంగా భక్తులు తరలి వస్తారనే ఏర్పాట్లు, మొదలయ్యాయి


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**పంచాయతీరాజ్ శాఖ**
**ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ ప్రకటన**
నెం.07/టి2/2025-26, నిట్ నెం.22 నుండి 29 / 2025-26, తేది: 18.08.2025
గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ నియోజక వర్గములలో జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధుల క్రింద (వివిధ పద్దులలో) మంజూరైన 8 (ఎనిమిది) పనులకు అంచనా విలువ: రూ.40.00 లక్షలకు టెండర్లు తేది: 25.08.2025 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in ద్వారా కోరబడుచున్నవి.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (పి.ఆర్) పి.ఐ.యు డివిజన్, గుంటూరు
DIPR.No.17304/CL/Advt/1/1/2022-23, తేది: 20.08.2025



కెనరా బ్యాంక్ Canara Bank
ఏ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695, ఇ-మెయిల్ : armvij@canarabank.com

**ఋణగ్రహీత / హామీదారు / తనఖాదారులకు సెక్షన్ 13 (8) క్రింద REDEMPTION NOTICE**

టు :
ఋణగ్రహీత/హామీదారులు/తనఖాదారు పేరు & చిరునామా: మెస్సర్స్ లిఖిత్ సాయి కృష్ణ ఏజెన్సీస్, ప్రొప్రయిటర్ : మందల సంజీవ రెడ్డి, రిజిష్టర్డు ఆఫీస్ : డి.నెం/ప్లాట్ నెం.18, ఫేజ్ 1 & 2, ఇంధిరా ఆటో నగర్ వార్డు -1, గుంటూరు - 522001. శ్రీ మందల సంజీవ రెడ్డి, డి.నెం.4-305, 4వ బ్లాక్, నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా - 522303. మందల సునీత, భర్త : మందల సంజీవ రెడ్డి, డి.నెం.4-305, 4వ బ్లాక్, నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా - 522303.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని రూల్ 8 (6) తో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం" గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, ఏఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్"గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "ది యాక్ట్" గా రిఫర్ చేయబడును) లోని రూల్ 8 (6) తో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత/ సంస్థ మెస్సర్స్ లిఖిత్ సాయి కృష్ణ ఏజెన్సీస్, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) వారిని బకాయి రూ.2,22,45,033/- (అక్షరాల రెండు కోట్ల ఇరవై రెండు లక్షల నలభై ఐదు వేల ముప్పై మూడు రూపాయలు మాత్రమే) + వడ్డీతో కలిపి మెస్సర్స్ లిఖిత్ సాయి కృష్ణ ఏజెన్సీస్ వారి లోను ఖాతా యొక్క బకాయి నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13 (2) క్రింద 28.04.2021 తేదీన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీతలు/ సంస్థ, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది.31.07.2021న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక/భౌతికంగా స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు లాంఛనాత్మక/భౌతిక స్వాధీనత నోటీసును రెండు స్థానిక వార్తా పత్రికలు అనగా సాక్షి (తెలుగు) & ఇండియన్ ఎక్స్ప్రెస్ (ఇంగ్లీషు)లలో తేది.16.08.2021న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది.18.08.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.5,07,35,484.44 పై (అక్షరాల ఐదు కోట్ల ఏడు లక్షల ముప్పై ఐదు వేల నాలుగు వందల ఎనభై నాలుగు రూపాయల నలభై నాలుగు పైసలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసీ చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర ...

తేది : 19-08-2025, స్థలం : విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
NIWAS HOUSING FINANCE
(పూర్వపు) ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరీ ఘట్కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093
ఇ-మెయిల్: -connect@niwashfc.com CIN నంబర్: U65990MH2016PTC271587 సంప్రదించు నం.: శ్రీ కిషోర్ కాగిత-9966111777

**[అనుబంధం-IV-A] స్థిరాస్తుల యొక్క అమ్మకానికి విక్రయ ప్రకటన 8(6) నిబంధనకు ఏర్పాటు చూడండి]**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు ఏర్పాటుతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క అమ్మకానికి ఇ-వేలం విక్రయ ప్రకటన. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 క్రింద NHFPL అధీకృత అధికారిచే రుణగ్రహీత(లు) నుండి రుణబకాయి మొత్తం వసూలు కొరకు ఇక్కడ క్రింద పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనంలోకి తీసుకొనుట విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు)కు ఇందుమూలముగా ప్రకటన జారీచేయడమైనది. దిగువ సంతకందారునిచే క్రింద ఇక్కడ వివరించబడిన విధంగా స్థిరాస్తి కొనుగోలు నిమిత్తం మా సేల్స్ & మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ భాగస్వామి Credresolution ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనగా credauction.com యొక్క వెబ్ పోర్టల్ పైన ఆన్లైన్ దాఖలుకు ఆఫర్లు కోరబడుతున్నవి.
సెక్యూర్డ్ ఆస్తులు తిరిగి పొందడానికి సమయ లభ్యతకు సంబంధించి చట్టం యొక్క 13 సెక్షన్ యొక్క ఉప-సెక్షన్ (8) యొక్క ఏర్పాటు విషయం రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది. 'ఏది ఎక్కడ ఉన్నదీ అక్కడ అలా', ప్రాతిపదికన ఏది ఎలా ఉన్నదీ అలా ప్రతిపాదికన అక్కడ ఉన్నది అలా' ప్రాతిపదికన, సహాయంపై ఆధారపడకుండా ప్రాతిపదికన సదరు ఆస్తి భౌతికంగా స్వాధీనం చేసుకోబడింది. దాని వివరాలు ఇక్కడ క్రింద పేర్కొనబడిన విధంగా.

| రుణగ్రహీత(లు) వివరాలు | డిమాండ్ నోటీసు 13(2) యొక్క మొత్తం మరియు తేదీ | రిజర్వ్ ధర బయానా జిడి పెంపు మొత్తం | ఇ-వేలం తేది & సమయం |
|---|---|---|---|
| LNGUN0HL-03210016273 బ్రాంచి : గుంటూరు-అరండల్పేట రుణగ్రహీత: లక్ష్మీ కోసంకి సహ-రుణగ్రహీత(లు): ఏడుకొండలు కోసంకి | 14.06.2024 రూ.8,07,258/- (రూపాయలు ఎనిమిది లక్షల ఏడు వేల రెండు వందల యాభై ఎనిమిది మాత్రమే) 13.06.2024 నాటికి తిరిగి చెల్లింపు వరకు ఆపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతోసహా | రూ.5,35,000/- రూ.53,500/- రూ.10,000/- | 09.09.2025 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |
| ఆస్తి కలిగి ఉన్నది: ఇ.నం.43-1a, ఇ.నం.2-72/A కలిగి ఉన్న, 108-9 చ.గజాలు M యొక్క విస్తీర్ణం యొక్క స్థలం RCC ఇల్లుతో, క్రోసూరు మండలం, భయ్యవరం గ్రామ పంచాయతీ, భయ్యవరం గ్రామం, గుంటూరు జిల్లా వద్ద ఉన్నది ఆస్తి యొక్క మొత్తం అదంతా. నాలుగు సరిహద్దులు: ఉత్తరం: గల్లీ బజార్ 70 లింకా, దక్షిణం: చెన్నవరపు రామయ్య యొక్క ఇల్లు 70 లింక్లు, తూర్పు: 6 అ. వెడల్పు దారి శివాలయానికి మార్గం, 33 లింక్లు, పడమర: గల్లీ బజార్, 31 లింకా. | | | |
| LNGUNLAP-10210019398 బ్రాంచి : గుంటూరు-అరండల్పేట రుణగ్రహీత: శ్రీనివాసరావు మార్తాల సహ-రుణగ్రహీత(లు): విజయ మల్లేశ్వరి మార్తాల | రూ.4,89,813/- (రూపాయలు నాలుగు లక్షల ఎనభై తొమ్మిది వేల ఎనిమిది వందల పదమూడు మాత్రమే) 14-మే-2024 నాటికి తిరిగి చెల్లింపు వరకు ఆపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతోసహా | రూ.6,70,000/- రూ.67,000/- రూ.10,000/- | 09.09.2025 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |
| ఆస్తి కలిగి ఉన్నది: గుంటూరు జిల్లా, నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పెదకూరపాడు ఉప-జిల్లా, పెదకూరపాడు మండలం, లగడపాడు గ్రామ పంచాయతీ ఏరియా, లగడపాడు గ్రామం వద్ద ఉన్న ఇ.నం.88/1, ఎక.3-18 సెంట్లులో, ఇ.నం.3-95, అసెస్మెంట్ నం.549, 144-2 చ.గ. యొక్క విస్తీర్ణం యొక్క స్థలంతో 20 సంవత్సరాల పాత RCC ఇల్లుతో అందులోని అన్ని ఫిక్చర్లు మరియు ఫిట్టింగ్లతో ఉన్నవన్నీ, ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు ఈ క్రింది విధంగా: తూర్పు: గురజాల రామచంద్రరావు యొక్క ఇల్లు 43 అ., పడమర: పంచాయతీ బజార్ 45 అ., ఉత్తరం: అనుమల నాగేశ్వరరావు ఇతరుల యొక్క ఇల్లు 32 అ., దక్షిణం: ములుగ్గూరి శ్రీనివాసరావు మరియు ఇతరుల యొక్క స్థలం 27 అ. | | | |

ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలు :
1. విక్రయం యొక్క సవివరమైన నియమాలు మరియు నిబంధనలకు దయచేసి www.niwashfc.com పై ఏర్పాటు చేయబడిన లింక్కు రిఫర్ చేయండి ...

ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేది : 21.08.2025
సం/- అధీకృత అధికారి, నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున

వార్త

నేను ఏ పని చేయలేను అని అనుకున్నందువల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. 'ప్రయత్నిస్తాను' అనుకున్నప్పుడే ఏదైనా సాధించగలుగుతాం.

-జె. హెలెన్

# జీఎస్టీ భారాల కుదింపు?

జీఎస్‌టి సంస్కరణలతో పన్నుల వడ్డన తగ్గుతుందని, ఇకపై హేతుబద్ధమైన పన్నుల వసూళ్లు మాత్రమే జరుగుతుందని సర్వేసర్వత్రా సంతోషం వ్యక్తమౌతోంది. కొత్తగా రాబోయేజిఎస్‌టి విధానంలో 5,18శాతం శ్లాబులు మాత్రమే ఉంటాయి. వచ్చేనెలలో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కూలంకషంగా చర్చించి సూత్రప్రాయంగా అంగీకరిస్తారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో ప్రస్తుతం నాలుగు శ్లాబులుండగా 12,28 శాతం శ్లాబ్‌లకు స్వస్తి చెప్పడం ఆహ్వానించదగిన పరిణామం. జీఎస్టీ అనగానే సామాన్య వినియోగదారులు వ్యాపారులు సైతం భయపడిపోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతమున్న విధానంలో నిత్యావసర వస్తువులపై 5 శాతం, సాధారణ వస్తువులపై 12 శాతం, ఎలక్ట్రానిక్స్ సేవలపై 18 శాతం, విలాస, హానికారకాలపై 28 శాతం జీఎస్టీ ఉండేది. క్రమేపీ పన్ను సంస్కరణల సమీక్షలో ఎప్పటికప్పుడు విధాన నిర్ణయాలు జరుగుతూనే ఉన్నాయి. సవరించిన విధానానికి లోబడి జౌళి, ఎరువులు, పునరుత్పాదక విద్యుత్తు, ఆటోమేటిక్, హస్తకళలు, వ్యవసాయం, వైద్యం, బీమారంగాలకు పన్నులు తగ్గుతాయి. గృహ వినియోగ వస్తువులపై జిఎస్‌టి తగ్గుతుంది. సమాజానికి హానికారకంగా ఉండే పాన్‌మసాలా, పొగాకు ఉత్పత్తులకు 40శాతం ఉంటుంది. ప్రస్తుతం సంప్రదాయ వాహనాలపై 28శాతం పన్నుండగా అదనంగా 1-22 శాతం పరిహార సెస్ విధిస్తున్నారు. కొత్త జిఎస్‌టి అమలైతే కార్లపై పన్నులు తగ్గి సామాన్యుడికి చిన్నకార్లు అందుబాటులోకి వస్తాయి. వాటికి గిరాకీ, విక్రయాలు పెరుగుతాయి. సామాన్యుడికి సుంకాల భారం తగ్గితేనే జీవన పరిస్థితులను సరిదిద్దుకోగలడు. అలాంటి ప్రయోజనాలు కల్పించే దిశగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆలోచిస్తోంది. జీఎస్టీ శ్లాబులను తగ్గించి వారికిమంచి చేయాలనే సంకల్పంతో ముందడగు వేస్తోంది. వస్తు సేవల పన్నులు తగ్గితే భారత జిడిపిలో0.6శాతం వృద్ధి కలుగుతుందని ఇప్పటికే ఆర్థిక శాస్త్రవేత్తలు గణించారు. వారి సూచనల మేరకు జీఎస్టీ విధానంలో మార్పులు తెస్తున్నారు. ప్రజాసంక్షేమం కోసం జీఎస్టీ సుంకాల తగ్గింపునకు జిఎస్టీనే క్రమబద్ధీకరించడం మేలైన పద్ధతిగా ఆర్థికవేత్తలే నిర్వచించారు. 'ఒకే దేశం ఒకే పన్ను'వ్యవస్థగా ఎనిమిదేళ్ల క్రితం జీఎస్టీ విధానానికి రూపకల్పన చేసిన కేంద్రం సామాన్యునికి అందుబాటులోకి వచ్చే విధంగా పన్నుల వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించడం స్వాగతిద్దాం. చేనేత వస్త్రాలపై ఐదు శాతం జీఎస్టీ విధించిన కేంద్రం 12 శాతానికి పన్ను పెంచాలన్న ప్రతిపాదన చేసింది. వ్యవసాయం తర్వాత చేనేత రంగం ప్రాధాన్యత చెందింది. ఇప్పటికే చేనేత కార్మికులు తమ వృత్తిని వదలలేక, ఉన్నవృత్తిలో బతుకలేక దీనావస్థలో ఉండగా ప్రభుత్వ ప్రతిపాదనలు వారి జీవన విధానంపై దాడిచేస్తున్నాయి. ప్రస్తుత చేనేత రంగంపై వాటి ఉత్పత్తులపై పూర్తిగా జీఎస్టీ రద్దు చేయడమొక్కటే కేంద్ర ప్రభుత్వానికి తక్షణకర్తవ్యం కావాలి. సమీపంలో ఎలాంటి ఎన్నికలు లేకపోయినా మొన్న పంద్రాగస్టునాడు ఎర్రకోటపై ప్రధానినరేంద్రమోడీ మాట్లాడుతూ దీపావళి నాటినుండి కొత్త జీఎస్టీ ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఇదే జరిగితే సామాన్యుడికి ప్రాణం హాయిగా ఉంటుంది. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు బడుగు జీవులపై పరోక్షంగా పడేసుంకాల భారాన్ని తగ్గించేందుకు ఎన్డీయే ప్రభుత్వపాలన ఎంతగానో కృషి చేయాలని తపిస్తోంది. తొలుత జీఎస్టీ పన్నుల విధానం అమలులోకి వచ్చినప్పుడు కూడా ఎన్నో అభ్యంతరాలొచ్చి పడ్డాయి. ఏమైతేనేం తాజా సంస్కరణలనుబట్టి జీఎస్టీపన్నువసూళ్లను హేతుబద్ధీకరణ జరిగినట్లే భావించాలి. ఇటీవల కర్ణాటకలో వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకుల ఫోన్ యాప్‌లద్వారా జరిగే చెల్లింపులను ఆసరాగా తీసుకొని ఆ రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ 13వేలమంది చిన్నపాటి వర్తకులకు నోటీసులుపంపి అగచాట్లకు గురిచేసింది. తద్వారా వినియోగదారులపై పన్నుల భారంవేసే ప్రయత్నం జరిగింది. పరోక్షంగా వినియోగదారుల మీద, ప్రత్యక్షంగా వీధి వర్తకుల మీద సుంకాల భారం పడిందన్న మాట. ఈ పన్నులవిధానం పట్ల వినియోగదారుల నుంచి ఎన్నో అభ్యంతరాలొచ్చినప్పుడు దేశంలో సగటు వసూళ్లు రెండు లక్షల కోట్లపై మాటే. ఎంఎస్ఎంఇ పరి శ్రమలు జిఎస్‌టి తకరారుతో చాలా ఇబ్బంది పెట్టారు. వస్తుసేవల ధరలు తగ్గడమంటే సామాన్యుడి నెత్తినపాలు పోసినట్లే. శీతలీకరించిన కూరగాయలు వంటి ప్యాకేజీ ఫుడ్స్, నాన్ ఎలక్ట్రానిక్, గృహోపకరణ పరికరాలు, కంప్యూటర్లునే కాక, వెయ్యి రూపాయలలోపు ఖరీదైన పాదరక్షలు, ఆయుర్వేద ఔషధాలు, వ్యవసాయపరికరాలు, సిమెంట్, గ్లేజ్డ్ టైల్స్ పై కూడా ఎస్టీ తగ్గుతుంది. ఆరోమా కాఫీ, కాఫీ ఉత్పత్తులు ఇటీవల కాలంలో బాగా ధరలు పెరిగిపోయాయి. కొత్త జీఎస్టీ ప్రతిపాదనల్లోవీటిపై సుంకాలు తగ్గనున్నందున కాఫీ ప్రియులకు పసందైన వార్త యిది. మోటారు సైకిళ్ల పై దాదాపు పదిశాతం పన్నులు తగ్గుతాయన్న ఆశాభావంతో దేశప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు సామాన్యుడిని పీల్చిపిండెస్తున్నందున అలాంటి వాటిపై నిషేధం ఒక ఎత్తయితే, అధిక పన్నులు మరొకటి. కనుక 40 శాతం పన్నులు పడ్డాయి. ఇన్నాళ్లు బడుగు వర్తకులు పడిన బాధలు దీపావళి నాటికి కొండెక్కిపోతాయి. అయితే బీమా ప్రీమియంల చెల్లింపుల పై జీఎస్టీని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి. కానీ వీటి విషయమై ప్రభుత్వం ఇంకా ఆలోచించినట్లు లేదు. కాగా న్యాయంగా హేతుబద్ధమైన పన్నులతో తెచ్చే ఏ ప్రతిపాదనను భారతీయులెవరూ అభ్యంతర పెట్టబోరు. కొత్త జీఎస్టీ నిషేధం అమలైతే సామాన్యుడు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది.

దేనినైనా అసహ్యించుకోవడం తేలిక, సంస్కరించుకోవడం చాలా కష్టం.



బర్ట్రండ్ రస్సెల్

తెలిసిన వాడు సత్యం కోసం వాడిగా వేడిగా వాదిస్తాడు. తెలియనివాడు తన అభిప్రాయం కోసం వాదిస్తాడు.



టాల్‌స్టాయ్

# ప్రజావాక్కు



### తిరుమల దర్శనం దివ్యంగా కల్పించాలి

కలియుగ వైకుంఠమైన తిరుమలకు ఆపదమొక్కులవాన్ని దర్శనానికి ప్రతి హిందువు అత్యంత భక్తిశ్రద్ధలతో వెళ్తుంటారు తమ కష్టాలను కడ తీరుస్తాడని అపారమైన నమ్మకం! అలిపిరిలో భద్రతా కారణాలతో ప్రతిభక్తున్ని, వారి వెంటఉన్నసంచులను సామాగ్రిని నిశితంగా పరిశీలిస్తారు. ఇది అత్యంత అవసరం. కానీ వయోధికులు స్త్రీలు పిల్లలు తమతమసంచులను ఇతరసామాగ్రిని వాహనాల నుండి దించి పరిశీలన తర్వాత మరల వాహనంలో పెట్టుటకు అత్యంత ప్రయాసలకు లోనుకావలసి వస్తుంది. తిరుమలలో కేంద్ర రిసెప్షన్ కార్యాలయంలో గదులు పొందిన తర్వాత వాటివద్దకు పోవుటకు అత్యంత వ్యయం వెచ్చించవలసి వస్తున్నది. దేవదేవుని దర్శనానికి భక్తులను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నవిధానాన్ని దర్శనం తర్వాత బయటకు వెళ్లేంతవరకు కూడా అదే విధంగా కొనసాగించాలి.

- దండంరాజు రాంచందర్ రావు, సికింద్రాబాద్

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తముగా దగ్గు, జలుబు, జ్వరాల కారణంగా ఇటీవలరాష్ట్రంలోని ఆస్పత్రుల అవుట్‌పేషెంట్ సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. డెంగీ, మలేరియావంటి వ్యాధులు ఇప్పటికీ నియంత్రణలో ఉన్నప్పటికీ, ఈఏడాది డెంగీ కేసులు మళ్లీపెరగొచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది అని వైద్యనిపుణులు హెచ్చరించారు. దీనివల్ల, ఇంట్లో నీరు నిలవకుండా చూసుకోవాలని, జ్వరానికి గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. గతంలో వర్షాకాలంలో ప్రత్యేక ఫీవర్ ఓ పి కౌంటర్లను ఏర్పాటు చేయడం వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈసంవత్సరం అవసరమైనప్పుడు ప్రత్యేకఓపీక్లినిక్‌లు ఏర్పాటుచేస్తామని చెబుతున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### విద్యా ప్రమాణాలు పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి. ఆధునిక పద్ధతిలో విద్యా బోధన జరపాలి. అలాగే స్మార్ట్ బోర్డులు, ప్రొజెక్టర్లు ఉపయోగించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ముఖ్యంగా టాయిలెట్‌లు, బెంచీలు, మంచినీరు, తదితర సదుపాయాలు కల్పించాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### సామాన్యులకు ఊరట కలుగునా?

మొన్న ఆగష్టు 15,2025, శుక్రవారం రోజున ఎర్రకోట వేదికగా దేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ, జీఎస్టీ (సరుకులుమరియు సేవల పన్ను) భారం తగ్గించేందుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మధ్యతరగతి మన ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం. వారి జీవన ఖర్చులు తగ్గేలా జీఎస్టీ స్లాబ్‌లను సరి చేయడానికి కౌన్సిల్‌లో చర్చలు జరుగుతున్నాయి. ఈ సవరణలు పేదలు, మధ్యతరగతి వ్యాపారవేత్తలు, చిన్న వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తాయి అనే భావంతో ప్రకటన చేశారు. ప్రధానమంత్రి మాటల ప్రకారం, దీపావళికి ముందు ఈ సవరణలు అమలు కావచ్చునని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కొత్త తరం జీఎస్టీ సవరణలు అమలైతే, హెల్త్ ఇన్సూరెన్స్, విద్య, రోజూవారీ అవసరాల ఖర్చులు తగ్గడంవల్ల సామాన్య కుటుంబాలు ఆర్థికంగా ఊపిరి పీల్చుకోగలరు. ఏదే మైనా, ప్రధానమంత్రి గారి హామీతో జీఎస్టీ స్లాబ్లు తగ్గితే, అది సామాన్యులకు ఆర్థిక ఊరటను అందించడమే.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భూ భారతిని అమలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంబంధించిన సమాచారం కోసం భూ భారతి చట్టాన్ని తీసుకు రావడం జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణిని పోర్టల్ లో అవకతవకలు జరిగాయి అని కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి తీసుకువచ్చింది. కానీ భూభారతిలో కూడా రైతులకు న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టాదారు పాసు పుస్తకాలలో తప్పులను సవరించడం లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### అమెరికా ఎవరినీ ఎదగనివ్వదు

గత వందేళ్లుగా అమెరికా ప్రపంచంలో తిరుగులేని మహాశక్తిగా నిలిచింది. తమ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన ఏ దేశాన్నైనా అంతం చేయడంలో వెనుకాడదు. జపాన్ ఎదురు తిరిగితే అణుబాంబులు వేసి పాతాళానికి తొక్కేసింది. అమెరికా శక్తికి ప్రధాన కారణం దాని వ్యాపార సామ్రాజ్యం. ప్రపంచంలోని టాప్ 10 పారిశ్రామికవేత్తల్లో 89 మంది అమెరికన్లే. చైనాకు చెందిన జాక్ మా మూడోస్థానానికి చేరినప్పుడు, అతడిని దెబ్బ తీయడానికి లాబీయింగ్ మొదలుపెట్టారు. ఇప్పుడు భారతీయ పారిశ్రామికవేత్తలైన అదానీ, అంబానీలను టార్గెట్ చేస్తున్నారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# వృద్ధులను జాతి సంపదగా గుర్తించాలి

**ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్‌ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్నవారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొందగలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు.**



రామ కిష్టయ్య సంగన భట్ల

బాల్య, కౌమార, యవ్వన, వృద్ధాప్యాలు జీవితంలో ఏ ప్రాణికైనా తప్పనిసరిగా సంభవించే జీవన రేఖలు. ఎండుటాకును చూసి పచ్చటాకు నవ్వింది అని తెలుగులో ఒకసామెత ఉంది. పండిపోయి చెట్టు నుంచి రాలే ఎండు టాకును చూసి చెట్టురెమ్మలకు వేలాడే పచ్చటాకు నవ్విందట. అది గమనించిన ఎండుటాకు పిచ్చిమొహమా రేపు నీకు కూడా నా గతే కదే.. అని పకపకమంటూ ఆ ఎండు టాకు రాలిపోయిందట. మనిషి జీవిత చక్రంలో వచ్చేమార్పు లు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తీ తుదిశ్వాస ఉన్నంతవరకు, ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. వృద్ధాప్యం లేదా ముసలితనం మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరం రోగ నిరోధక శక్తిని క్రమక్రమంగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యంగా చెప్పవచ్చు. నేడు పిల్లలుగా, యువజనులుగా, నడివయస్కులుగా పాత్రలు పోషిస్తున్న అందరూ వృద్ధుల బృందంలోకి అడుగు పెట్టే పరిస్థితి తప్పక వస్తుంది. యవ్వన దశలో వారు సమాజానికి అవసరమైన సమస్త ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొని రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు తమవంతు కృషి చేసి ఉంటారు. పనులు మాని, లక్ష్యాలు పూర్తి చేసుకుని ఉత్పత్తికి దూరమై విశ్రాంతి తీసుకుంటూ జీవన చరమదశను ముగిద్దామని దీర్ఘ సెలవులో ఉన్న జాతి నిర్మాతలేవృద్ధులు. అందుకే వారికీ ఓ రోజును కేటాయించి సమాజానికి వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఆగష్టు 21న అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే జరుపుకుంటున్నారు. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఇప్పుడు 60 ఏళ్ల వయసును కలిగి ఉన్నారు. 2050 నాటికి ప్రపంచంలోని ప్రతి అయిదు మందిలో ఒకరు 60ఏళ్లు ఆ పైబడి వయసు కలిగి ఉంటారట. 2150వ సంవత్సరానికి ప్రపంచంలో ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు ముదుసలిగా ఉంటారట. సీనియర్ సిటిజన్లుగా పేరు పడిన ఈ వయోవృద్ధుల అవసరాలు తీర్చే కృషిలో వ్యక్తులూ, సమాజమూ పునరంకితం అయేందుకు గాను ప్రపంచం వ్యాప్తంగా అన్ని దేశాలూ అంతర్జాతీయ వృద్ధాప్య దినాన్ని జరుపుతున్నాయి. తన కుమారులకు, కుమార్తెలకు, మనుమళ్లకు, ముని మనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా వృద్ధుల సంక్షేమానికి కొన్ని జాతీయ ప్రణాళికను, కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత 2007లో వృద్ధుల కోసం పోషణ, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే, ఈచట్టాలు అమలుకు పూర్తిగా నోచుకోవడం లేదన్నది తెలిసిన సత్యమే. వృద్ధుల సమస్యల పరిష్కారానికి సమాజంలో ప్రతిఒక్కరూ శ్రద్ధచూపాలి. వేధింపులు, ఆరోగ్య సమస్యల నుంచి వృద్ధులను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులంతా చొరవ చూపాలి. జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశకావడంతో వారిలో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని ప్రతివారూ తెలుసుకోవాలి. ప్రస్తుతం అరవయ్యేళ్ల వయసు దాటిన వారు దేశంలో 15



కోట్ల మేరకు ఉంటారని అంచనా. వీరిలో సుమారు కోటిన్నర మందికి పైగా ఒంటరి జీవితం సాగిస్తున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, ఔషధాలు అందుబాటులోకి రావడంతో ఆయుర్దాయం పెరుగుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య అదేస్థాయిలో అధికమవుతోంది. ప్రపంచంలో ఎక్కువ మంది వృద్ధులు ఉన్న దేశంగా చైనా మొదటిస్థానంలో ఉంది. ఇక్కడ 60ఏళ్లకు పైబడినవారు 16.7 కోట్ల మంది, 80 ఏళ్లకు పైబడిన వారు పది లక్షలమంది ఉన్నారు. 80ఏళ్లకుపైబడిన వారి సూపర్ సీనియర్ సిటిజన్స్ అంటారు. జపాన్‌లో నూటికి 30 శాతం మంది 60 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. 2050 నాటికి 64 దేశాలు 30 శాతం వృద్ధులతో నిండిపోతాయి! అంటే వృద్ధుల జనాభా 120కోట్లకు చేరుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం వృద్ధులుంటారని ఐక్యరాజ్యసమితి చెబుతోంది. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 30 కోట్లపైనే ఉండే అవకాశముంది. మన దేశంలో ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. హెల్పేజ్ ఇండియా అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల కనీస బాధ్యత. వయసుడిగిన దశలో తమ వారసుల నుంచి వారు కోరుకునేది ప్రేమపూర్వక పలకరింపు, ఆదరణ, అభిమానాలే తప్ప ఆడంబరాలు, విలాసాలు కాదు. వృద్ధాప్యంలో ఆరోగ్యసమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక సమస్యలు వారిని చుట్టు ముడుతాయి. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సి ఉండాలి. 60 ఏళ్లు పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగం చేసుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుంది అనడంలో అతిశయోక్తిలేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారే కాదు, సంపన్న కుటుంబాలలోనూ వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి తమ పని పూర్తయిందనుకుంటున్నారు. రేపు తమదీ ఇదే బతుకని వారు మరచిపోతున్నారు. సంతానం ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా పిల్లలు కళ్లముందున్నప్పటికీ కొందరు వృద్ధులు అనాథలుగా మారుతున్నారు. ఆవేదనతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. సంపాదన అనే వ్యామోహంలో పడి కొందరు యువకులు తల్లిదండ్రుల ప్రేమను పోగొట్టుకుంటున్నారు. మరికొంత మంది బంధాలను దూరం చేసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో వృద్ధుల స్థితిగతులపై హెల్పేజ్ ఇండియా వెలువరించిన నివేదికలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. సొంత కుటుంబ సభ్యులనుంచే నిరాదరణ ఎదురవుతోందంటూ 56శాతం వృద్ధులు స్పందించారు. కుమారుల్లో 57 శాతం, కోడళ్లలో 38 శాతం పెద్దవారిని ఆదరించడం లేదట. తమ హక్కుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై వృద్ధుల్లో కొంతవరకు అవగాహన ఉన్నప్పటికీ, కుటుంబ గౌరవం మంటగలుస్తుందన్న భయంతో పోలీసులను ఆశ్రయించటం లేదన్నది 52 శాతం వృద్ధుల స్పందన. వృద్ధులపై వేధింపుల నిరోధానికి కేంద్రం ఒక చట్టం చేసింది. తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ నిర్వహణ చట్టంగా వ్యవహరించే దీని గురించి చాలామంది వృద్ధులకు తెలియదు. గ్రామీణ వృద్ధుల్లో 45 శాతం మంది దీర్ఘకాల అనారోగ్యాలతో బాధపడుతున్నారని జాతీయనమూనా సర్వే తెలిపింది. ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్ ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్న వారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొందగలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు. ●

# కేన్సర్ విస్తరణను నిరోధించలేమా?

సి. హెచ్. ప్రతాప్

భారతదేశంలో ఆరోగ్య రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. వాటిలో అత్యంత ఆందోళనకరమైనది క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుదల. గుండె, ఊపిరితిత్తుల వ్యాధుల తరువాత దేశంలో మరణాలకు కారణమవుతున్న మూడవ ప్రధాన వ్యాధి క్యాన్సర్. అయినప్పటికీ దీనిపై తగిన శ్రద్ధ తీసుకోవడంలో లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం దేశంలో దాదాపు ప్రతి లక్ష మందిలో వందమంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని అంచనా. భారత వైద్య పరిశోధన మండలి వివరాల ప్రకారం 2023లో పద్నాలుగు లక్షల మందికిపైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. ప్రతి సంవత్సరం సుమారు ఎనిమిది లక్షల కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయి. కానీ ఈ పెరుగుతున్న వ్యాధి భారానికి సరిపడే వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. క్యాన్సర్ చికిత్స కేంద్రాలు దేశవ్యాప్తంగా వంద పట్టణాలు, నగరాలకే పరిమితం కాగా, ఎక్కువ మంది రోగులు చిన్న పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తున్నారు. ఫలితంగా వారు పెద్ద నగరాలకు వెళ్లక తప్పదు. ఖరీదైన ఔషధాలు, రేడియోథెరపీ పరికరాల కొరత, శిక్షణ పొందిన వైద్యుల లేమి రోగులను మరింత ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ప్రభుత్వం నిర్వహించే ఆసుపత్రుల్లో కేవలం మూడో వంతు రోగులకే చికిత్స లభిస్తున్నప్పుడు, మిగిలిన వారు ప్రైవేటు ఆసుపత్రుల అధిక ఖర్చులు భరించలేక ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు. చాలామంది కుటుంబాలు ఆస్తులు అమ్ముకుని చికిత్స కోసం నిధులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. క్యాన్సర్ కేసుల పెరుగుదలకు అనేక కారణాలున్నాయి. వాయు కాలుష్యం, జీవనశైలి మార్పులు, ధూమపానం, మద్యపానం, అస్వస్థకరమైన ఆహారం, శారీరక శ్రమలేమి, వారసత్వ కారణాలు ఇవన్నీ దీనికి తోడ్పడుతున్నాయి. అయితే ప్రధాన సమస్య వేళలో నిర్ధారణ జరగకపోవడం, చాలామంది రోగులు చివరి దశలోనే ఆసుపత్రులకు చేరుతున్నారు. దాంతో చికిత్స ఫలితాలు తగ్గిపోతున్నాయి. భారతదేశంలో క్యాన్సర్‌రోగుల ఐదేళ్ల జీవన శాతం కేవలం ముప్పై శాతం మాత్రమే ఉండగా, యూరప్, అమెరికా దేశాల్లో ఇది తొంభైశాతం వరకు ఉంది. వాస్తవానికి కొన్ని రకాల క్యాన్సర్‌లు పూర్తిగా నివారించదగినవిగా ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయదగినవిగా ఉంటాయి. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక క్యాన్సర్ మరణాలు నమోదయ్యే దేశంగా నిలుస్తున్నా, సమర్థవంతమైన స్క్రీనింగ్ విధానం అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. 2010లోనే ప్రారంభించిన జాతీయ క్యాన్సర్, మధుమేహం, గుండె వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్ నివారణ నియంత్రణ కార్యక్రమం (ఎన్‌పిసీడిసిఎస్) ప్రధానంగా గర్భాశయ ముఖం, మౌఖికం, వక్షోజ క్యాన్సర్ల స్క్రీనింగ్ పైనే దృష్టి పెట్టింది. ఇవే దేశంలో మొత్తం క్యాన్సర్ కేసుల మూడో వంతును ఆక్రమిస్తున్నాయి. అలాగే ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జనఆరోగ్య యోజన కింద ఒకటిన్నర లక్షకు పైగా ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలను క్యాన్సర్ గుర్తింపు కేంద్రాలుగా ప్రకటించారు. కానీ ఫలితాలుమాత్రం నిరుత్సాహకరంగా ఉన్నాయి. నీతి ఆయోగ్ నివేదిక స్పష్టంగా చెప్పినట్లుగా, గ్రామీణ స్థాయిలోనైనా, పట్టణ స్థాయిలోనైనా ప్రాథమిక స్క్రీనింగ్‌లో పెద్దగామార్పు జరగలేదు. నేలస్థాయి వాస్తవాలు కేంద్రం దృష్టికి వచ్చినా సమగ్ర వ్యూహం లేకపోవడం బాధాకరం. క్యాన్సర్ వ్యాధి భారాన్ని తగ్గించాలంటే ముందుగా స్క్రీనింగ్‌ను బలపర్చడం తప్పనిసరి. పాలనా స్థాయిలో కూడా ఈ వ్యాధి తగిన ప్రాధాన్యం పొందడం లేదు. మొత్తం ఆరోగ్య బడ్జెట్‌లో ఐదో వంతుకన్నా తక్కువ నిధులే కేటాయిస్తున్నారు. ఇది సమగ్ర వ్యూహ రూపకల్పనకు పెద్ద అడ్డంకిగా మారుతోంది. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఔషధాలపై అపార ఖర్చులుపెట్టినా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాథమిక ఔషధాలే అందుబాటులో లేవు. అందువల్ల క్యాన్సర్ మరణాల డెబ్బై శాతం కంటే ఎక్కువ తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లోనే జరుగుతున్నాయి. భారతదేశంలోనూ ఇదే దృశ్యం. ఈ నేపథ్యంలో పాలకులు తక్షణం దృష్టి పెట్టాల్సిన అంశాలున్నాయి. జిల్లాస్థాయి ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించే అవకాశం కల్పించాలి. రేడియోథెరపీ పరికరాలు, నైపుణ్యం కలిగిన వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండేలా వైద్యమౌలిక సదుపాయాలను విస్తరించాలి. పేద కుటుంబాలకు సరసమైన ధరల వద్ద ఔషధాలు లభించేలా విధానం రూపొందించాలి. ●

# భారత్ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి



డాక్టర్ ఎనుగొండ నాగరాజు నాయుడు

ప్రపంచాన్ని కొన్ని వందల సంవత్సరాలుగా పాలించి శాసిస్తున్న పాశ్చాత్య దేశాలను తట్టుకొని నిలబడాలంటే వాటికి సమాన స్థాయిలో ఎదగాలంటే చైనా లాగా భారత్ కూడా స్వయం సమృద్ధిని సాధించాలి. ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా చైనా ప్రతీకార సుంకాలు విధించినట్టుగా భారత్ కూడా అడుగులు వేయాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ఫలితంగా మన ఎగుమతులు తగ్గిపోతే మిగిలినవి మనదేశంలోనే మనం అమ్ముకోగలమా? లోకల్ మార్కెట్లు విస్తరించేలాగా ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించి వ్యయం చేయగలదా? దానికి నిధులు ఎక్కడివి? ధనవంతులపై పన్నులు వేయాలి కదా దీనినే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు ఒప్పుకోరు. ఫలితంగా దేశంలోస్థూల డిమాండ్ పడిపోతుంది. ఆర్థిక సంక్షోభం వైపుగా భారత్ ఆర్థికవ్యవస్థ పోతే ఉద్యోగిత ఉత్పత్తి ఆదాయాలు తగ్గిపోతాయి. సుంకాలు విధించడం వలన అమెరికాలో అవన్నీ పెరగవచ్చు కానీ మిగతా ఆర్థిక వ్యవస్థలు భవిష్యత్తు ఏమిటి? ప్రపంచ ఆర్థికవ్యవస్థలో స్థూలడిమాండ్ పడిపోతుంది. దీనినే సార్థక డిమాండ్ లేని పరిస్థితి అని అంటారు. అంటే సప్లై డిమాండు సమతుల్య స్థితి లేని పరిస్థితి. అదే 1930 లలో ఆర్థిక మాధ్యానికి కారణం. ఒకవేళ ఉత్పత్తులు ఇప్పటికే గణనీయంగా పెరిగి ఉంటే ప్రజలకు ఆదాయాలు కల్పించాలి కాబట్టి పని కల్పించేందుకు గుంతల తవ్వమనండి అదే గుంతలు పూడ్చమనండి. వారికి వేతనాలు మాత్రం ఇవ్వండి తద్వారా ఆదాయాలు పెరిగి ప్రజల డిమాండ్ పెరిగి ఈ పెరిగిన కొనుగోలు శక్తితో మిగులు ఉత్పత్తులను వారు కొని ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. తద్వారా సప్లై డిమాండ్ సమానమవుతుంది. ఇప్పటి ప్రభుత్వాలు ఈ పని చేయగలవా? పెట్టుబడిదారుల చేతుల్లో ఉండే ప్రభుత్వాలు అందుకు పూనుకోలేవు దేశంలో ఆర్థిక వృద్ధి అంతా పెట్టుబడిదారుల చేతుల్లోనే జరుగుతున్నది కదా ప్రజల భాగస్వామ్యం నామమాత్రమే కదా? అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా మరికొన్ని దేశాలు తమ సుంకాలను కూడా పెంచవచ్చు. కానీ అలా పెంచినంత మాత్రాన ప్రపంచ వస్తు సేవల స్థూల డిమాండ్ పెరగదు. ఈ దేశాలన్నీ దాదాపుగా నయా ఉదారవాదానికి లోబడే వ్యవహరిస్తున్నాయి. అవి తాము పెంచిన సుంకాల వలన వచ్చిన అదనపు ఆదాయాన్ని ప్రజలపై ఖర్చు చేస్తారా? తమ దేశాల్లోనే సంపన్నులకుమరింత రాయితీలు కల్పించడానికి ఖర్చు చేస్తాయి. అంతే తప్పప్రజల ఆదాయాలను డిమాండ్‌ను పెంచేలా ఖర్చు చేయవు. ఆ దేశాలలో అటు దేశీయ కార్మికులకు కొనుగోలు శక్తి పడిపోతుం




ది. ఎగుమతులు తగ్గిపోయి ఉపాధి తగ్గుతుంది. ఇటు దేశీయ వ్యయం పెరగదు దాని ఫలితంగా ప్రపంచ స్థూల డిమాండ్ మరింత పడిపోతుంది. ప్రతీకార సుంకాల విధింపు ద్వారా ఆయా దేశాలు తమ అమెరికా ఎగుమతులు తగ్గించుకొని ఆ మేరకు ఉత్పత్తిని దేశీయ మార్కెట్లోకి మళ్ళించాలి. ప్రపంచ పెట్టుబడేదారి మార్కెట్ మొత్తం మీద చూసినప్పుడు డిమాండ్ తగ్గిపోయి నయా ఉదారవాద ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరంకాక మానదు. ఇప్పుడు నయా ఉదారవాద విధానాలు మన దేశాన్ని వెనుకకు నెట్టాయి. ఇప్పుడు మన దేశం అటు రైతుల ప్రయోజనాలకైనా బలి చేయాలి లేదా ఫార్మా ఆభరణాల తయారీ వజ్రాల తయారీ వంటి రంగా ప్రయోజనాలనైనా బలి చేయాలి. ఏది జరిగినా మన దేశానికి నష్టమే. అందుచేత అసలు ఈ నయా ఉదారవాద నుండి మన దేశాన్ని బయటకు తెచ్చుకుని ఇప్పుడున్న చిక్కు పరిస్థితుల నుండి విముక్తి చేయాలి. స్వావలంబనతోనే ఆర్థిక అభివృద్ధి జరగాలి. గ్లోబలైజేషన్ వైపు అడుగులు వేయాలి. నయా ఉదారవాద విధానాల నుండి గ్లోబలైజేషన్కు వెళ్లాలి. అలా విధానాన్ని మార్చితే అప్పుడు బడా బూర్జువా వర్గం దానిని వ్యతిరేకిస్తుంది. ఎందుకంటే ఆ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకం అయిపోయి ఉంది. అటువంటి బడా బూర్జువా వర్గ ప్రయోజనలు నెరవేర్చడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం డి గ్లోబలైజేషన్ వైపు మళ్లీ ఆలోచన కూడా చేయలేదు. అందుచేత సామ్రాజ్యవాద వాదం బెదిరించినప్పుడల్లా రాజీపడేందుకే సిద్ధమవుతుంది. సామ్రాజ్యవాద పెత్తనం నుండి బయటపడి స్వాతంత్ర్యంగా మనగలడం అంటేనే నయా ఉదారవాద వ్యూహాన్ని తిరస్కరించడం. 1990లకి మునుపు నడిచిన ప్రభుత్వాలు ఈ వాస్తవాన్ని గ్రహించాయి గనుకే ఆ కాలంలో సామ్రావాజ వాదుల ఎత్తుగడలకు అవి భయపడలేదు. నయా ఉదారవాద విధానాలను ఎప్పుడైతే చేపట్టడం జరిగిందో అప్పటినుంచి మన దేశ స్వాతంత్ర్యం విషయంలో పరిమితులు ఏర్పడడం మొదలైంది. జాతీయవాదంతో మనం వలస పాలన పారదోలినట్టు ఈ సామ్రాజ్య వాదుల నయా వలసపాలనకూడా దేశాన్ని గ్లోబలైజేషన్ అనగా అమెరికా, యూరోప్ దేశాలపై ఆధారపడే ప్రభుత్వ విధానాల నుంచి తప్పించి స్వయం పోషకత్వ విధానాలవైపు ప్రభుత్వ విధానాలుండాలి. ప్రపంచ ఆర్థికరంగం ఎదుర్కొంటున్న ఈ సుంకాలవలయం నుంచి బయటకు రావాలంటే మన సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాధాన్యతఇవ్వాలి. మరలా వలసపాలనకు వ్యతిరేకంగా ఆనాడు విదేశీ వస్త్ర బహిష్కరణ చేసినట్టుగా స్వదేశీ వస్త్రాలైన ఖాదీధరించినట్లుగా ప్రస్తుతం భారతీయులుతయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని కూడా గుర్తించాలి. దీనినే ప్రధానమంత్రి మోడీ79వ స్వాతంత్ర్యదినోత్సవం నాడు ఎర్రకోటనుంచి పిలుపు ఇచ్చారు. ముఖ్యంగా చిన్నపరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రధాని కోరారు. దేశీయ తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడం అత్యవసరం. ●




# గుంటూరు వార్త






# ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రా

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 20:** ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ లకు ఊతమిచ్చేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. అమరావతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఐదు చోట్ల ఇన్నోవేషన్ కేంద్రాలను హబ్ అండ్ స్పోక్ మోడల్ లో ఏర్పాటు చేసినట్టు వివరించారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.."రతన్ టాటా ఆలోచనలను సజీవంగా ఉంచాలని ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నాం. రతన్ టాటా నిరాడంబరత, దేశానికి చేసిన సేవ అందరికీ ఆదర్శం. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను ప్రారంభించటం ఓ చారిత్రాత్మక సమయం. గివ్ బ్యాక్ టు ది సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా అవలంభించారు. రతన్ టాటా ఆలోచనల్ని భవిష్యత్ తరానికి అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్ లను ప్రారంభించాం. విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురంలోనూ దీనికి అనుబంధంగా కేంద్రాలు పనిచేస్తాయి. ఏపీలోని 175 నియోజకవర్గాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు ఉండాలని నిర్ణయించాం. యువతకు ఉన్న వినూత్న ఆలోచనల్ని క్రోడీకరించి ప్రోత్సహించేలా ఈ ఇన్నోవేషన్ హబ్ పని చేస్తుంది. యువపారిశ్రామిక వేత్తలు అవకాశాలను వాడుకోండి. టెక్నాల జీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న అంశాన్ని నేను విశ్వసించను. ఏపీ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కమ్యూనిటికీ సేవలందించేలా ఎదగాలని కోరుకుంటున్నా. అగ్రిటెక్ లో ఇన్నోవేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, ఇలా అనేక రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి." అని సీఎం వివరించారు.

**ఇంటికో పారిశ్రామికవేత్త :**

ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామిక వేత్త రావాలనేదే నా నినాదం. ఈ లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లు పనిచేస్తాయి. సరైన ప్రభుత్వ విధానాలు అవలంభిస్తే ఆదాయం, సంపద వస్తుంది. భవిష్యత్ అంతా ఐటీ రంగానిదేనని నాడు గుర్తించాను. దేశంలో ఎవరూ చేయనంతగా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశాం. సంపద సృష్టి జరగాలంటే ఆర్థిక వృద్ధి అవసరం. గత 10 ఏళ్లలో 11వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. అప్పుడు సంపద మరింతగా పెరుగుతుంది. ఈ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. దీని కోసం రాష్ట్రాన్ని, అమరావతి సహా వివిధ ప్రాంతాలను సిద్ధం చేస్తున్నాం. ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రచించాం. అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశాన్ని దేవుడు నాకిచ్చాడు. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇక విప్లవాత్మక అంశాలుగా మారబో తున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధింటంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం ఉంటేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు అందించగలం. దీంట్లో భాగంగానే అమరావతి నగరం క్వాంటం కంప్యూ టింగ్ హబ్ గా అభివృద్ధి చెందుతుంది. క్వాంటం కంప్యూటింగ్ ద్వారా రియల్ టైమ్ డేటాను విశ్లేషించి క్షేత్రస్థాయిలో అమలు చేస్తాం." అని చంద్రబాబు చెప్పారు.

**రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు**

ఏపీలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్ ల కోసం రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 24 గంటల్లో ఈ స్థాయి రిజిస్ట్రేషన్లు జరగటంపై ఏపీ ఇన్నోవేషన్ సొసైటీకి గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైంది. గిన్నిస్ వరల్డ్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు అందచేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా మయూరి టెక్ పార్కు ప్రాంగణంలో వివిధ స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు.



మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్‌లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, నాదెండ్ల మనోహర్, టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్, వివిధ సంస్థల ప్రతినిధులు.









**స్టార్టప్ లకు ఊపిరి పోసేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్**
**అమరావతితో పాటు ఐదు చోట్ల ఆర్టీఐహెచ్ కేంద్రాలు**
**రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు**
**ఆర్టీఐహెచ్ ప్రారంభంలోనే ఇన్నోవేషన్ బిజినెస్ స్టార్టప్ లకు రికార్డు స్థాయి రిజిస్ట్రేషన్లు**
**24 గంటల్లో రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లకు గిన్నిస్ వరల్డ్ రికార్డు**



## శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతగా పనిచేయాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు క్రైమ్, ఆగష్టు 20, ప్రభాతవార్త : నగరం పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతి శానిటరీ ఇన్‌స్పెక్టర్ తమ పరిధిలో పూర్తి బాధ్యతతో పనిచేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. పశ్చిమ పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. రోజువారీ చెత్త డోర్ టు డోర్ కలెక్షన్ తప్పనిసరిగా నిర్వహించాలి, ప్రధాన రహదారులు, కాలనీలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీలు, కాల్వలు క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యాసంస్థలు, ప్రార్ధనా మందిరాలు చుట్టుప్రక్కల డంపింగ్ పాయింట్స్ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఇన్‌స్పెక్టర్ తన పరిధిలోని శానిటేషన్ సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని క్రమం తప్పకుండా తనిఖీలు చేసి లోపాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన కాల్వల్లో ప్లాస్టిక్ అడ్డంకులు లేకుండా మెష్ ఏర్పాటు చేయాలని ఆమె స్పష్టంచేశారు. గుంటూరు పరిశుభ్రతలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమన్నారు. సమావేశం ముగిసిన అనంతరం తమ పరిధిలో బాగా పనిచేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఎమ్మెల్యే సన్మానించారు.



## ఉపాధ్యాయులకు అంతర్ యాజమాన్య బదిలీలు ఇవ్వండి

**-- ప్రొగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సోమరౌతు శ్రీనివాసరావు**

గుంటూరు విద్య, ఆగష్టు 20, ప్రభాతవార్త : గౌరవ శాసనమండలి సభ్యుల ప్రాతినిధ్యం మేరక ఏపి రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేస్తూ మెమో నెం.1225245/సర్వీసు 2/ఏ2/2020-1 తేది 20 ఆగస్టు 2025న ప్రభుత్వం విడుదల చేసినందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని ప్రొగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు సోమరౌతు శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యాయులకు అంతర్ యాజమాన్య బదిలీలకు కూడా అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా పరిషత్ మరియు ప్రభుత్వ ఉపాధ్యాయులకు జిల్లా యూనిట్‌గా సర్వీసు రూల్స్ ఉన్నందున వేరొక జిల్లాకు అంతర్ జిల్లా ప్రతిపాదన సరైందే. కానీ మున్సిపల్ ఉపాధ్యాయులకు జిల్లా యూనిట్‌గా సర్వీసు రూల్స్ లేనందున ఒకే జిల్లాల్లో మూడు రకాల సర్వీసు రూల్స్ అమలు జరుగుతున్న దృష్ట్యా మున్సిపల్ టీచర్స్‌కి అంతర్ మేనేజ్‌మెంట్ బదిలీలు కూడా నిర్వహించాలని కోరడమైదని. అట్లే భార్యభర్తల్లో ఒకరు జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్ మరోకరు మున్సిపల్ మేనేజ్‌మెంట్ నందు పనిచేస్తున్న వారికి కూడా అంతర్ మేనేజ్‌మెంట్ బదిలీలు ఎంతో అవసరం ఉందని కోరడమైంది. అట్లే స్పౌజ్ మరియు పరస్పర బదిలీలకు మాత్రమే అంగీకారం తెలపడం జరిగింది. దీనివల్ల ఆ రెండు అవకాశాలు లేని మరి కొందరు ఉపాధ్యాయులకు అవకాశం లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

## పోషకాహార శిబిరాన్ని సందర్శించిన శాప్ చైర్మన్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్20, ప్రభాతవార్త: వర్సిటీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోషకాహార, దారుఢ్య శిబిరాన్ని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు బుధవారం సందర్శించారు. రెండవ రోజు జరిగే పోషకాహార పరీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులే ఇటువంటి శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. సమాజంలో వైద్య పరీక్షలు ఎంతో వ్యయంతో కూడుకున్నవని పేర్కొన్నారు. వాటిల్లో కొన్ని రకాల సేవలను వర్సిటీ ఉచితంగా చేపట్టడం మంచి నిర్ణయమని అభినందించారు. ప్రతీ ఒక్కరు వారి ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ఇటువంటి సేవలు ఆయా విభాగాల వద్ద ఏర్పాటు చేసినట్లయితే ఎక్కువమందికి ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

## దాసరి రాముకు పలువురు పరామర్శ



గుంటూరు విద్య, ఆగష్టు 20, ప్రభాతవార్త : స్థానిక సిద్దార్థ గార్డెన్స్‌లో దాసరి రాము కుమార్తె అకాల మరణం సంతాపసభకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంస్థల అధినేతలు హాజరయ్యారు. దశాబ్దాలుగా కాపు, ఒంటరి, బలిజ, నాయుడు కులాల మధ్య ఐక్యతకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, దుబాయ్, సింగపూర్, మలేషియా, యూరప్ దేశాల్లో కూడా పర్యటించి దాసరి రాము కాపుల ఐక్యతకు విశేషంగా కృషిచేశారు. ఆయన కుటుంబంలో ఏకైక కుమార్తె శేష సాయి ప్రియాంక అకాల మరణం తీవ్ర విషాదాన్ని పంచిందని, చదువుకుంటూ తండ్రితో పాటు తనుగా రాజకీయ, సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్న హారికకు సద్గతులు ప్రాప్తించాలని తెలుగుదేశం పార్టీ, వైసీపీ, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు దాసరి రాము గీత దంపతులకు, కుమారుడు పవన్‌కు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, మాజీ పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, కిలారి రోశయ్య, దేగల ప్రభాకరరావు, తులసీ ధర్మచరణ్, యోగేష్, చందు సాంబశివరావు, విశ్రాంత ఎస్పీ సిహెచ్ చక్రపాణి, హారిక స్నేహితులు దాసరి రాము దంపతులను పరామర్శించారు.

సవాళ్లను అవకాశాలుగా మార్చుకొని

## ముందుకు సాగుదాం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు20:** ఆవిష్కరణలకు వనరులు అడ్డంకి కాదు, వినూత్నమైన ఆలోచనలే ముఖ్యం. ప్రతి యువకుడు విద్యార్థి దశ నుంచే మెరుపులాంటి ఆలోచనలతో ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. మంగళగిరి సమీపంలో ఎన్ హెచ్ 16 పక్కన కొత్తగా నిర్మించిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా ఎపిని తీర్చిదిద్దేందుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో కలసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈరోజు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో మీ ముందు నిలబడటం నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాదు - రాష్ట్రంలోని లక్షలాది యువతకు ఆశాకిరణం, విశ్వాస ప్రకటన, ఆంధ్రప్రదేశ్ ఏదైనా సాధించగలదనే వాగ్దానం. ఈ హబ్ భరతమాత ముద్దుబిడ్డ శ్రీ రతన్ టాటా జీ అత్యున్నత నైతిక విలువలు, మహోన్నత వ్యక్తిత్వ స్ఫూర్తితో నెలకొల్పబడింది. నేడు ఈ హబ్‌ను దివంగత రతన్ టాటాజీ ఆదర్శాలకు అంకితం చేస్తున్నాం. రాజకీయ నాయకుడిగానే మీకంతా తెలిసిన చంద్రబాబు గారు ఒక విజయవంతమైన పారిశ్రామికవేత్త. అయితే హెరిటేజ్ ప్రారంభానికి ముందు ఆయన మూడు కంపెనీలు పెట్టి విఫలమయ్యారు. ఆ తర్వాత చిత్తూరు జిల్లాలో రైతులకు సాయం చేయాలన్న సంకల్పంతో హెరిటేజ్ ప్రారంభించారు. ఆ సంస్థ ఈరోజు 12 రాష్ట్రాలకు విస్తరించి రూ.5వేల కోట్ల వ్యాపారం చేస్తోంది. వైఫల్యాలతో ఆయన తన ప్రయాణాన్ని ఆపలేదు. ఏదైనా సాధించాలంటే పట్టుదల, నిబద్ధత, ఓర్పు ఉండాలి. అప్పుడే మనం అద్భుతమైన ఫలితాలను సాధించగలమని మంత్రి లోకేష్ అన్నారు.




రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్

## జోనల్‌స్థాయి క్రీడాపోటీల ప్రారంభం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్20, ప్రభాతవార్త: వర్సిటీలో బుధవారం నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శాప్ చైర్మన్ రవినాయుడు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఈనెల 29న నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా బ్యాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల వేదికలను ఆయన సందర్శించారు. జోనల్‌స్థాయి అనంతరం నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు 29న సీయం నగదు ప్రోత్రాహకాలు, పతకాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్‌లు ఎ.రమణ రావు, ఎస్.సంతోష్ కుమార్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పాల్‌కుమార్, సిఎస్ఆర్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ యం.వి.రమణ, డిఎస్‌డిఓలు నరసింహారెడ్డి, అజీజ్, ఘనీ, లక్ష్మి, బి.రాజరాజేశ్వరి, యతిరాజ్, పాల్‌కుమార్ పాల్గొన్నారు.



## పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్20, ప్రభాతవార్త: వర్సిటీ పరిధిలో ఏప్రిల్‌లో జరిగిన ఇంటిగ్రేటెడ్ యంఏ పబ్లిక్ పాలసీ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు బుధవారం విడుదల చేశారు. 43మందికి 40మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యూయేషన్‌కు ఈనెల 29లోగా ఒక్కో పేపర్‌కు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190లు చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

**ఎంబిఏ ఐబి ఫలితాలు విడుదల**

వర్సిటీలో ఎంబిఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను సిఇ విడుదల చేశారు. 41మందికి 41మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన పేర్కొన్నారు. రీవాల్యూయేషన్‌కు ఈనెల 29లోగా ఒక్కో పేపర్‌కు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190లు చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కరవు!

**- ప్రజల ఆరోగ్యం, శుభ్రత కోసం అహర్నిశలు కృషి**
**- పారిశుద్ధ్య కార్మికుల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం**

కారంపూడి, ఆగస్టు 20 ప్రభాతవార్త: గ్రామాల్లోని ప్రతివీధిని శుభ్రపరచి చెత్తాచెదారాన్ని తరలించే పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కరవైంది. మురుగు కాలువల్లో మురుగు పారే విధంగా అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులకు అధికారులు భద్రత కల్పించలేకపోతున్నారు. కారంపూడి, పేటసన్నెగండ్ల, ఒప్పిచర్ల, పెద్దకొదమగుండ్ల, మేజర్ గ్రామపంచాయతీలు ఉండగా మిగిలిన గ్రామాల్లో రోజువారి వేతన కార్మికులు పనిచేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి రోజురోజుకీ దయనీయంగా మారింది. చెత్తసేకరణ, చెత్త తరలింపు వంటి కఠినమైన పనులు చేస్తున్నప్పటికీ వారికి గ్రామ పంచాయతీ అధికారులు రక్షణ పరికరాలు ఇవ్వాల్సి ఉండగా అలాంటివి ఏవీ ఇవ్వడం లేదు. వారి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లకుండా చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్క్, కాళ్లకు బూట్లు, భద్రతా వస్త్రాలు గ్రామ పంచాయతీ అధికారులు అందించలేకపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు, దుస్తులు అందించాల్సి ఉండగా అధికారులు అలాంటివేవీ ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



**అధికారుల వైఖరిపై విమర్శలు**

మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా 8 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. కార్యదర్శులు లేని గ్రామాలకు అదనపు బాధ్యతలు ఉన్నవారికే అప్పగించారు. అధికారులు తమ బాధ్యతను విస్మరించి కార్మికులకు కనీస రక్షణ లేకుండా పనులు చేయించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్య కార్మికులకు భద్రతా పరికరాలు తప్పనిసరిగా అందించాలని ఎన్నోసార్లు ఆదేశించినా గ్రామ పంచాయతీ అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పారిశుద్ధ్య కార్మికుల కనీస వసతులు, భద్రతా పరికరాలు ఇవ్వకుండా అధికారులు పనిచేయించడంపై ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.



**పారిశుద్ధ్య కార్మికుల త్యాగం**

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రాణాలను పణంగా పెట్టి కార్మికులు పనిచేస్తున్నారు. చెత్తలో దాగి ఉన్న అనేక రకాల వ్యర్థాలను, హానికర పదార్థాలు అని పట్టించుకోకుండా కార్మికులు పరిశుభ్రత కోసం కృషి చేస్తున్నారు. ఉదయం నుండే చెత్త సేకరించి వాహనాల్లో తరలిస్తూ కాలుష్యాన్ని అదుపులో పెట్టడానికి వారు చేస్తున్న కృషి ప్రశంసనీయం. మా కుటుంబాల జీవనాధారం ఈ పని. రక్షణ లేకపోయినా ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తూనే ఉన్నాం... అని ఒక కార్మికుడు కన్నీటి స్వరంతో తెలిపాడు.

**ప్రజల డిమాండ్**

రాజకీయ నాయకులు, సామాజిక సంస్థలు కలిసి స్థానిక అధికారులను వెంటనే మేల్కొలపాలని ప్రజలు కోరుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, తగిన వేతనం, వైద్యసదుపాయాలు అందించి వారికి భద్రత కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పంట తొలిదశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఏడి

యడ్లపాడు, అగస్టు 20, ప్రభాతవార్త : ఖరీఫ్ సీజన్‌లో వేసిన పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ కొరకు పంటతొలిదశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నర్సరావుపేట వ్యవసాయ సంచాలకులు కే శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని మైదవోలు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో అయన పాల్గొని రైతులకు సూచనలు తెలిపారు.



తక్కువ పెట్టుబడితో ఎక్కువ అదాయం ఎలా పొందాలో వ్యవసాయం లాభసాటిగా చేసుకొనుటకు వీలుగా రైతులకు సూచనలు తెలిపారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ కొరకు పంటతొలి ధశలోనే వేప నూనె, వేప గింజల కషాయం చల్లుకోవాలని, అధిక సాంద్రత పత్తిలో గులాబీ రంగు పురుగు సమగ్ర నివారణ కొరకు వాడవలసిన లింగాకర్షక బుట్టలు గురించి వాటిని పొలంలో ఏవిధంగా అమర్చుకోవాలి అని వివరించారు. ఎకరానికి నాలుగు బుట్టలు అమర్చుకోవటం ద్వారా మగ పురుగులు ఆకర్షితమై బుట్టలో పడటం ద్వారా పురుగుల ఉధృతిని తెలుసుకొని సరైన యాజమాన్య పద్దతులు సరైన సమయంలో చేపట్టాలన్నారు. అలాగే పత్తి రైతులు ఈ పంట నమోదు తప్పక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎవో హరిప్రసాద్, ఎఇవో జీవన్ నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపి, బిలాల్, అనుపమ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నేడు క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

యడ్లపాడు, అగస్టు 20, ప్రభాతవార్త : మండల పరిధిలోని సామినేని చారిటబుల్ ట్రస్ట్ వారు కాకతీయ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో జిల్లాలో మొట్టమొదటి సారిగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ వారి అధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ శిబిరంను గురువారం ఉదయం 8గంటలకు శ్రీ అనంత లక్ష్మీ స్పిన్నింగ్ మిల్స్ బోయపాలెం నందు ప్రారంబించటం జరుగుతుంది. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహించనున్నామని తెలుపుతున్నారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధులుగా స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, మైలవరం శాసన సభ్యులు వసంత క్రిష్ణ ప్రసాద్, భాష్యం విద్యాసంస్థలు చైర్మన్ భాష్యం రామక్రిష్ణ, కాకతీయ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యన్నారాయణ రానున్నారని సామినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు.

## ఘరానా మోసగాడు అరెస్ట్.. వర్ధంతి ఫ్లెక్సీలే ప్రధాన టార్గెట్ !

యడ్లపాడు, అగస్టు 20, ప్రభాతవార్త : మాయమాటలతో మోసాలకు పాల్పడి పలువురిని మోసగించిన ఘరానా మోసగాడిని యడ్లపాడు పోలీసులు బుధవారం అరెస్ట్ చేసారు. దీనికి సంబంధించి చిలకలూరిపేట రూరల్ సిఐ బి సుబ్బనాయుడు, యడ్లపాడు ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల



ప్రకారం మాయమాటలతో ప్రజలను నమ్మబలికి మోసాలకు పాల్పడిన ముద్దాయి చుక్కా బాబు అనే ఇతను గుంటూరు పట్టణంలోని రాజీవ్ గాంధీ నగర్ 6/2వ లైనులో నివాసం ఉంటాడని, చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ప్రజలను మోసం చేసే దారిని ఎంచుకున్నాడని, ఎవరైనా మరణించిన వారి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి తాను ఎఐఐఎమ్ఎస్ లేదా ఇతర ప్రభుత్వ అసుపత్రుల నుండి వచ్చానని చెప్పి వారికి భీమా డబ్బులు వస్తాయని నమ్మబలికి బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయడానికి భీమా కార్డు పొందడానికి రిజిస్ట్రేషన్ చేయడానికి డబ్బులు అవసరమని చెప్పి బాదితులను మోసం చేసేవాడని, అదే క్రమంలో ఈ సంవత్సరం అగస్టు 14వ తేదిన గుంటూరు నుండి వస్తూ యడ్లపాడు గ్రామంలో మరణించిన బండి అంజనేయులు ఇంటికి వెళ్లి తాను ఎఐఐఎమ్ఎస్ హాస్పటల్ నుండి వచ్చానని, భీమా కింద 7.5లక్షలు వస్తుందని నమ్మబలికి వారి వద్ద నుండి 28వేల రూపాయలు ఫోన్ పే చేయించుకోవటం జరిగిందని, తరువాత బాధితులు మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. ఫిర్యాదు దారుడు కంకణాల రాజేష్ అని, అతని ఫిర్యాదు అధారంగా విచారణ జరిపి ముద్దాయిని అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. అతని వద్ద నుండి స్కూటీ, ఐఫోన్ స్వాదీనం పర్చుకోవటం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పర్చటం జరుగుతుందన్నారు.

నేర చరిత్ర : మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన సందర్భంలో గుంటూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని, హైకోర్టు న్యాయమూర్తులు తనకు పరిచయం ఉన్నారు అని హైకోర్టు నందు ఉద్యోగాలు ఇప్పిస్తాను అని ఒక వ్యక్తి వద్ద నుండి 59లక్షలు తీసుకోని మోసం చేయటంతో సదరు నేరంపై మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. అతని భార్య గుంటూరు ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు పెట్టిందన్నారు. గుంటూరు అర్బన్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో అత్మహత్యా యత్నం కేసు నమోదు అయ్యిందని, రాజమండ్రి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు అత్మహత్యాయత్నం కేసు నమోదు చేయటం జరిగిందన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిఐ



యడ్లపాడు, అగస్టు 20, ప్రభాతవార్త : ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియని వారు వచ్చి తాము అదిచేస్తాం, ఇదిచేస్తాం అంటూ మాయ మాటలతో బురిడీ కొట్టిస్తారని, వారి మాటలు విని మోస పోకుండా అప్రమత్తంగా ఉండాలని చిలకలూరిపేట రూరల్ సిఐ బి సుబ్బనాయుడు పేర్కొన్నారు. ఘరానా మోసగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా ఇటువంటి మాయ మాటలు చెప్పెవారిని గుర్తించినట్లు అయినా గుర్తుతెలియని వారి నుండి ఫోన్ కాల్స్ వచ్చినా వెంటనే స్దానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించితే వెంటనే దానిపై విచారణ జరపటం జరుగుతుందని, కావున అబద్దపు మాయ మాటలకు మోస పోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే గ్రామాలు

చిలకలూరిపేట,ఆగస్టు20,ప్రభాతవార్త: మండలంలోని ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్లు మరమ్మత్తుల కారణంగా యడవల్లి, కట్టుబడివారిపాలెం, యూటి గ్రామాలలో గల చిన్న, భారీ పరిశ్రమలకు గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ డిఈఈ ఆర్ అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

## ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న ఎరువులు

అమరావతి, ఆగస్టు 20 ప్రభాతవార్త : నియోజకవర్గ వ్యాప్తంగా ఎరువులు, పురుగుమందుల షాపుల్లో ధరల పట్టిక ప్రదర్శించకుండానే ఎమ్మార్పీ కంటే అధిక ధరలు వసూలు చేస్తూ రైతులను దగా



చేస్తున్నారని రైతన్నలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. యూరియా, డిఏపి, 20-20 వంటి పలు రకాల బలం మందులకు సంబంధించిన ఎరువులు ఒక్కో బస్తాకి రూ.100ల నుంచి రూ.150ల వరకు అధికంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం ఎరువుల దుకాణాలపై కన్నెత్తి చూడటం లేదన్నారు. లైసెన్స్, రెన్యువల్ కానీ గోడౌన్‌లలో స్టాక్ నిల్వ ఉంచుతున్నారని, కొన్ని ప్రదేశాల్లో బయో మందులు సైతం నిల్వలు ఉన్నాయని రైతులు తెలిపారు. అలాంటి ఎరువులు, పురుగుమందుల షాపులు వ్యవసాయ అధికారులకు ముడుపులు అందిస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ కరువైందని, దీని వల్ల నకిలీ మందులు హల్చల్ అధికంగా ఉందన్నారు. వ్యవసాయ అధికారులు ఎరువులు, పురుగుమందుల షాపులలో తూతూమంత్రంగా తనిఖీలు చేసి వారు నెలవారీ ఇచ్చే మామూళ్ళకు అలవాటుపడిపోయారని పలువురు ఆరోపిస్తున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను ఎరువులు, పురుగు మందుల షాపుల యాజమాన్యాలు నాణ్యతలేని మందులు ఇస్తూ ఉన్న మందులకు అధిక ధరలకు ఇచ్చి దోచుకుంటుంటే, దగా చేస్తుంటే వారికి వెన్నుకాయడం వ్యవసాయ అధికారులకు సబబు కాదని రైతులు అన్నారు. కొత్త కొత్త ఎరువులు, మందులు, పురుగుమందుల షాపుల్లో దర్శనమిస్తున్నాయని, శాంపిల్ పురుగు మందులు, ఎరువులు రైతులకు అంటగట్టి, షాపుల యాజమాన్యం రైతులను దోచుకుంటున్నారని రైతులు తెలిపారు.

మండల వ్యవసాయ అధికారులు మామూళ్ళ మత్తులో మునిగితేలుతుంటే జిల్లా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని రైతులు తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టిపట్టనట్లు ఉన్నారని, కొన్ని మండల షాపుల్లో నకిలీ మందులు కూడా ఉన్నాయనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు మాత్రం తనిఖీలు చేయడం, ముందుగానే మండల అధికారులు ఉన్నతాధికారులు వస్తున్నారని ముందుగానే తెలియజేయడంతో వాళ్ళు జాగ్రత్త పడుతున్నారని రైతులు తెలిపారు. ఎరువులు, పురుగు మందుల షాపుల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేసి, స్టాక్ రిజిస్ట్రర్లను పరిశీలించి, గోడౌన్‌లను తనిఖీ చేసి, ధరల పట్టికలను పరిశీలించి రైతులకు నాణ్యమైన ఎరువులు, మందులు అందేలా తగు చర్యలు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని, లేకుంటే రైతులు మోసపోయే పరిస్థితి ఏర్పడిందని, నష్టాల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉన్నాయన్నారు.

## యువిక సైంటిస్టు సోమశేఖర్‌కు అభినందనల వెల్లువ

గుంటూరు విద్య,ఆగష్టు 20,ప్రభాతవార్త : డాక్టర్ కెకెఆర్ గౌతమ్ స్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థి యువిక సైంటిస్ట్ వక్కపట్ల సోమశేఖర్ ను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక పెరేడ్ గ్రౌండ్ స్ లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా




ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సోమశేఖర్ ను పలువురు అభినందనలతో ముంచేత్తారు. పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో భాగంగా సోమశేఖర్‌ను ఆ పాఠశాల డీన్ సత్యరామ్,ప్రిన్సిపాల్ సుధాకర్ ముఖ్య అధ్యాపకులు బ్రహ్మారెడ్డి అనిల్ రాంబాబు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.గతంలో సోమశేఖర్ జాతీయ స్థాయిలోసైన్స్ ఎగ్జిబిషన్స్,క్విజ్,సైన్స్‌హాక్,స్పేస్ క్విజ్ మరియు భారతదేశ ఆర్ధిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా చంద్రయాన్-3 అవార్డు లాంటి ఇతర అనేక ప్రశంసా పత్రాలు పొందడం జరిగిందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు.

## మాచర్లకు చెందిన బండారు పద్మావతికి డాక్టరేట్

మాచర్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త: మాచర్ల పట్టణానికి చెందిన వడ్డెర సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకుడు బండారు నాగేశ్వరరావు సతీమణి బండారు పద్మావతికి ఉస్మానియా యూనివర్శిటీ



నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. హైదరాబాదులోని ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన 84వ స్నాతకోత్సవంలో యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కుమార్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ జిశుదేవ్ వర్మ, ఇస్రో ఛైర్మన్ నారాయణ సమక్షంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. యూనివర్శిటీ మాజీ ఎడ్యుకేషన్ డీన్ సీనియర్ ప్రొఫెసర్ వెంకటరెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్‌ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు పద్మావతిని అభినందించారు.

## తహశీల్దారు కార్యాలయంలో ఉత్తమ అధికారులకు సన్మానం

మాచర్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ తహశీల్దారుగా అవార్డు అందుకున్న బి.కిరణ్‌కుమార్‌ను తహశీల్దారు కార్యాలయ అధికారులు, సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే ఉత్తమ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా అవార్డు అందుకున్న ఐ.అనిల్‌కుమార్‌ను కూడా శాలువాలతో



సన్మానించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు కార్యాలయ అధికారులు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, సిబ్బంది ఉన్నారు.

## వర్షాలు పడితే నీరు పారక..మందు పారుతుందా! : యాగంటి

మాచర్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఇటీవల వర్షాలకు నీట మునిగిందని వైసీపీ నాయకులతో ప్రతిపక్ష నేత వైస్ జగన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేయించడం



దుర్మార్గమని టీడీపీ సీనియర్ నాయకులు, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...అమరావతి ప్రాంతమంతా నీట మునిగిందంటూ చేస్తున్న వైసీపీ నాయకుల ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నాడు జగన్ అసెంబ్లీ సాక్షిగా రాజధానిగా అమరావతికి కట్టుబడి ఉన్నానంటూ మాట్లాడిన మాటలను గుర్తు చేశారు. మాయ మాటలతో నాడు అధికారాన్ని చేపట్టిన జగన్ రాష్ట్రాన్ని అంధకారంగా మార్చారన్నారు. జగన్ చెప్పేదొకటి చేసేదొకటన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రూ.50 వేల కోట్లతో రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభించారని, పనులు ప్రారంభంలోనే ఎలా అవినీతి జరిగిందో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఐదేళ్లు జగన్ పాలనలో అవినీతి రాజ్యమేలిందని, చివరకు 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌రెడ్డికి బుద్ధి రాలేదన్నారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయినా వైసీపీ నాయకుల వైఖరి మారలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సస్యశ్యామలంగా అభివృద్ధిబాటలో పరుగులు పెడుతుందని, అది చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుపరుస్తూ ప్రజాదరణ పొందుతున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకుల విష ప్రచారంలో అర్థం లేదన్నారు. సమావేశంలో ప్రసాద్, మస్తాన్, బ్రహ్మం, తిక్కా కొండలు, ఆంజనేయులు, కృష్ణ, దుర్గారావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వజనని సేవారత్న అవార్డు అందుకున్న ఓరుగంటి చెన్నకేశవరావు

మాచర్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త: వాసవీ క్లబ్ జోన్ ఛైర్మన్, సీనియర్ జర్నలిస్టుగా సేవలందిస్తున్న ఒరుగంటి చెన్నకేశవరావును విశ్వజనని సేవారత్న అవార్డు వరించింది. విశ్వజనని మూడో వార్షికోత్సవ వేడుకలు హైదరాబాదులోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి విభిన్న రంగాల్లో సేవలందించిన పలువురిని ఎంపిక చేసి



విశ్వజనని ఫౌండేషన్ ఛైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం అవార్డులు ప్రదానం చేశారు. మాచర్లకు చెందిన వాసవీక్లబ్ జోన్ ఛైర్మన్, సీనియర్ జర్నలిస్టు ఓరుగంటి చెన్నకేశవరావుకు విశ్వజనని సేవారత్న అవార్డును సినీనటులు అశోక్‌కుమార్, సిటీ, టీవీ నటులు రాగిణి, బాలాజీ, జబర్దస్త్ నటులు అప్పారావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చెన్నకేశవరావు మాట్లాడుతూ సమాజంలో సేవలు చేసే వారిని గుర్తించి అవార్డు రూపంలో ప్రోత్సహించడం వారి సేవను మరింత ముందుకు తీసుకెళ్లేవిధంగా ప్రోత్సహిస్తున్నారని, మాపై మరింత బాధ్యతను పెంచుతున్నారని బ్రహ్మానందానికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు గ్రహీత చెన్నకేశరావుకు పలువురు నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థలు, పాత్రికేయులు అభినందనలు తెలిపారు.

## "రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్" ప్రారంభంలో వర్చువల్ గా పాల్గొన్న కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు.


పెదనందిపాడు ఆగస్టు 20 (ప్రభాతవార్త).ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్" ప్రారంభోత్సవం అమరావతి, మంగళగిరిలో నిర్వహించిన సందర్భంగా. ఈ కార్యక్రమానికి పెదనందిపాడు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మరియు అధ్యాపకులు ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకొని వర్చువల్ గా కళాశాల నుండి వీక్షి ంచినారు. ఈ ఆర్.టి.ఐ.హెచ్ (శి గి ౹ బీ ) ప్రారంభోత్సవంలో పాల్గొన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖర్ .నారా లోకేష్, టి.జి భరత్, నాదెండ్ల మనోహర్, గల్లా జయదేవ్



మరియు ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ లో అమరావతి కేంద్రంగా ప్రారంభించిన ఈ ఆర్.టి.ఐ.హెచ్ (శిగి౹బీ) ద్వారా విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులు నూతన ఆవిష్కరణలు మరియు పేటెంట్ రైట్స్ ద్వారా ముందుకు వస్తే వారికి కావాల్సిన ఫండింగ్ సోర్స్ ను అందించి స్టార్టప్స్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ (ఎం.ఎస్.ఎం.ఈ) లాంటి అంకుర సంస్థలను స్థాపించి రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహద పడవచ్చు అన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ఇన్నోవేషన్ హబ్స్ ద్వారా రాబోవు రోజులలో ఆంధ్రప్రదేశ్ లో యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలియజేసినారు. వారు విద్యార్థులకు ఈ కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశము "వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెన్యువర్" అని సూచించారు. ఈ కార్యక్రమానికి ఒక రోజులో 1.5 లక్షలు రిజిస్ట్రేషన్ లతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కిందని. విద్యార్థుల్లో నూతన ఉత్సాహం నింపిందని. పెదనందిపాడు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి వీరరాఘవయ్య తెలిపారు.


## కవి బుర్రి కుమార్ రాజు కు విశ్వసాహితీ కళావేదిక పురస్కారం

గుంటూరు కల్చరల్,ఆగష్టు 20,ప్రభాతవార్త : విశ్వ సాహితీ కళావేదిక ఆవిర్భావం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి,గుంటూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి,కవి,రచయిత బుర్రి కుమార్ రాజు విశ్వసాహితీ విజయ బావుటా అను కవిత ఉత్తమ కవితగా ఎంపికై విజయవాడ ఇండియన్ మెడికల్ అసోసియేషన్



హాల్లో అధ్యక్షురాలు కొల్లి రమావతి,గౌరవాధ్యక్షులు రంగిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిధులుగా కవి,రచయిత డాక్టర్ జి.వి.పూర్ణచంద్,ఆంధ్ర ఆర్ట్స్ అకాడమి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు,కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వెన్న,వల్లభరావు,దాసన్నగారి కృష్ణమూర్తి,డాక్టర్ పెద్దేటి యోహాను లు పాల్గొనగా,ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా కవి బుర్రి కుమార్ రాజు కు ఘన సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లా రచయితల సంఘం,ఎస్.ఎం.సుభాని,బొమ్ము ఉమామహేశ్వర్‌రెడ్డి,నానా,పలువురు కవి మిత్రులు,గ్రంధాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



గుంటూరు విద్య,ఆగష్టు 20,ప్రభాతవార్త : ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్ల జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ భాష ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా చాంద్ భాష మాట్లాడుతూ గత ప్రభుత్వం నుంచి ఈ ప్రభుత్వం వచ్చి 14నెలలు గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ఉన్న వేల కోట్ల రూపాయల బకాయిలు ఈరోజు వరకు చెల్లించలేదని,1-7-2023నుంచి అందాల్సిన 12వ వేతన సవరణ సంఘం ఈ రోజు వరకు ఎటువంటి కమిటీని కూడా ఏర్పాటు చేయలేదని గత రెండేళ్ళుగా ఒక్క డిఏ కూడా చెల్లించలేదని పేర్కొన్నారు.చివరికి మేము చెల్లిస్తున్న ఈహెచ్ఎస్ క్రింద నెలకు రూ.225లు నుంచి రూ.300లు చెల్లిస్తున్నామని అయినా మాకు ఎటువంటి నగదు రహిత చికిత్స అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాష జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లాషాఖాద్రి నగర శాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు,నగరశాఖ కార్యనిర్వాహక కార్యదర్శి వి.పెదరత్తయ్య,తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి: 'కూటమి' నేతలు

పిడుగురాళ్ల, ఆగస్టు 20 ప్రభాతవార్తః మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, మహిళల జీవనోపాధిని పెంచేందుకు నిరంతరం శ్రమిస్తోందని కూటమి నేతలు అన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా పట్టణంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ దూదేకుల ఖాసింబి నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న మహిళలచే కాటన్ బ్యాగులు తయారు చేయించి బుధవారం పంపిణీ



చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలచే కాటన్ బ్యాగులు తయారు చేయించి వాటిని వ్యాపార సంస్థల ద్వారా ప్లాస్టిక్ రహిత పిడుగురాళ్ల పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ తురకా వీరాస్వామి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలీ, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దూదేకుల ఖాసీంసైదా, క్లస్టర్ ఇన్‌చార్జి వడ్డవలి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఫాదర్తి రాజేశ్వరి, జనసేన వీరమహిళ వెంకటరమణ, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వల్లపు రామకృష్ణ, జెస్సి, హైస్కూల్ హెచ్‌ఎం కొత్త మల్లికార్జునరావు, అంజూసాహెబ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్‌కు రూ. 80 వేల వాటర్ ఫిల్టర్ అందజేత

పిడుగురాళ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి)ః పట్టణంలోని అన్నా క్యాంటీన్‌కు రూ. 80 వేల విలువైన ప్యూరిఫై వాటర్ ఫిల్టర్‌ను సాయి శ్రీనివాస హాస్పిటల్ అధినేత డాక్టర్ పెండ్యాల సునీల్‌కుమార్ బుధవారం అందజేశారు. ప్రభుత్వం అందించే రూ. 5ల భోజనంతోపాటు ఎదలు శుద్ధమైన మంచినీరు తాగాలనే సదుద్ధేశ్యంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు అందించారు.



## ప్రజలకు ఇబ్బంది లేని ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేసుకోవాలి: గురజాల డీఎస్పీ జగదీష్

గురజాల, ఆగస్టు 20 ప్రభాతవార్తః ప్రజలకు ఇబ్బంది లేని ప్రదేశాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో



ఆయన విలేకరులతో మాట్లాడారు. గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విద్యుత్ అలంకరణకు విద్యుత్ శాఖ అనుమతులు తప్పనిసరి అన్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే భజనలు, మైకులకు అనుమతి ఉందన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, పాటలు, ఫోటోలు నిషేదమన్నారు. అనుమతి ఉన్న దారిలోనే నిమజ్జనం జరగాలన్నారు. మద్యం సేవించి నిమజ్జనంలో పాల్గొనవద్దన్నారు. అత్యవసర సమయంలో సెల్ః 9440796210ను సంప్రదించాలని సూచించారు. డీఎస్పీ వెంట సీఐ ఆవుల భాస్కరరావు ఉన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉండండి

### - పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరరావు నాయక్

కారంపూడి, ఆగస్టు 20 ప్రభాతవార్త: గ్రామాల్లో పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరరావు నాయక్ అన్నారు. బుధవారం కారంపూడి మండలం చిన్నకొదమగుండ్ల పంచాయతీని సందర్శించారు. అనంతరం ఆయన తడిచెత్త, పొడిచెత్త కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. సీజనల్



వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ కసిన్యానాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కారంపూడి మండలానికి చేరిన చెత్తతరలించే బండ్లు



కారంపూడి, ఆగస్టు 20 ప్రభాతవార్త: కారంపూడి మండలంలోని గ్రామాల్లో క్రాప్ మిత్రల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడిచెత్త, పొడిచెత్త సేకరించేందుకు మండల (పుష్‌కార్ట్స్) చెత్తసేకరించే నెట్టుడు బండ్లు సమకూరినట్లు మండల విస్తరణాధికారి కసిన్యానాయక్ తెలిపారు. కారంపూడికి 10, ఒప్పిచర్లకు 6, మిరియాల 2, లక్ష్మీపురం 1, గాదెవారిపలెన 1, కాచవరం 1, ఇనుపరాజుపల్లి 1 పుష్‌కార్ట్స్ వచ్చాయని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్తవేయకుండా, వాటిలో వేసే విధంగా గ్రామాల కార్యదర్శులు అప్రమత్తం చేయాలన్నారు. సేకరించిన చెత్తను క్రాప్‌మిత్రలు సంపద సృష్టి కేంద్రాలకు తరలిస్తారని తెలిపారు.

## విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని పెదనెమలిపురి గ్రామంలో తెలుగుదేశంపార్టీ నాయకులు, కీర్తిశేషులు గుత్తా వాసు నూతన విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తా వాసు టిడిపి నాయకునిగా అందించిన



సేవలు మరువలేనివన్నారు. ఆయన లేనప్పటికీ గ్రామస్తుల మదిలో చిరస్థాయిగా నిలిచాపోయారన్నారు. ఆయన విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేసుకోవడం ఆయన మంచి పనులకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా వెంట వివిధ హోదాలలో ఉన్న నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ వ్యాఖ్యలకు ఖండన


అమరావతి, ఆగస్టు 20 ప్రభాతవార్త : కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.మస్తాన్‌వలి ఎన్నికల



సంఘంపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బిజెపి నాయకులు, అమరావతి ఎంపిపి మేకల హనుమంతరావు అన్నారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, రాజ్యాంగం పట్ల వారికి విశ్వాసం లేదన్నారు. ఈవిఎంలలో అవకతవకలు జరిగాయని మాట్లాడుతున్నారని, ఇది కేవలం ఆ పార్టీ ఉనికి కోసమే జరుగుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో 150 స్కాంలు జరిగాయని వివరించారు. కాం గ్రెస్‌పార్టీని దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు నేరెళ్ళ హనుమంతరావు, ఎం.ధాత్రి నారాయణ, శివశంకర్, వంగేటిబాబు పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయండి

గుంటూరు విద్య,ఆగష్టు 20,ప్రభాతవార్త : డిఎస్సీ 2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేది సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించతలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు.ఈ మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెమో 55ప్రకారం,ఆంధ్రప్రదేశ్ లో అర్హులైన సుమారు 7000మంది ఉపాధ్యాయులు, 2000మంది కానిస్టేబుళ్ళు,2000మంది ఇతర ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింప



చేయాల్సి ఉందని ఆయన గుర్తుచేశారు.అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంన్నర కాలం గడిచినప్పటికీ అర్హులైన ఈ ఉద్యోగులకు పాతపెన్షన్ మంజూరు చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని ఆయన విమర్శించారు.తమ న్యాయమైన హక్కుల సాధన కోసం డిఎస్సీ 2003టిచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జరగబోతున్న ఈ మహాధర్నాలో అర్హులైన ఉద్యోగులు,ఉపాధ్యాయులు,వారి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని లక్ష్మణరావు కోరారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి,వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి:ఎడిఎ సునీత

పొన్నూరు, ఆగస్టు 20,(ప్రభాతవార్త): రైతుల రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, తద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చని బయోలాజికల్ కంట్రోల్ ల్యాబ్ ఎడిఎ సునీత సూచించారు.



మండల పరిధిలోని వడ్డిముక్కల, ఆలూరు గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువులను తగ్గించి జీవన ఎరువలు అయినటువంటి(పిఎస్‌బి) పాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియాను వాడుకోవడం వల్ల పొలంలో కరగని రూపంలో ఉన్న భాస్వరంను కరిగించి పంటకు తీసుకునే రూపంలోకి తెస్తుందన్నారు. దీనివల్ల ఎస్ఎస్‌పి, డిఏపి ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చన్నారు. ఒక బస్తా డిఏపి ఖరీదు రూ.1350కి బదులు పిఎస్‌బి 150రూపాయలకు తీసుకోవడం ద్వారా పెట్టుబడి తగ్గించుకోవచ్చన్నారు. సూడోమోనాస్ జీవ శిలీంద్ర నాశిని వరి పంటలో వచ్చే అగ్గితెగులు, ఆకు ఎండు తెగులు సిబిఎల్‌బి బ్యాక్టీరియా లీఫ్ బ్లైట్‌లను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. తద్వారా పురుగుమందుల వినియోగం కూడా తగ్గించుకోవచ్చన్నారు. అపరాలలో రైజోబియం బ్యాక్టీరియా కూడా గాలిలో వున్న 70శాతం నత్రజనిని సంగ్రహించి మొక్కలకు అందుబాటులోకి తెస్తుందన్నారు. ఇవన్నీ రైతులకు బీసీ ల్యాబ్ గుంటూరు లాంఫారమ్‌లో దొరుకుతాయన్నారు. ఎడిఎ వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ రైతులందరూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నగదు జమకానివారు దగ్గర్లోని రైతు సేవా కేంద్రానికి వెళ్ళి ఆధార్, పాసుపుస్తకాల నకలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, విఎఎ పి.ప్రసాద్, ఎంపీఈఓ ఎస్.సురేష్‌బాబు రైతులు పాల్గొన్నారు.

## మాంసం మార్కెట్ మరమ్మతులపై హర్షం వ్యక్తం

పొన్నూరు, ఆగస్టు 20,(ప్రభాతవార్త): పట్టణలోని మాంసం మార్కెట్ సౌకర్యాల లేమితో కునారిల్లుతుంది. ఈ విషయాన్ని స్థానిక షాపుల వారు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. అర్జీని అందజేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబుతో మాట్లాడారు. కమిషనర్ ఎమ్మెల్యే ఆదేశాలతో మాంసం మార్కెట్‌కు మరమ్మత్తులు చేశారు. అందులో అవసరమైన సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా షాపుల యజమానులు ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు ఎమ్మెల్యే స్పందించిన తీరుకు ఆనందాన్ని,సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## ఆదరణ పథకం దారిమళ్లింపుపై ఫిర్యాదు చేసిన టిడిపి

పొన్నూరు, ఆగస్టు 20,(ప్రభాతవార్త): ఆదరణ పథకం లబ్దిదారులకు అందించాల్సిన పనిముట్లను వ్యక్తిగత ప్రయోజనాల కోసం దారిమళ్ళించిన వారిపై కేసు నమోదు చేసి శిక్షించాలని కోరుతూ పొన్నూరు మండల బీసీసెల్ అధ్యక్షుడు తాడిశెట్టి ఏడుకొండలు ఫిర్యాదు చేశారు. టిడిపి అధికారంలో వున్నప్పుడు బీసి వెల్ఫేర్ ద్వారా ఆదరణ పథకం కింద చేతి వృత్తులు చేసుకొనే కొంత మంది లబ్దిదారులకు పనిముట్లు అందించడం జరిగిందన్నారు. 2018-2019మధ్య కాలంలో ఆదరణ పథకం ద్వారా కొంత మంది లబ్దిదారులను గుర్తించి, లబ్దిదారుల ద్వారా డీడీలు తీయించి పనిముట్లను అందజేసే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో వాటిని, లబ్దిదారులకు అందించకుండా ఆపివేయడం జరిగిందన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టి ఆదరణ పథకం కింద లబ్దిదారులకు అందించాల్సి పనిముట్లను వ్యక్తిగత ప్రయోజనాల కోసం దారి మళ్ళించినవారిపై కేసు నమోదు చేయాలని, కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై గండు కిరణ్‌బాబుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు, గణిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు, చలమశెట్టి సీతారామయ్య, ఖగ్గా వెంకట నరసయ్య, సముద్రాల ఆశీర్వాదం, కొచ్చెర చంటి తదితరులున్నారు.



## కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కొల్లిపర,అగష్టు 20 ప్రభాతవార్త: కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు అన్నారు.బుధవారం మండల పరిధిలోని అన్నవరం లంక హైస్కూల్‌లో మెర్రీ జెస్సీకా మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఇచ్చిన భోజనం ప్లేట్లను ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావుకు ట్రస్టు సభ్యులు సామియేలు దంపతులు అందజేసారు.ఈ సందర్భంగా మల్లీశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించటం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు సామియేలు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు అందుబాటులో ఎరువులు:ఏడిఏ రాజకుమారి

కొల్లిపర,అగష్టు 20 ప్రభాతవార్త: రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏడిఏ రాజకుమారి అన్నారు.బుధవారం మండలంలో తూములూరు,కొల్లిపర, మున్నంగి,వల్లభాపురం గ్రామాల్లో ఎరువుల షాపులను ఏడిఏ రాజకుమారి,మండల వ్యవసాయాధికారి రాజకుమారి తనిఖీ చేసారు.గోడోన్‌లో ఉన్న ఎరువులను ..రిజిష్టర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ మండలంలోని ఎరువుల షాపుల్లో యూరియా 166 టన్నులు,డీఏపి 135 టన్నులు కాంప్లెక్స్ ఎరువులు 524 టన్నులు,ఎంవోపీ 24 టన్నులు ఉన్నాయన్నారు.ప్రతి రైతు సేవా కేంద్రంలో కూడా ఎరువులను అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకొనుచున్నట్లు తెలిపారు.



## శక్తి యాప్ గురించి విద్యార్థులకు అవగాహన

కొల్లూరు, ఆగస్టు 20 (ప్రభాతవార్త) : మహిళా భద్రతకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్న వారి రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ గురించి అవగాహన కల్పించే దిశగా శ్రీ సాయి వాసవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో బుధవారం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు రేపల్లె సబ్ డివిజన్ శక్తి టీం మరియు కొల్లూరు ఎస్సై జానకి అమరవర్ధన్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పాఠశాల బాలికలకు శక్తియాప్ యొక్క ప్రాముఖ్యత దానిని ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లు ప్రస్తావించారు. ఆపదలో ఉన్నపుడు భయపడకుండా ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈ విషయంలో శక్తియాప్ ఒక రక్షణ కవచం లాగా పని చేస్తుందని స్పష్టముగా వివరించారు. శక్తియాప్ ద్వారా బాలికలు ఏదైనా ప్రమాదంలో ఉన్నపుడు కేవలం ఒక బటన్ నొక్కడం ద్వారా తక్షణమే పోలీసుల సహాయం పొందవచ్చునని తెలిపారు. యాప్ వినియోగదారుల యొక్క జీపీఎస్ ప్రాధాన్యతను గుర్తించి సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం పంపుతుందని ఆయన వివరించారు. వేధింపులు, ఫిర్యాదులు లైంగిక వేధింపులు బెదిరింపులు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఎదురైనప్పుడు వెంటనే ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. శ్రీసాయి వాసవి విద్యా సంస్థల డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా భద్రతకు సంబంధించిన ఎస్సై అమరవర్ధన్ అందించిన ఈ కార్యక్రమం ప్రశంసనీయమని ఆయన అన్నారు. అవగాహన కల్పించిన ఎస్సై అమరవర్ధన్ శక్తి యాప్ గురించి పూర్తిగా అవగాహన కల్పించిన ఎస్సై అమరవర్ధన్ కు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన ఈ శ్రీసాయి వాసవి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. దీనితో పాటు పిల్లలకి గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి ఫోక్సో చట్టం గురించి కూడా అవగాహన కల్పించారు.



## చవితి పండుగ వేడుకలకు సంబంధించిన నిబంధనలు: ఎస్ఐ

కొల్లూరు, ఆగస్టు 20 (ప్రభాతవార్త) : రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా బుధవారం కొల్లూరు పోలీస్ స్టేషన్ హాల్లో విలేకర్లతో మాట్లాడిన కొల్లూరు ఎస్సై జానకి అమరవర్ధన్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి పండుగను కొల్లూరు మండలం ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. బొమ్మపెట్టే ప్రతి ఒక్కరూ పోలీసు వారి పర్మిషన్ తప్పకుండా తీసుకోవాలని ఆయన వివరించారు. పై అధికారులు ఒక యాప్‌ను క్రియేట్ చేస్తున్నారు అది రాగానే బొమ్మ పెట్టుకున్న వారి అందరికీ ఇవ్వబడును. ముఖ్యంగా బొమ్మను నిమజ్జనం చేసే సమయంలో ర్యాలీలో ఉండండి ఎటువంటి అత్యుత్సాహానికి పోకుండా శాంతియుతంగా జరుపుకోవాలని విధిమూలా కమిటీ సభ్యులు చూడాలని పోలీసులు ప్రొడక్షన్ ఎప్పుడూ ఉంటుందని అందు వలన ఎలాంటి అల్లరి చేసేవారు పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మేము ఇచ్చే సూచనలను ఉల్లంఘించి గొడవలు సృష్టిస్తే వారిపై బైండోవర్ కేసులు పెట్టి కోర్టుకు పంపుతామని ఆయన తెలియజేశారు.



## పదోరోజుకి చేరిన బీఎస్ఎన్ఎల్ మహిళా ఉద్యోగి దీక్ష



తెనాలి టౌన్ ఆగస్టు 20 (ప్రభాతవార్త):గతపది రోజులుగా పట్టణంలోని టెలిఫోన్‌ఎక్స్చేంజ్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేస్తున్న బీఎస్ఎన్ఎల్ మహిళా ఉద్యోగి పద్మావతి దీక్ష పదోరోజుకి చేరింది. కార్యాలయంలో వినియోగదారుల సేవాకేంద్రాన్ని ప్రైవేట్ పరం చేయటాన్ని వ్యతిరేకిస్తున్న ఆమె,మహిళా ఉద్యోగులకు నైట్ డ్యూటీలు రద్దుచేయాలని,టెలిఫోన్ కేబుల్ వైర్లు చోరీపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని,బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి మౌలికసదుపాయాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ, అధికారులు తన లేవనెత్తిన సమస్యలపై స్పందించే వరకు దీక్ష చేస్తానని పద్మావతి తెలిపారు.

## సూర్యలంకలో మూడు రోజుల బీచ్ ఫెస్టివల్

బాపట్ల,ఆగస్టు20,(ప్రభాతవార్త): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్ సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో మూడు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్‌కు వేదిక కానుందని కలెక్టర్ జె. వెంకట మురళీ తెలిపారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో బుధవారం కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా



**సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో సాంస్కృతిక, క్రీడా, వినోద కార్యక్రమాలు**
**27న సీఎం చంద్రబాబు నాయుడు రాక**
**రూ.97 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

ఆయన మాట్లాడుతూ పర్యాటక, సాంస్కృతిక, వినోద అంశాలను జోడించి జిల్లా ప్రత్యేకతను చాటేలా ఈ వేడుకలు ఉండాలన్నారు.మూడు రోజుల పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, బీచ్ క్రీడలు, సంగీత నృత్య వినోదం, ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు సందర్శకులను అలరించాలన్నారు.. ఈ ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 27న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూర్యలంక బీచ్‌కు రానున్నారు. అదే విధంగా రూ.97 కోట్లతో చేపట్టనున్న సూర్యలంక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సూర్యలంక జాతీయ, అంతర్జాతీయ పర్యాటక పటంలో నిలిచిపోతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న, ఇన్‌ఛార్జ్ జెసి గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియ, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, ఏవో మల్లికార్జున,మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మిగతా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు

బాపట్ల,ఆగస్టు17,(ప్రభాతవార్త): బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు బుధవారం జిల్లా వ్యాప్తంగా తమ పరిధిలోని పాఠశాలలు/కళాశాలల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శక్తి యాప్ వలన ఉపయోగాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు, మహిళా సంబంధిత చట్టాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల అభ్యున్నతికి, ఉన్నతమైన లక్ష్యాలను సాధించడానికి తగిన మెళకువలను సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో పోలీస్ అధికారులు ప్రధానంగా శక్తి యాప్ గురించి విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తక్షణం పోలీస్ సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. యాప్‌లో ఎస్ఓఎస్ బటన్‌ను నొక్కితే స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్ కు సమాచారం వెళ్లడంతో దగ్గరలో ఉన్న పోలీసులు సహాయం అందిస్తారని తెలిపారు. ప్రస్తుత కాలంలో యువత సోషల్ మీడియా, మొబైల్ యాప్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను విస్తృతంగా వినియోగిస్తున్నారని, ఈ నేపథ్యంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయనే విషయాన్ని విద్యార్థులకు తెలియజేశారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఎలాంటి సైబర్ వేధింపులు ఎదురైన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు, లేదా 1930 నెంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మహిళలు,బాలికల పై జరిగే వేధింపులు, లైంగిక దాడుల నుండి ప్రస్తుత చట్టాలు ఏవిధంగా రక్షణ కల్పిస్తాయో వివరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలపై ప్రత్యేకంగా చర్చించారు. డ్రగ్స్ కారణంగా విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థితి, విద్యా భవిష్యత్తు అన్నీ నాశనం అవుతాయని హెచ్చరించారు.



## చిన్నారులకు రెయిన్ కోట్‌లు పంపిణీ

పొన్నూరు, ఆగస్టు 20,(ప్రభాతవార్త): లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళల ఆధ్వర్యంలో బుధవారం మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో చిన్నారులకు రెయిన్ కోట్‌లను పంపిణీ చేశారు. వరల్డ్ మస్కిటో డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లయన్స్ రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు, వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలు కూడా శుభ్రంగా ఉండేవిధంగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. చిన్నారులు వర్షంలో తడవవద్దని సూచించారు. చిన్నారులకు రెయిన్‌కోట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బి.ఝాన్సీ రాణి, కార్యదర్శి జి.శోభాకలూష,కోశాధికారి పి.నిర్మల, కె.నరసింహాచారి, జి.కృష్ణకుమారి, మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, పరాశరం శేషుకుమారి, బి.శబలాదేవి, ఎం.అమరేశ్వరి, శ్రీలక్ష్మి, మోహనలక్ష్మి, పి.ఉమాకుమారి, కె.సులోచన తదితరులు పాల్గొన్నారు.



## రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయి

పొన్నూరు, ఆగస్టు 20,(ప్రభాతవార్త): చేబ్రోలు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శని తెలిపారు. చేబ్రోలు మండల పరిధిలోని వేజండ్ల, పాతరెడ్డిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. కౌలు రైతులందరూ తప్పని సరిగా సీసీఆర్సీ కార్డులను పొందాలన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరేందుకే అన్ని రైతు సేవా కేంద్రాలలో ఎరువులను అందుబాటులో ఉంచిందన్నారు. రైతులకు ఎక్కడా ఎలాంటి లోటు రాకుండా చూడడమే ప్రధానోద్దేశంగా వ్యవసాయశాఖ పనిచేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నగదు జమకాని రైతులు, ఆధార్‌కార్డు, పాసుపుస్తకం రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్ళి సంబంధిత సిబ్బందికి ఇచ్చి సరిచూసుకోవాలన్నారు. కొత్తరెడ్డిపాలెం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల ప్రయోజనం కోసమే కృషి చేస్తుందన్నారు. ప్రతిపక్షపార్టీల నాయకులు చెప్పే మాటల్లో వాస్తవం లేదన్నారు. కూటమి ప్రభుత్వం పూర్తిగా రైతు ప్రభుత్వమన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రైతులు ఎంతో నష్టపోయారన్నారు. వైకాపా ప్రభుత్వం వ్యవస్థలన్నింటిని నాశనం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించాలి

పొన్నూరు, ఆగస్టు 20,(ప్రభాతవార్త): ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలను స్వచ్ఛందంగా స్థల యజమానులు తొలగించాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అడవులను తలపించేవిధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే కొన్ని వార్డుల్లోని ప్రజలు పిచ్చిమొక్కలను తొలగించాలని, సంబంధిత స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఫిర్యాదులు చేశారన్నారు. తాము కూడా సంబంధిత స్థల యజమానులకు నోటీసులు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. స్థల యజమానులు స్పందించకపోతే తామే జెసిబి ద్వారా తొలగించి సంబంధిత యజమానుల వద్ద నుంచి జరిమానాలను వసూలు చేస్తామని హెచ్చరించారు. స్థల యజమానులు కూడా ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన కమిషనర్ ఆయా వార్డుల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## రాజీవ్ దార్శనికత నేటి పాలకులకు ఆదర్శం కావాలి

పొన్నూరు, ఆగస్టు 20,(ప్రభాతవార్త): స్వర్గీయ ప్రధానమంత్రి రాజీవ్ దార్శనికత నేటి పాలకులకు ఆదర్శం కావాలని కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో జరిగిన మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 81వ జయంతిని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల్లోని పాలకులు రాజీవ్ గాంధీ దార్శనికత, సంకల్పాలను ఆదర్శంగా తీసుకున్ననాడే నిజమైన పాలన అందించగలుగుతారన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా అందించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. నవ భారత అభివృద్ధిలో యువతకు పెద్దపీట వేస్తూ అనేక నిర్ణయాలు తీసుకున్న రాజీవ్ పాలనాకాలం దేశానికే స్వర్ణయుగమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు గృహాల కల్పన, దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ, రోడ్లు, విద్యుత్, రవాణా, రేడియో, టీవీ, ఇంటర్నెట్ సదుపాయాలను మెరుగపరిచి దేశాన్ని ముందుకు నడిపారన్నారు. నేడున్న పరిస్థితుల్లో పాలకులకు వారు దేశాన్ని నడిపిన తీరు ఆదర్శమవ్వాలని అన్నారు.తొలుత రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోయువజన కాంగ్రెస్ నాయకులు ఫణి, రేవంత్, రఫీ, ఎన్ఎస్‌యుఐ నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ ముప్పు నుంచి యువతను కాపాడుదాం: జేసీ పిలుపు

బాపట్ల,ఆగస్టు20,(ప్రభాతవార్త): మత్తు పదార్థాల ముప్పు నుంచి యువతను రక్షించడం అందరి బాధ్యత అని ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్ అన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణ, నివారణ చర్యలపై సమన్వయం కోసం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి మత్తు పదార్థాల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల ముప్పు నుంచి యువతను రక్షించడం అందరి ప్రధాన బాధ్యతగా భావించాలన్నారు. ప్రతి శాఖ ఒకే దిశలో కృషి చేస్తేనే ఫలితం వస్తుందన్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలతో పాటు హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, సోషల్ వెల్ఫేర్ వంటి విభాగాలు కూడా చురుకుగా పనిచేయాలన్నారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్కూల్‌కాలేజీల్లో జాగృతి సదస్సులు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టడంలో సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు ఇంటెలిజెన్స్ బ్యూరో అదనపు ఎస్పీ బి. ఫణిరాజు శర్మ మాట్లాడుతూ డ్రగ్స్ వ్యాప్తి యువత జీవితాలను నాశనం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రైన్లు, బస్ స్టాండ్లు, పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, గంజాయి తరలింపు, సరఫరాపై కఠిన నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే వలసలపై కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గ్లోరియ, చంద్రశేఖర్, రామలక్ష్మి, మేజిస్టీరియల్ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, క్రైమ్ డీఎస్పీ జగదీష్ నాయక్, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఇతర అధికారులు ఎన్జీవోలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి

మంగళగిరి, ఆగస్టు 20, ప్రభాతవార్త : మంగళగిరి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సలీం ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళగిరి బస్టాండ్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి ఇంచార్జ్ సలీం పూలమాలలు వేసి పండ్లు స్వీట్స్ పంపిణీ చేశారు. అలాగే మంగళగిరిలో వడ్లపూడి సెంటర్లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పుట్టినరోజు వేడుకలను వేడుకగా నిర్వహించారు. మంగళగిరి భార్గవ్ పేట రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత సాధికార ఛైర్మన్ రామనాథం పూర్ణచంద్రరావు, గుంటూరు జిల్లా కాపు సాధికార ఛైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షేక్ మున్ని, తాడేపల్లి పట్టణం అధ్యక్షులు డి శామ్యూల్, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు పటాన్ సుభాని, మంగళగిరి రూరల్ అధ్యక్షులు కుప్పాల కృష్ణయ్య చౌదరి, మంగళగిరి రూరల్ వైస్ ప్రెసిడెంట్ గండికోట వెంకయ్య, మంగళగిరి రూరల్ ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణయ్య, దుగ్గిరాల మండలం మాజీ అధ్యక్షురాలు నెమలకంటి ఆదిమ్మ, గుంటూరు జిల్లా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జి జాన్ బాబు, ఆల వెంకటస్వామి, గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బల్ల సమర్పణ కుమార్, చిన్న కాకాని గ్రామ అధ్యక్షులు దేవినేని చిన్నా తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## సీజనల్ వ్యాధులతో జర భద్రం..!: డాక్టర్ అనూష

మంగళగిరి, ఆగస్టు 20, ప్రభాతవార్త :వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు సోకకుండా పాటించాల్సిన నియమాలు గురించి ఆమె వివరించారు. వర్షాకాలంలో గాలిలో అధిక తేమ వలన హానికరమైన బ్యాక్టీరియా, వైరస్ వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అవి రోగ నిరోధక శక్తిపై ప్రతికూల ప్రభావం చూపడం వలన వివిధ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సీజనల్ గా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, విషజ్వరాలు, చికెన్ గునియా, డయేరియా లతోపాటు దగ్గు, జలుబు, జ్వరం వంటి సాధారణ సమస్యలు కూడా వస్తాయన్నారు. మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు గురికాకుండా ఇంటి పరిచరాల్లో దోమలు వృద్ధి చెందకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో నీరు కలుషితమై డయేరియా కు గురయ్యే ప్రమాదం ఉంటుందని, కాచి చల్లార్చిన నీరును తాగాలన్నారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు కనబడితే సమీపంలోని యూపీహెచ్సీలలో ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.



## పెదవడ్లపూడిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగళగిరి, ఆగస్టు 20, ప్రభాతవార్త :పెదవడ్లపూడి గ్రామంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం బాధితుల ఇంటికి వెళ్లి స్వయంగా అందజేశారు. మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో లామ్ ప్రసాద్ కి రూ 1,01,208 వేల చెక్కును, మోర్ల విజయలక్ష్మి మ్మ కి రూ 46,150 విలువైన చెక్కును, గోనుగుంట్ల శ్రీహరి రావు (లేటు) 52,132/ వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను, మొత్తం ముగ్గురికి 1,99,490/ రూ విలువైన చెక్కులను మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ చేతుల మీద గా అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు రావడానికి కృషిచేసిన మంత్రి నారా లోకేష్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమం లో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, చింతల ఏడుకొండలు, జాలాది సందీప్, మొద్దుకురి రమేష్, కంచర్ల బద్రి, శానం రఘు, గుడిమెట్ల ఎల్లయ్య, కోట అరుణ్ దత్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్ని తిరుపతయ్యకు బిజేపి నేత తుల్లిమిల్లి రామకృష్ణ సన్మానం

తాడేపల్లి,ఆగష్టు 20,ప్రభాతవార్త : సిపిఐ నూతన కార్యవర్గంలో గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్న సందర్భంగా చిన్ని తిరుపతయ్య యాదవ్‌ను బిజెపి ఓబిసి మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి ఎల్లప్పుడూ వారి కోసమే పోరాడుతున్న తిరుపతయ్య ఈ పదవికి ఆయన వన్నెతెస్తారన్నారు.తమ తండ్రి ఆశయాలను అనుసరిస్తూ ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగుతున్న తిరుపతయ్య భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు బొమ్మనబోయిన రాజేంద్రప్రసాద్,వాసా ప్రేమ్‌కుమార్,వేమూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

-రైతుల పక్షాన నిలబడితే కేసులు పెడతారా..?-వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి

పొన్నూరు, ఆగస్టు 20,(ప్రభాతవార్త): ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పొన్నూరు నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదన్నారు. ఇప్పటికే రెండుసార్లు వరి వెదసాగు చేసి రైతులు ఎంతో ఖర్చు పెట్టారన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో అన్నదాతలు పూర్తిస్థాయిలో నష్టపోయారన్నారు. ఈ విధంగా నష్టపోయిన రైతులకు అండగా ఉండాల్సిన స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆవైపు కన్నెత్తి కూడా చూడకపోవడం అన్యాయమన్నారు. నష్టపోయిన రైతులు దిగులు పడుతుంటే వారికి ధైర్యాన్నిచ్చేందుకు తమ వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నియోజకవర్గంలో తిరుగుతూ రైతుల సమస్యలు తెలుసుకొంటుంటే ఆయనపై అక్రమంగా కేసులు పెట్టడం అన్యాయమన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పర్యటించిన అంబటి మురళీకృష్ణ రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని మూడు మండలాల్లోని తహాశీల్దార్లకు వినతి పత్రాలు అందించడం కూడా జరిగిందన్నారు. కొండవీటి వాగు ప్రవాహం వల్లే ఈ ప్రాంతానికి వరద వచ్చిందని అంబటి చెప్పారన్నారు. అదే విషయాన్ని మంత్రి నారాయణ కూడా చెప్పారన్నారు. ప్రభుత్వం తప్పిదం వల్లే జరిగిందన్నారు. ప్రభుత్వం తన వద్ద తప్పు పెట్టుకొని రైతుల పక్షాన పోరాటం చేస్తున్న అంబటి మురళీకృష్ణపై చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అంబటిపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ నియోజకవర్గంలో పర్యటించి రైతుల సమస్యలు తెసుకొని, త్వరగా నష్టపోయిన వివరాలను సేకరింపచేసి నష్టపరిహారాన్ని ఇప్పించాలన్నారు.




రైతులు మూడవసారి వరిసాగు చేసుకునేందుకు తక్షణ సాయం కింద ఎకరాకు రూ.10వేలు, విత్తనాలు, ఎరువులు ఉచితంగా ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీ నాయకుడు షేక్ నాజర్ మాట్లాడుతూ రైతుల పక్షాన ప్రశ్నించే గొంతులను నొక్కేయడం రాష్ట్ర ప్రభుత్వానికి భావ్యం కాదన్నారు. రైతులు ఎంతో నష్టపోయి దీనావస్థలో ఉంటే వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ వైపు చర్యలు చేపట్టకపోగా ప్రశ్నించే గొంతులను, రైతుల పక్షాన నిలిచే నాయకులపై కేసులు నమోదు చేయడం సరైన విధానామా.?అని ప్రశ్నించారు. పెన్షనర్లు, ఉద్యోగుల నియోజకవర్గ అధ్యక్షుడు చిర్రా అక్కిరెడ్డి మాట్లాడుతూ పొన్నూరు మండలంలో కూడా ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు నష్టపోయారని, తక్షణమే వారి ఆదుకునేందుకు మా వీరయ్య చౌదరి కుమారుడు నరేంద్రకుమార్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. తుంగభద్ర కింద ఉన్న పొలాల్లో కూడా చాలా భాగం నీటిలో మునిగిపోయాయన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ రైతులందరికీ న్యాయం చేసేవిధంగా ఆలోచన చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి ఎందేటి వెంకటసుబ్బయ్య, మరియరాణి, రమేష్, మూర్తిరాజు, దేవరకొండ గోపి, గోపిశెట్టి వాసు, రేగులగడ్డ రాజేష్, రుద్రపాటి నాగేశ్వరరావు, దాసరి దానమ్మ, మోహనరావు తదితరులున్నారు.

పల్నాడు జిల్లా వార్త



## మార్కెట్‌యార్డుల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే, ఛైర్మన్‌ల వినతి

నరసరావుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ మార్కెట్‌యార్డుల అభివృద్ధికి సహకారం అందించాలని వ్యవసాయశాఖామంత్రి అచ్చెంనాయుడును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కోరారు. బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో నరసరావుపేట, రొంపిచర్ల యార్డు ఛైర్మన్‌లు పూనాటి శ్రీనివాసరావు, మొండితోక రామారావులు మర్యాదపూర్వకంగా మంత్రి అచ్చెంనాయుడును కలిసి ఆయనను సత్కరించారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నరసరావుపేట, రొంపిచర్ల మార్కెట్‌యార్డుల అభివృద్ధి పనులు గత ప్రభుత్వ హయాంలో ఏ మాత్రం జరగలేదన్నారు. నరసరావుపేట యార్డుకు సంబంధించి రూ.3.80 కోట్లతో ప్రతిపాదనలను మంత్రికి ఎమ్మెల్యే అరవింద్‌బాబు అందజేశారు. ఛైర్మన్ కార్యాలయ భవన నిర్మాణం, గోడౌన్‌ల మరమ్మత్తులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల మరమ్మత్తులు నిర్వహించాల్సి ఉందన్నారు. అదే విధంగా రొంపిచర్ల మార్కెట్‌యార్డు కోసం రూ.2 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇందుకు సంబంధించి పశువుల సంత ఏర్పాటు, ప్లాట్‌ఫాం నిర్మాణం, ప్రహరీగోడ నిర్మాణం ప్రతిపాదనలు ఉన్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వివరించారు.



## రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

నరసరావుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : నరసరావుపేట కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు జి.అలెగ్జాండర్ సుధాకర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలను వివరించారు. ఐదు సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా ఉండి కంప్యూటర్, ఎలక్ట్రానిక్ రంగాలలో ఇండియాను అంతర్జాతీయస్థాయిలో ప్రథమంగా నిలిపారన్నారు. కంప్యూటర్ రంగాన్ని మొట్టమొదటిసారిగా దేశంలో తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాజకీయాలలోనూ ఆయన దేశంలోని అన్ని వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. ప్రజల కోసం వెళ్తునే ఆయన కనుమూశారని సుధాకర్ తెలిపారు. తొలుత రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు, ప్రవీణ్, ఇమ్మానియేలు, పూర్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి శ్రేణులపై అక్రమ కేసులను తొలగించండి ..

నరసరావుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలపై గత వైకాపా ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తాను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కోరారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డిజిపిని కలిసి ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై అవాస్తవాలను ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నవారిని అరెస్ట్ చేసి కేసులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వేదికల ద్వారా చేస్తున్న మంచిని చెప్పకుండా చెడును ఆపాదిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలోనే శాంతిభద్రతల అంశంలో ఏపి రెండవ స్థానంలో ఉందన్నారు. చట్టం, శాంతిభద్రతలను ప్రభుత్వం పటిష్ఠం చేస్తుందన్నారు. ఖచ్చితంగా సోషల్ మీడియాలో అసత్యాలను పెడితే వారిపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. మర్యాదపూర్వకంగా డిజిపి హరీష్‌కుమార్ గుప్తాను కలవడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.



## కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట' కొనసాగిస్తాం : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట టౌన్ ఆగస్టు 20 ప్రభాతవార్త : ఎన్ని కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమాన్ని కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పుట్టినరోజు కేక్ కట్ చేశామని, దాని వలన ట్రాఫిక్‌కు పది నిమిషాల పాటు అంతరాయం కలిగిందనే సాకుతో కేసు పెట్టి కార్యకర్తలను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్‌ల ప్రమాణ స్వీకారం పేరుతో మూడున్నర గంటలకు పైగా పట్టణంలో ట్రాక్టర్లు, టూ వీలర్స్‌తో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించి ప్రజలను ఇబ్బంది పెడితే పోలీసులకు అది కనిపించలేదా అని ప్రశ్నించారు. 30 యాక్ట్ తెలుగుదేశంపార్టీ కార్యక్రమాలకు ఎందుకు వర్తించదన్నారు. పట్టణంలో కిడ్నాప్‌లు, మర్డర్‌లు జరుగుతున్నాయని అందుకే 30 యాక్ట్ అమలు చేస్తున్నామని చెప్పడం ఏమిటన్నారు. తమకంటూ ఒక రోజూ వస్తుందని ఆ రోజున బయట తిరిగే పరిస్థితి కూడా ఉండదన్నారు. గతంలో డాక్టర్ అరవింద్‌బాబు పట్టణంలో ప్రతిపక్ష నాయకునిగా తిరిగితే మేము ఎప్పుడైనా కేసులు పెట్టామా అని ప్రశ్నించారు. ప్రజల్లోకి వెళ్ళకుండా తమను ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని అధికారులకు తెలియజేయడం ప్రతిపక్ష పార్టీగా తమ బాధ్యత అన్నారు. పద్ధతులు మార్చుకోకపోతే తగిన గుణపాఠం తప్పదన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.




## చిరంజీవి అభిమానుల రక్తదానం

నరసరావుపేట టౌన్ ఆగస్టు 20 ప్రభాతవార్త : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు రక్తదాన కార్యక్రమంతో పాటు పలు సేవా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని పట్టణ ప్రముఖులు, వాగ్దేవి విద్యాసంస్థల సెక్రటరీ రాయల శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమానికి చిరంజీవి యువత అధ్యక్షులు అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్‌లు అధ్యక్షత వహించారు. 40 మందికి పైగా రక్తదానం చేయడం మంచి విషయమని రాయల శ్రీనివాసరావు తెలియజేశారు. కరోనా సమయంలో సైతం ఆక్సిజన్‌ను అందించి బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్‌లను ఏర్పాటు చేసి సమాజ సేవలో ముందంజలో ఉన్నారని తెలిపారు. చిరంజీవి యువతకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణంరెడ్డి గోవిందరావు, బ్రహ్మం, శివ, వినయ్, ఏమయ్య, హనుమంతరావు, గౌస్, సిద్దయ్య, పుల్లారావు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



## మానవహక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వ చట్టాలు

రొంపిచర్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త : మానవహక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలను తయారు చేస్తుందని సిపిఎం పట్టణ అధ్యక్షులు ఆరోపించారు. బుధవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వింత పోకడలకు పోతుందన్నారు. దేశ ప్రజల హక్కులను బిజెపి కాల రాస్తుందన్నారు.

## రెండు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

నకరికల్లు, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని చల్లగుండ్ల, చీమలమర్రి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కె.దేవదాసు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడారు. వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో వరిసాగులో మెళకువలను తెలియజేశారు. రసాయనిక ఎరువులను వినియోగించవద్దని సూచించారు. ఒక ఎకరా వరి పంటకు నత్రజని 36 కేజీలు, భాస్వరం 24 కేజీలు, పొటాష్ 16 కేజీలు పోషకాలను ఇచ్చే యూరియా, డిఏపి, సింగిల్ సూపర్ పాస్పేట్ వేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి పత్తి, వరి, మొక్కజొన్న, కంది, మినుము, పసుపు, కూరగాయలు, పండ్ల తోటలకు సంబంధించి ఈ-పంట తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

## జెఎన్‌టియు కళాశాలలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సంబంధించి కార్యక్రమం

నరసరావుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : జెఎన్‌టియు కళాశాలలో బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించిన రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ హబ్‌కు సంబంధించిన కార్యక్రమం జరిగింది. 1256 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో భాగస్వాములైన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వై.ఎస్.కిషోర్‌బాబు, అధ్యాపకులు శోభన్‌బాబు, వివిధ విభాగాల అధిపతులు మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు, ఐడియాలు అభివృద్ధికి దోహదపడతాయని తెలియజేశారు.

## ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్ శిక్షణకు నూతన బ్యాచ్ ప్రారంభం

నరసరావుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : నరసరావుపేట ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్ శిక్షణకు సంబంధించి 21వ బ్యాచ్ మూడో వారం రోజుల్లో ప్రారంభం అవుతుందని డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు తెలియజేశారు. ఇప్పటికే 20 బ్యాచ్‌లకు విజయవంతంగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కొరకు శిక్షణ పూర్తి చేయడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ అందజేస్తున్నారు. ప్రముఖ సంస్థలలో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ద్వారా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చునని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలియజేశారు. ఇతర వివరాల కొరకు : 9959225428 ను సంప్రదించాలన్నారు.

## స్వర్ణాంధ్ర 2047 విజన్ యూనిట్ల ఏర్పాటు

ఫిరంగిపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త : స్వర్ణాంధ్ర – 2047లో భాగంగా ఏడు నియోజకవర్గాలలో విజన్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధికారి ఎం.కృష్ణకిషోర్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజన్ యూనిట్లకు సంబంధించిన మౌలిక సదుపాయాల కొరకు టెండర్ నోటిఫికేషన్ ఇవ్వనున్నాము. బాక్స్ టెండర్లు ఈ నెల 19వతేదీ నుండి 26వతేదీ వరకు సమర్పించవచ్చన్నారు. పూర్తి వివరాలకు జిల్లా అధికారి కృష్ణకిషోర్ మొబైల్ నెంబర్ 7989422766 ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## పూటకో కట్టుకథ, రోజుకో తప్పుడు కథనం - ఇదే జగన్ దినచర్య : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు20, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ రాకడ చంద్రబాబు పాలన నిలకడతో జగన్, వైసిపి నేతలు నిత్యక్షోభతో అల్లాడిపోతున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తమలోని అక్కసు, అసూయ, అహంకారాన్ని బహిరంగపరిచే క్రమంలో ప్రభుత్వాన్ని, చంద్రబాబుని ఎలా బదనాం చేయాలన్న ఆలోచనలతో తమలో తామే రగిలిపోతున్నారదని అన్నారు. అ క్రమంలోనే పూటకో కట్టుకథ, రోజుకో తప్పుడు కథనంతో తమ అనుబంధ మరియు అవినీతి మీడియాలో విషప్రచారం చేస్తున్నారని ప్రత్తిపాటి అన్నారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ అరాచక పాలనతో విసిగి వేసారిన ప్రజలు గత ఎన్నికలలో చావుదెబ్బ కొట్టిన జగన్, అతని అనుయాయులులో మార్పురాలేదని అన్నారు. వారి ఆలోచన విధానం చూస్తుంటే ఎప్పటికి మార్పు రాదనే అనుకోవలసి వస్తుందన్నారు. గత ఎన్నికలలో ప్రజలు ఒక వార్నింగ్ బెల్‌తో హెచ్చరించారు. అయినా పంథా మార్చుకోకుంటే వైసిపికి, జగన్‌కు శాశ్వతంగా ప్రజలు డెత్‌బెల్ మోగిస్తారని ప్రత్తిపాటి వివరించారు. చింతచచ్చినా పులుసు చావదన్నట్లు ప్రజలు మర్చిపోలేని పరాభవంతో బుద్ధి చెప్పినా, పరనింద, దుష్ప్రచారం చేసే బుద్ధి మాత్రం జగన్‌నుంచి పోలేదని అన్నారు.



**అమరావతి నిర్మాణ పురోగతిని భరించలేకపోతున్న జగన్**

అసత్యాలు, అబద్దాలలోనుంచి పుట్టిన వైసిపి నుంచి నిజాలు వస్తాయనుకోవడం అత్యాశే అవుతుందని ప్రత్తిపాటి అన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు మార్గనిర్ధేశకత్వంలో మరలా అమరావతి పనులు ఊపందుకోవడం, రాజధానిలో రేయింబవళ్లు విరామం లేకుండా నిర్మాణ పనులు కొనసాగటాన్ని జగన్, ఆయన అనుబంధ, అవినీతి మీడియా భరించలేకపోతుందని ప్రత్తిపాటి తెలిపారు.

## ఉత్తమ పురస్కార అవార్డు గ్రహీతలు రూరల్ సిఐ, తహసిల్దార్‌లను సత్కరించిన బిజెపి నాయకులు

చిలకలూరిపేట, ఆగస్టు20, ప్రభాతవార్త: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ పురస్కార అవార్డును అందుకున్న రూరల్ సిఐ బి సుబ్బనాయుడు, చిలకలూరిపేట తహసిల్దార్ షేక్ మహ్మద్ హేస్సేన్‌ను బిజెపి నాయకులు బుధవారం వారి కార్యాలయాలకు వెళ్లి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా తమ శాఖలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బిజెపి తరుపున ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి కార్యదర్శి ఎస్ పోలయ్య, జిల్లా ఉపాధ్యాక్షులు మల్లెల శివనాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమకుమార్, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షులు నెల్లూరి ఈశ్వర రంజిత్, బిజెపి నాయకులు పులుగుజ్జు మహేష్, మాచర్ల శ్రీనివాసరావు, వరికూటి నాగేశ్వరరావు, రావికింది రామకృష్ణ, ఫణికుమార్, అచ్చుకోల మురళీకృష్ణ, టిడిపి నాయకులు అందెల శౌరి తదితరులు పాల్గొన్నారు.





## 224 అనర్హత దివ్యాంగుల పింఛన్ల తొలగింపు : యంపిడిఓ ఎస్ స్వరూపరాణి

నాదెండ్ల, ఆగస్టు20, ప్రభాతవార్త: నాదెండ్ల మండలంలో మెడికల్ ధృవపత్రంపై రూ 15వేలు, రూ 6వేలు దివ్యాంగుల ఫించన్లు తనిఖీ నిర్వహించగా 224 ఫించన్లు అనర్హతగా తేలినట్లు యంపిడిఓ ఎస్ స్వరూపరాణి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలగించిన ఫించన్లు మరలా వైద్యాధికారుల వద్ద ధృవపత్రాలు తెచ్చుకొని గ్రామ సచివాలయంలో ఫించన్ కోరకు ధరఖాస్తు చేసినట్లుయితే, ధరఖాస్తు చేసిన ధృవపత్రం సక్రమంగా ఉన్నట్లయితే తిరిగి ఫించన్ మంజూరు చేస్తామని అన్నారు. చందవరం గ్రామంలో 106మందికి ఫించన్లు పంపిణీ చేస్తుండగా అందులో 52మంది ఫించన్లు తిరస్కరించగా 54 మంది అర్హతగా ఉన్నట్లు గుర్తించామని అన్నారు. చిరుమామిళ్ల గ్రామంలో 44మందికిగాను 26 మందిని అనర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. 18మంది సక్రమంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఎండుగుంపాలెం గ్రామంలో 13మందికిగాను 7గురు అనర్హులుగా మిగిలిన 6గురు సక్రమంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందని అన్నారు. గోరిజవోలు గ్రామంలో 13మందికి 4గురు అనర్హులుగా 9మంది సక్రమంగా ఉన్నట్లు తేల్చారు. ఇర్లపాడు గ్రామంలో 58మందికి గాను 26మంది అనర్హులు, 32మంది అర్హులు, కనపర్రు గ్రామంలో 41మందికి గాను 6గురు అనర్హులు, 35మంది అర్హులు, నాదెండ్ల 1లో 33మందికి గాను 11మంది అనర్హులు, 22మందికి అర్హత ఉన్నట్లు గుర్తించామన్నారు. నాదెండ్ల 2లో 38మందికిగాను 14మంది అనర్హులు, 24మంది అర్హులు, సంకురాత్రిపాడు గ్రామంలో 27మందికిగాను 9మందిని అనర్హులు, 18మంది అర్హులుగా గుర్తించారు. సాతులూరు 2లో 18మందికి గాను 2 అనర్హులు, 16మంది అర్హులు, గణపవరం 1లో 13మందికి గాను 9మంది అనర్హులు, 4గురు అర్హత కలిగిన వారిగా గుర్తించారు. గణపవరం 2లో 20మందికి గాను 17మంది అనర్హులు, 3గురు అర్హులుగా గుర్తించారు. గణపవరం 4లో 20మందికి గాను 17మంది అర్హత లేనివారిగా, 3గురు అర్హత కలిగిన వారిగా గుర్తించారు. తూబాడు గ్రామంలో 53మందికి గాను 13మంది అర్హత లేనివారిగా, 40మంది అర్హత కలిగి వారిగా గుర్తించినట్లు యంపిడిఓ స్వరూపరాణి తెలిపారు. తొలగించిన వారు మరలా సక్రమంగా సర్టిఫికెట్లతో గ్రామ సచివాలయంలో ఫించన్ కొరకు ధరఖాస్తు చేసుకోవాలని ఆమె వివరించారు.



## మార్కండేయ నగర్‌లో నూతన కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

చిలకలూరిపేట, ఆగస్టు20, ప్రభాతవార్త: పట్టణంలోని 32వ వార్డు మార్కండేయ నగర్‌నందు నూతనంగా నిర్మించే నూతన మురుగుకాలువ నిర్మాణ పనులకు బుధవారం మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు, 32వ వార్డు కౌన్సిలర్ రాజేంద్ర, మున్సిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీం, ఎఈ అల్తాఫ్, వార్డు పరిధిలోని టిడిపి నాయకులు జగదీష్, సాంబయ్య, జరపల మోతీబాయి, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ మాజీమంత్రి, స్ధానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలియచేశారు.



## కృష్ణవేణి హైస్కూల్‌లో శాస్త్రీయ దృక్పథ దినోత్సవం

చిలకలూరిపేటటౌన్, ఆగస్టు 20, ప్రభాతవార్త: పట్టణంలోని కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం జనవిజ్ఞానవేదికా ఆధ్వర్యంలో శాస్త్రియ దృక్పథ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట రోటరి డైరక్టర్, జెవివి అధ్యక్షుడు ధూళిపాళ వెంకట్రావు పాల్గొని ప్రసంగిస్తూ మూఢ విశ్వాసాల నిరోధం కోసం, ఉద్యమం చేపట్టిన పద్మశ్రీ డాక్టర్ నరేంద్ర అచ్యుత్ దోబల్కర్ వర్ధంతిని జాతీయ శాస్త్రియ దృక్పద దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. కార్యదర్శి అజయ్‌బాబు మాట్లాడుతూ దోబల్కర్ మరణానంతరం మహారాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల చట్టం చేసిందని అన్నారు. ఆయనను సైన్స్ వ్యతిరేకులు కాల్చి చంపారని అన్నారు. మరణానంతరం కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, చుక్కా విన్సెంట్‌పాల్, షేక్ సిద్దాంతి కరిముల్లా, పాఠశాల ప్రిన్సిపల్ అంజన్‌రావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి అని భావించిన నాయకుడు రాజీవ్‌గాంధీ

చిలకలూరిపేట, ఆగస్టు20, ప్రభాతవార్త: బాపూజి కలలుగన్న సంపూర్ణ స్వరాజ్య సాధనకోసం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరుమీదుగా జవహర్ రోజ్‌గార్‌మోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఢిల్లీ నుంచి ప్రతి పల్లెకు నేరుగా నిధులు పంపించి అవినీతి రహితంగా గ్రామాభివృద్ధికి బాటలు వేసిన దార్శనీకుడు, రాజనీతిజ్ఞుడు దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధి అని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త యం రాధాకృష్ణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ బాజీ, షేక్ సలాం, షేక్ నసిరుద్దిన్, రవి, అంజిరెడ్డి, ఇంటూరి భవాని వెంకటేష్, కారుచోల స్వప్నకుమార్, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ, తాళ్లూరి నాగేశ్వరరావు, నాగూర్‌వలి, షేక్ లాలూ, షేక్ మస్తాన్‌వలి, షేక్ దాదాసాహెబ్, కోవూరి రాజ, మిరియాల వెంకటరత్నం, దాసరి శ్యాంబాబు, తాళ్లూరి రామారావు, శ్రీనివాసరావు, ఉప్పాల బాబు, వెంకటేశ్వర్లు, రామాంజనేయసింగ్, సాంబశివనాయక్, భీమా నాయక్, బండారు కుమార్, గోపి, వెంకటేష్ తదితరులు పాల్గొని రాజీవ్‌గాంధికి నివాళులు అర్పించారు.




## ఆకట్టుకున్న మెగా కిసాన్ మేళా

వినుకొండ, ఆగస్టు20, ప్రభాతవార్త: పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డు నందు గల వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఏర్పాటు చేసిన మెగా కిసాన్ మేళా రైతులను విశేషంగా ఆకట్టుకుంది. వ్యవసాయం దాని అనుబంధ శాఖలకు సంబంధించి 150 స్టాల్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మాచర్ల ఎమెల్యే బ్రాహ్మారెడ్డి, నర్సరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా ప్రెసిడెంట్ గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జల్లా అధ్యక్షులు శశికుమార్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా వ్యవసాధికారులు స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు వల్ల రైతులు బహుళ ప్రయోజనాలు అందిపుచ్చుకోగలరని తెలియజేశారు.



## దాబాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీ

వినుకొండ, ఆగస్టు20, ప్రభాతవార్త: ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టణంలోని దాబాల్లో ఆకస్మిక తనిఖీలు బుధవారం నిర్వహించారు. దాబాల్లో మద్యపానం అనుమతి లేని విషయాన్ని స్పష్టంగా తెలుపుతూ ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. మద్యం సేవించినా, సరఫరా చేసినా యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ డి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.వి గురుస్వామి, ఎస్.కె మస్తాన్ వలి, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.




## వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరి: నూజెండ్ల ఎస్ఐ కృష్ణారావు

నూజెండ్ల, ఆగస్టు20, ప్రభాతవార్త: వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుశాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నూజెండ్ల ఎస్ఐ బీ.వీ కృష్ణారావు తెలిపారు. అనుమతి పత్రంలో విగ్రహం ఏర్పాటు చేసే స్థలం, నిమజ్జన సమయం, ప్రదేశం, ఊరేగింపు వెళ్ళే మార్గాలను స్పష్టంగా పేర్కొనాలన్నారు. మైక్, సౌండ్ బాక్సు వినియోగానికి అనుమతి పొందాలన్నారు. అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ అసౌకర్యం కలిగించినా, మద్యం సేవించి అల్లర్లకు పాల్పడినా కమిటీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



## అన్నదాత సుఖీభవ.. అందని రైతులకు అవకాశం..

నూజెండ్ల, ఆగస్టు20, ప్రభాతవార్త: ఆధార్‌కార్డు తప్పిదాల వల్ల అన్నదాత సుఖీభవ పథకం అందని మండల రైతులు వివరాలు సరి చేసుకోవాలని మండల తహశీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. పథకం జగదు జమ కాని వారి లిస్టులు ఆయా గ్రామ రెవిన్యూ అధికారుల వద్ద ఉన్నాయని పరిశీలించుకొని ఆధార్‌కార్డు వివరాలు రెవిన్యూ అధికారులకు సమర్పించాలని కోరారు.

## ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త : నియోజకవర్గంలోని ముప్పాళ్ళ పిఏసిఎస్ ఛైర్మన్‌గా జెట్టి నాగమల్లేశ్వరరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా సాగు వెంకటశివయ్య, యర్రం అప్పిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో కోఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకం అన్నారు. కొత్తగా నియమితులైన సొసైటీ ప్రతినిధులు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బకాయిలు త్వరగా చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వెంట వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నా పర్యటన

సత్తెనపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త : పట్టణంలోని 10వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ వార్డులో శిఖా బంగారమ్మ కనుమూయడం దురదృష్టకరమన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బంగారమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కన్నా ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త : పట్టణంలోని గాంధీచౌక్ నందు ఉన్న విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నేశ్వరస్వామి దీవెనలతో ప్రతి ఒక్కరూ చల్లగా ఉండాలన్నారు. ఆలయం ఆధునీకరణకు ప్రత్యేక పూజలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆలయానికి తనవంతు సహాయం అందిస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు.



## సత్తెనపల్లిలో బార్ల లైసెన్స్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

సత్తెనపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణంలో బార్‌ల లైసెన్స్‌లకు ఈ నెల 26 వరకు దరఖాస్తులు అందించవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సి.ఐ. పి.విజయ్‌కుమార్ తెలియజేశారు. ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో బుధవారం మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. 2025-2028 నూతన బార్ పాలసీని ప్రకటించి గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. లాటరీ విధానంలో ఈ నెల 28న బార్ లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఏడాది లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ.55 లక్షలు అని తెలిపారు. ఆరు వాయిదాలలో ఈ మొత్తాన్ని చెల్లించాలన్నారు. బార్‌ల ఏర్పాటుకు సంబంధించి ఈ సందర్భంగా నియమ నిబంధనలను సి.ఐ. విజయ్‌కుమార్ తెలియజేశారు.



## ఉదారతను చాటుకున్న డిఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త : పట్టణంలో డిఎస్పీ కార్యాలయంలో పేద విద్యార్థికి రూ.25 వేలను ఆర్థికసహాయంగా డిఎస్పీ హనుమంతరావు అందజేశారు. మాజీ ఏపిపి నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజేటి హరిప్రసాద్ కుమారుడైన హర్ష బిటెక్ చదువుతూ ఇబ్బంది పడుతున్నాడని తెలిపారు. స్పందించిన డిఎస్పీ హనుమంతరావు రూ.25 వేలను విద్యార్థి చదువు నిమిత్తం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి హర్ష, వారి తల్లిదండ్రులు డిఎస్పీ హనుమంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



## గోడ పత్రికల ఆవిష్కరణ

పెదకూరపాడు, ఆగస్టు 20 ప్రభాతవార్త : సిపిఐ ఆధ్వర్యంలో గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నాయకులు బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్‌పార్టీ శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు ఒంగోలులో సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయన్నారు. పేదల పక్షాన పోరాడే పార్టీ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శీలం ముని అధ్యక్షత వహించారు. చెన్నకేశవ, వేదాంతం, మంత్రాలు, సతీష్, శంకర్, కరిముల్లా, పానయ్య పాల్గొన్నారు.



## సంచారజాతుల అభివృద్ధికై బిజెపి కృషి : బిజెపి

ఫిరంగిపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త : సంచార, అర్ధ సంచార జాతుల అభివృద్ధికై బిజెపి ఆధ్వర్యంలో కృషి జరుగుతుందని బుధవారం బిజెపి నాయకులు అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు ఏలూరి శశికుమార్, జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు, శెట్టి హనుమంతరావు, రమేష్, కె.హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 30వతేదీన సంచార, అర్ధ సంచార జాతుల అభివృద్ధి కోసం విజయవాడలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎల్.మాధవ్ నాయకత్వంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పి.వి.ఎన్.మాధవ్ ఆశయాలను కార్యరూపం చేసేందుకు అందరూ సహకరించాలన్నారు. భారతీయ జనతాపార్టీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు సహకరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా సభ గోడ పత్రికలను ఆవిష్కరించారు.

## ఎంఏఎం ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్

ఫిరంగిపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త : ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఇన్నర్ ఇంజనీరింగ్ అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. డైరెక్టర్ దరువూరి శ్రావ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కళాశాల ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల కోసం ఇటువంటి వర్క్‌షాప్‌ల నిర్వహణతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులలో అనంతమైన శక్తి సామర్థ్యాలు ఉంటాయన్నారు. వాటిని గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలను సాధిస్తారని తెలిపారు. ఇన్నర్ ఇంజనీరింగ్‌తో విద్యార్థులు ఉన్నత స్థితికి ఎలా ఎదగాలో తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సాధినేని రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21-8Pg5 9th_21-8Pg5.qxd 8/21/2025 12:25 AM Page 1



# ఢిల్లీ సిఎంపై దాడి ఎందుకు చేశాడు?

## నిందితుని అరెస్టుచేసి దర్యాప్తు జరుపుతున్న పోలీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై ఓ వ్యక్తి దాడి చేయడం సంచనలం రేపిన విషయం తెలిసిందే. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖిమ్జీ భాయ్ సకారియా (41)గా గుర్తించారు. గుజరాత్‌లోనూ అతడిపై దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు దాడికి గల కారణాలు తెలుసుకొనే పనిలో పడ్డారు. ఈ సందర్భంగా అతడి కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. ముఖ్యమంత్రిపై సకారియా ఎందుకు దాడి చేశాడనే విషయంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నిందితుడి బంధువు జైల్లో ఉన్నాడని, అతడిని విడుదల చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేసేందుకు ముఖ్యమంత్రి అధికార నివాసానికి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం కోర్టులో పెండింగులో ఉందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే వీటిని పోలీసులు దృవీకరించాల్సి ఉంది. మరోవైపు గుజరాత్‌లో నిందితుడి తల్లిని ప్రశ్నించిన అధికారులు, ఆమె నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. కుమారుడు ఢిల్లీ సిఎంను కలిసేందుకు వెళ్లిన విషయం తనకు తెలియదని ఆమె చెప్పినట్లు సమాచారం. అతడు జంతు ప్రేమికుడని, ఇటీవల వీధి శునకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అసంతృప్తిగా ఉన్నాడని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే, అతడి మానసిక పరిస్థితి బాగా లేదని, గతంలోనూ ఓసారి ఢిల్లీ వెళ్లి వచ్చా డనిపోలీసులకు వివరించినట్లు సమాచారం. అజీ డ్యామ్ ప్రాంతంలో నివాసముండే రాజేష్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది కేసులు ఉన్నట్లు సమాచారం. 2017–22 మధ్యకాలంలో బెదిరింపులు, స్థానికులపై దాడి, మద్యం మత్తులో దుష్ప్రవర్త నకు సంబంధించి ఈ కేసులు నమోదైనట్లు తెలిసింది.

అయితే జైల్లో ఉన్న బంధువు విడుదల కోసం వెళ్లినట్లు వార్తలు వచ్చినప్పటికీ అటువంటిదేమీ లేదని గుజరాత్ పోలీసులు గుర్తించినట్లు వెల్లడైంది.

ఇదిలా ఉంటే ఢిల్లీ సివిల్ లైన్స్‌లోని సిఎం అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై రాజ్‌కోట్ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. కొన్ని పేపర్లను సిఎంకు అందించిన తర్వాత అతడు గట్టిగా అరుస్తూ సిఎంపై దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనను బిజెపి సహా విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

# ఆగిపోని చమురు కుంపట్లు.. ట్రంప్ కార్యవర్గం లక్ష్యమే భారత్!



**వాషింగ్టన్, ఆగస్టు 20:** రష్యా చమురుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యవర్గం గత 10 రోజులుగా అదేపనిగా భారత్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రకటనలు గుప్పిస్తోంది. ముఖ్యంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈసారి భారత పారిశ్రామిక వేత్తలను లక్ష్యంగా చేసుకొన్నారు. పశ్చిమదేశాలు విధించిన ఆంక్షల లబ్ధిని భారత్ పొందుతోందని ఆరోపించారు. సిఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు. 'రష్యా నుంచి భారత్ చౌకగా చమురు కొనుగోలు చేసి.. దానిని ఉత్పత్తి చేసినట్లు బయట విక్రయిస్తోంది. ఈ యుద్ధ సమయంలో ఇది మొదలుపెట్టింది. దీనిని ఏమాత్రం ఆమోదించలేము. వారు మారువిక్రయం చేసి.. లబ్ధి పొందుతున్నారు. 16 బిలియన్ డాలర్ల వరకు వారికి మిగులుతున్నాయి. ఈ వ్యవహారంలో భారత్‌లోని కొన్ని సంపన్న కుటుంబాలు భాగస్వామ్యం అయ్యాయి. యుద్ధానికి భారత్ రష్యా నుంచి 1 శాతం చమురు కొనుగోలు చేస్తే.. సంక్షోభం మొదలయ్యాక అది 40 శాతానికి చేరింది' అని బెస్సెంట్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ సలహాదారు సిఎన్‌బిసితో మాట్లాడుతూ అమెరికా కోరిక మేరకు భారత్ పెద్దఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఆయన రాపిడన్ ఎనర్జీకి ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. బైడెన్ కార్యవర్గం రష్యా నుంచి వచ్చే చమురు తీసుకోమని భారత్‌ను కోరిందన్నారు. చమురు ధరల్లో భారీ వృద్ధి ఉండకుండానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమెరికా రూపొందించిన ఆంక్షల చట్రంలో భారత్ ధరలను అదుపు చేసే పాత్రను పోషించిందన్నారు.

# కేంద్రం బిల్లును సమర్థించిన శశిథరూర్

## కాంగ్రెస్ వైఖరికి భిన్నంగా వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** గత కొంతకాలంగా కాంగ్రెస్ విధానాలతో విభేదిస్తున్నారు ఆ పార్టీ ఎంపి శశి థరూర్. తాజాగా తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపైకూడా ఆయన పార్టీ అధిష్టానానికి భిన్నంగా వ్యాఖ్యలు చేశారు.

ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఈ బిల్లు క్రూరమైనదన్నారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. అయితే, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడాన్ని శశిథరూర్ తప్పుబట్టారు. ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన విషయం. ఇందులో నాకు ఎలాంటి తప్పు కనిపించడంలేదు అని ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు సెలక్ట్ కమిటీకిపంపే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై థరూర్ మాట్లాడుతూ అదిఎంతో మంచి విషయ మన్నారు.

అది మనప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్రమంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంత వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

# అలాస్కా వ్యక్తికి 'పుతిన్' గిఫ్ట్‌గా ఖరీదైన యూరల్ బైక్!

**వాషింగ్టన్, ఆగస్టు 20:** రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అలాస్కాకు చెందిన ఓ వ్యక్తికి రూ. 19లక్షల విలువైన బైక్‌ను పుతిన్ బహుమతిగా ఇచ్చారు. రష్యాలో తయారైన యూరల్ బైక్‌ను అతడు వాడుతుండటమే అందుకు కారణం. ఈ ఊహించని పరిణామానికి అలాస్కా వ్యక్తి ఆనందంతో మునిగిపోయాడు. అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల భేటీ జరిగింది. అంతకు ఓవారం ముందే యాంకరేజ్‌కు చేరుకున్న రష్యన్ మీడియా ప్రతినిధులు స్థానికులతో ముచ్చటించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో యూరల్ కంపెనీకి చెందిన ఓ పాత బైక్ వాడుతున్న మార్క్ వారెన్ అనే రిటైర్డ్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ రష్యా జర్నలిస్టుల కంటపడ్డాడు. ఈ బైక్‌అంటే చాలాఇష్టమని చెప్పినవారెన్.. యుద్ధం నేపథ్యంలో ఆ బైక్ విడిభాగాలు దొరకట్లేదని, నిర్వహణ కష్టంగా మారిందని వాపోయాడు. ట్రంప్–పుతిన్ భేటీ వల్ల ఈ యుద్ధానికి ముగింపు లభిస్తే ప్రయోజనం ఉంటుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు అవునంటూ సమాధానమిచ్చాడు.

ఇందుకు సంబంధించిన న్యూస్ రష్యాలో వైరల్‌గా మారింది. క్రెమ్లిన్ దృష్టికీ వెళ్లింది. దీంతో స్పందించిన రష్యా అధికారులు వారెన్‌కు ఫోన్ చేసి బైక్ గురించి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పుతిన్ వచ్చిన విమానంలోనే ఆ బైక్‌ను తీసుకొచ్చినఅధికారులు.. అమెరికా అధికారుల సాయంతో స్థానిక ఎంబసీకి తరలించారు. భేటీ మరుసటి రోజు దీనిని వారెన్‌కు అప్పగించే ఏర్పాట్లు చేశారు. సతీమణితో రష్యా ఎంబసీకి వెళ్లిన వారెన్‌కు.. రష్యా అధ్యక్షుడు మీకు ఇచ్చిన బహుమానం ఇదేనని బైక్‌ను చూపించడంతో ఆనందంతో మునిగిపోయాడు.



# గాజాపై ఇజ్రాయెల్ మలిదశ పోరాటం

## రంగంలోకి 50 వేల మంది రిజర్వ్ బలగాలు!

**టెల్‌అవీవ్, ఆగస్టు 20:** గాజా నగరంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం మరో దశ సమరానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనికవర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం రానున్న రోజుల్లో దాదాపు 50 వేల మంది రిజర్వు బలగాలను రంగంలోకి దించనున్నట్లు పేర్కొన్నాయి. గాజా నగరంలోని పలు ప్రాంతాల్లో హమాస్ ఇంకా చురుకుగా ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం భావిస్తోంది. తమ సైన్యం కార్యకలాపాలు లేని అటువంటి ప్రాంతాలపై దృష్టి పెట్టామని.. త్వరలోనే అక్కడ సైన్యాన్ని మోహరించే ప్రయత్నాలు చేస్తున్నామని ఓ అధికారి వెల్లడించారు. ఇందుకు సంబధించిన ప్రణాళిక తుది దశలో ఉందన్నారు. అయితే, ఈ ఆపరేషన్ ఎప్పుడు మొదలవుతుందనే విషయంపై స్పష్టత లేదు. రానున్న నెలల్లో 50 మంది రిజర్విస్టులను రంగంలోకి దించనున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2 లక్షలకు చేరుకుంటుందన్నారు.

మరోవైపు గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రతిపాదనకు సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఇటీవల ప్రకటించింది. ఐడిఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాయని, యుద్ధభూమికి వెలుపల ఉన్న ప్రజలకు మానవతా సాయం అందించనున్నట్లు పేర్కొంది. ఈ చర్య హమాస్ దగ్గర బందీలుగా ఉన్న వారిని వెనక్కి తీసుకొచ్చే ప్రణాళికలలో భాగమని వివరించింది. అయితే, ప్రధాని నెతన్యాహు మాత్రం గాజాను స్వాధీనం చేసుకోవడం తమ ప్రణాళిక కాదన్నారు. హమాస్‌ను నాశనం చేసి బందీలను వెనక్కి తీసుకున్న తర్వాత, ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమే తమ లక్ష్యమన్నారు.

# పాక్ క్రికెటర్ వాసిం అక్రంపై బెట్టింగ్ యాప్ కేసు

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** భారత్‌లో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి సినీ తారలతో పాటు క్రికెటర్లు, సెలబ్రిటీలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ)తో పాటు ఆయా రాష్ట్రాలు వేరు వేరుగా కేసులు నమోదు చేయడం తెలిసిందే. దీనికి సంబంధించి నిందితులుగా వున్న వారిలో క్రికెటర్ సురేష్ రైనా, టాలీవుడ్ నటులు పలువురిని ఈడీతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసులు ఇప్పటికే విచారించి వారి వాంగ్మూలం కూడా తీసుకు న్నారు. ఇప్పుడు ఇదే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు పాకిస్తాన్‌కు చెందిన దిగ్గజ క్రికెటర్ వాసిం అక్రంపై లాహోర్ లోని నేషనల్ సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సిసిఐఎ)లో కేసు నమోదయ్యింది. లాహోర్‌కు చెందిన ఫైజ్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు వాసిం అక్రంపై కేసు నమోదయ్యింది. వాసిం అక్రం కొన్నేళ్లుగా బాజీ అనే విదేశీ బెట్టింగ్ యాప్‌కు బ్రాండ్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నాడని ఫైజ్ తన ఫిర్యాదులో తెలిపాడు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వున్న పోస్టర్లు, వీడియో క్లిప్‌ను అతను పోలీసులకు అందించాడు. వాసిం అ క్రం వంటి సెలబ్రిటీ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం వల్ల సామాన్యులు ముఖ్యంగా యువత జూదం వైపు మళ్లీ అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో ఫైజ్ తెలిపాడు. ఇందుకుగానూ వాసిం అక్రంపై ఎలక్ట్రానిక్ క్రైం యాక్ట్ 2016 కింద చర్యలు తీసుకోవాలని ఫిర్యా దిదారుడు కోరాడు. ఈ ఫిర్యాదు మేరకు ఎన్‌సిసిఐఎలో వాసిం అక్రంపై కేసు నమోదయ్యింది.

# ఆడుకుంటూ కారులోకి వెళ్లిన అన్నదమ్ములు

## ఆటో లాక్ పడి ఊపిరాడక మృతి



**జైపూర్, ఆగస్టు 20:** ఆట ఆడుకుంటూ కారులోకి వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు మరణించారు. కారు ఆటో లాక్ పడటంతో ఊపిరాడక అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. తమ పిల్లలు కనిపిచడం లేదని వెతికినా తల్లిదండ్రులకు ఇంటికి కేవలం 20 మీటర్ల దూరంలో పార్క్ చేసిన కారులో విగత జీవులుగా కనిపించారు. ఈ ఘటన రాజస్థాన్‌లో జరిగింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనగా పోలీసులు భావిస్తుండగా, తల్లిదండ్రులు మాత్రం హత్య అని అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, జయపుర్‌లోని గలతా గెట్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఇద్దరు మైనర్ సోదరులు మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా కనిపించకుండా పోయారు. ఒకరికి 8 యేళ్ల కాగా, మరొకరికి 5సంవత్సరాల వయసు ఉంటుంది. వారి కుటుంబసభ్యులు అర్ధరాత్రి వరకు వెతికినా, ఎక్కడా ఆచూకీ లభించలేదు. చివరకు తమ పిల్లలు కనిపించడం లేదని గలతా గెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఆ పిల్లల ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు వెతకడం ప్రారంభించారు. ఇంటికి కొంచెం దూరంలో పార్క్ చేసి ఉన్న కారులో ఆ పిల్లల మృతదేహాలు కనిపించారు. ఆ మైనర్ సోదరులు ఊపిరాడక మృతి చెందారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎసిపి రామ్ గంజ్ తెలిపారు. చిన్నారులు ఇద్దరు ఆటలాడుతూ కారులో వెళ్లారు. అది ఆటో లాక్ కావడం వల్ల లోపలే చిక్కుపోయారు. దీంతో ఊపిరాడక మృతి చెంది ఉంటారని తెలిపారు.

శవపరీక్షల నిమిత్తం మృతదేహాలను ఎస్ఎంఎస్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అలాగే ఫోరెన్సిక్ బృందాన్ని పిలిపించి కారులోని వేలిముద్రలను సేకరించినట్లు తెలిపారు. ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న సిసిటివిలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అన్నారు. అయితే తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలను హత్య చేసినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మృతదేహాలపై గాయాలు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే రఫీక్‌ఖాన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# ప్రియుడితో దొరికిన భార్య - వారిద్దరికీ వివాహం చేసిన భర్త!

**లక్నో, ఆగస్టు 20:** ఆ ఇద్దరికి వివాహం జరిగి 25 యేళ్లు. వారికి ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో భార్య తన ప్రియుడితో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా భర్త కంటపడింది. దాంతో ఆ భర్త విచిత్రమైన నిర్ణయం తీసుకున్నాడు. ఇద్దరికీ దగ్గరుండి వివాహం జరిపించాడు! ఉత్తరప్రదేశ్ లోని వారణాసి నగరంలో ఈ ఘటన జరిగింది. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మీర్జాపూర్ జిల్లాకు చెందిన అర్వింద్ పటేల్, చందౌలి జిల్లా హమీద్‌పూర్‌కు చెందిన రీనాకు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పాతికేళ్లుగా ఇద్దరూ కాపురం చేస్తున్నారు. వారికి ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో రీనాకు చందౌలికే చెందిన సియారామ్ యాదవ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా వివాహేతర బంధానికి దారితీసింది. సియారామ్ గతంలో అర్వింద్ పటేల్‌కు చెందిన దుకాణంలో పనిచేసేవాడు. ఆ సమయంలోనే అతడికి రీనాతో పరిచయం ఏర్పడింది. అది క్రమంగా వివాహేతర బంధానికి దారితీసింది.

# పాకిస్థాన్‌కు అది సిగ్గు చేటు

## ఐరాసలో దాయాది దురాగతాలను ఎండగట్టిన భారత్

**న్యూయార్క్, ఆగస్టు 20:** పాకిస్థాన్‌లో మైనారిటీ వర్గాల మహిళలపై లైంగిక హింస నేటికీ కొనసాగుతోందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మహిళలపై దారుణమైన నేరాలకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిదని, అయినప్ప టికీ వారిపై చర్యలు శూన్యమని దుయ్యబట్టింది. ఆ దురాగతాలు నేటికీ కొనసాగుతున్నాయని ఐరాస వేదికగా మండిపడింది.

'1971లో మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మైనారిటీ వర్గాల మహిళాపై దారుణమైన లైంగిక హింసకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిది. అయినప్పటికీ నిందితులపై ఎటువంటి శిక్షలు విధించకపోవడం సిగ్గుచేటు. అటువంటి దుర్భర పరిస్థితి నేటికీ పాక్‌లో కొనసాగుతోంది. మహిళల అపహరణ, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగికహింస, బలహీనవర్గాల మహిళ బలవంతపు మత మార్పిడిలు, బాలికలపై వేధింపులకు సంబంధించి ఐరాస మానవ హక్కుల కమిషన్‌తోపాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమ నివేదికల్లో వివరించాయి' అని ఐరాసలో భారత రాయబారి ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ వెల్లడించారు.

ఐరాస భద్రతా మండలిలో 'సంఘర్షణ– సంబంధిత లైంగిక హింస' అనే అంశంపై పున్నూస్ ప్రసంగిస్తూ పాక్ తీరును ఎండగట్టారు. గతంలో బంగ్లాదేశ్‌లో మహిళలపై పాకిస్థాన్ సైన్యం చేసిన దురాగతాలను ప్రపంచం ముందుంచారు. వీటికి అక్కడి న్యాయవ్యవస్థకూడ వంత పాడుతోందని విమర్శలు గుప్పించారు. క్రూరమైన చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయన.. హేయమైన చర్యలకు పాల్పడేవారిని శిక్షించాలన్నారు. సంఘర్షణ ప్రాంతాల్లో లైంగిక హింస అనేది వ్యక్తిగత జీవితాలను నాశనం చేయడమే కాకుండా సమాజంలోనూ భయాలను సృష్టిస్తుందన్నారు.

ఇటువంటి అంశాలకు పరిష్కార మార్గం చూపిన దేశాల్లో భారత్ ఒకటని, సెక్రటరీ జనరల్ ట్రస్ట్ ఫండ్‌కు సాయం అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

# నిషేధం కాదు.. నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

## ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌పై కేంద్ర మంత్రి అమిత్ షాకు గేమింగ్ ఫెడరేషన్ లేఖ

**న్యూఢిల్లీ,ఆగస్టు 20:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల మరీ పెరిగిపోయాయి. దీన్ని అరికట్టడంలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఎఐజిఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్ల మంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లను నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేగాక ఈ రంగంలోని అనేక మంది ఉద్యోగులపై కూడా దీని ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. ఈ సందర్భంగా దీన్ని పూర్తిగా నిషేధం విధించేకంటే దానిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు వారు బాధ్యతాయుతంగా ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, పరిశ్రమను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడకం ఇటీవల విపరీతంగా పెరిగిపోయింది. దీనికి బానిసైన కొందరు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు.

ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకువచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని అధికార వర్గాలు తెలిపాయి. నేడు దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# సంక్షిప్తంగా..

## అఫ్గాన్ బస్సులో మంటలు, 71 మంది మృతి

**కాబూల్, ఆగస్టు 20:** అఫ్ఘానిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇరాన్ నుంచి తరలిపోతున్న వలసదారుల బస్సుకు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో 71 మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమ హెరాత్ ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఇరాన్ నుంచి ఇటీవల బహిష్కరణకు గురైన అఫ్ఘాన్ వలసదారులతో వెళ్తున్న బస్సు, మోటార్‌సైకిల్ ఢీకొన్నాయి. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందితో సహా స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో 17 మంది చిన్నారులతో సహా 71 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నాం. మోటార్‌బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా మృతి చెందారు. నిర్లక్ష్యం, అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీనిపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది. కాగా.. అఫ్ఘాన్ శరణార్థులపై ఉక్కుపాదం మోపుతున్న ఇరాన్, పాకిస్థాన్ భార డిపోర్టేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ యేడాది ప్రారంభం నుంచి దాదాపు 1.5 మిలియన్ల మందికిపైగా అఫ్ఘాన్‌స్లు ఇరాన్, పాకిస్థాన్ నుంచి బలవంతంగా స్వదేశానికి తిరిగివచ్చారు.

## అగ్ని 5 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం



**భువనేశ్వర్, ఆగస్టు 20:** భారత్ 'అగ్ని 5' బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరం డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ క్షిపణిని పరీక్షించింది. ఇది అణు సామర్థ్యం ఉన్న స్వదేశీ క్షిపణి. ఇది రక్షణ రంగంలో దేశానికి ఉన్న బలమైన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. ఈ పరీక్షను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) నిర్వహించింది. 'అగ్ని 5' ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థం దీని సొంతం. శ్రేణి: 'అగ్ని 5' ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి, ఇది 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. టెక్నాలజీ: ఈ కిపణి మూడు దశల ఘన ఇంధన ఇంజిన్‌ను కలిగి ఉంది. లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం: 'అగ్ని 5' ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థం దీని సొంతం.

## ఢిల్లీలో కుప్పకూలిన భవనం.. ముగ్గురు దుర్మరణం



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని దర్యాగంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై సమాచారం అందిన వెంటనే ఢిల్లీ స్థానిక అధికారులు, ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనా స్థలంలో భవన శిథిలాల తొలగింపు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. ఘటనకు కారణాలపై నిర్ధారణకు వచ్చిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదరింపులు

**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో పలు పాఠశాలలకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. దాదాపు 50కి పైగా పాఠశాలలకు కొందరు దుండగులు ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సోదాలు నిర్వహించారు. టెర్రరైజర్స్ 111గా పేర్కొనే ఒక గ్రూపు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు బెదిరింపు మెయిల్స్ పంపించినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్కూళ్లలోని కంప్యూటర్లు, కెమెరాలు అన్నీ ప్రస్తుతం తమ అధీనంలో ఉన్నాయన్నారు. 25,000 బిలియన్ డాలర్లు తమకు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. లేదంటే 48 గంటల్లో బాంబు పేల్చేస్తామని బెదిరించినట్లు వెల్లడించారు. మెయిల్స్ విషయాన్ని పోలీసులకు చెప్తే బాంబు పేల్చేయడంతో పాటు స్కూళ్లకు సంబంధించిన డేటాను లీక్ చేస్తామని హెచ్చరించారన్నారు. ఇదే గ్రూప్ ఇటీవల 5వేల బిలియన్ డాలర్ల కోసం ఇలాంటి బెదిరింపులకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు.

## ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు

### - మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** అవగాహనతో,ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ అన్నారు. 16 ఏళ్లకే తాను బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడ్డానని ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ తెలిపారు. అవగాహనతో తొలి దశలోనే వైద్యం తీసుకున్నానని దానితో బ్రెస్ట్ క్యాన్సర్‌ను జయించానని ఉద్ఘాటించారు. మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. తొలి దశలోనే గుర్తిస్తే ఈ వ్యాధి నుంచి బయటపడొచ్చని తెలిపారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం దోకిపర్రులో ప్రపంచ సుందరీమణులు సందడి చేస్తున్నారు. తెలుగు సంప్రదాయ వస్త్రధారణలో గ్రామంలో మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ. మిస్ ఆసియా కృష్ణా గ్రావిడిజ్ పర్యటించారు. దోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని సుందరీమణులు దర్శించుకున్నారు. మంగళ హారతులు ఇచ్చి కుంకుమ బొట్టు పెడుతూ గ్రామస్తులు సుందరీమణులకు స్వాగతం పలికారు. దేవస్థాన ప్రాంగణంలో భారతదేశ సాంప్రదాయం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు చూసి సుందరీమణులు మురిసిపోయారు.కృష్ణా జిల్లా దోకిపర్రు గ్రామంలో సుధారెడ్డి ఫౌండేషన్ - మెయిల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ, మిస్ ఆసియా కృష్ణా గ్రావిడిజ్, సుధారెడ్డి ఫౌండేషన్ అధినేత సుధారెడ్డి ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ, మిస్ ఆసియా కృష్ణా గ్రావిడిజ్ హాజరయ్యారు. పేద మహిళలకు ఆరోగ్యాన్ని సంరక్షించే కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్ సుధారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు తమలాంటి వారికి ఆదర్శనీయమని కొనియాడారు. గ్రామీణ మహిళలు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ సూచించారు. బ్రెస్ట్ క్యాన్సర్ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు వస్తుందని సుధారెడ్డి ద్వారా తెలుసుకున్నానని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనటం సంతోషంగా ఉందని వెల్లడించారు. తొలి దశలోనే బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధిని గుర్తించి తగినచికిత్స తీసుకోవచ్చునని ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి: కృష్ణా గ్రావిడిజ్ :మహిళలు ఆరోగ్యంగా, బలంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని మిస్ ఆసియా కృష్ణా గ్రావిడిజ్ తెలిపారు. క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ముందుండి మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపడతామని కృష్ణా గ్రావిడిజ్ చెప్పుకొచ్చారు. ఇటువంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొనటం సంతోషంగా ఉందని తెలిపారు. మహిళల్లో ఎక్కువగా వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనతో పాటు తొలి దశలోనే చికిత్స అవసరమని కృష్ణా చెప్పుకొచ్చారు. సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు మెడికల్ సపోర్ట్ ఉండటం చాలా గ్రేట్ అని కృష్ణా గ్రావిడిజ్ పేర్కొన్నారు. సుధారెడ్డి ఫౌండేషన్ - మెయిల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని సుధారెడ్డి ఫౌండేషన్ అధినేత సుధారెడ్డి తెలిపారు.

## దుర్గమ్మ ఆలయంలో ఘనంగా దసరా ఉత్సవాలు

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 20, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఈ ఏడాది దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ లక్ష్మిశా ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 2 వరకు జరిగే దసరా ఉత్సవాల్లో సామన్యభక్తులకు సంతృప్తికర దర్శనం, సౌకర్యాల కల్పన ధ్యేయంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవ నిర్వహణలో ఆధ్యాత్మిక శోభతో వుండాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. భక్తులకు తాగునీరు, అన్న ప్రసాదం సమృద్ధిగా అందించాలన్నారు. ప్రకాశంబ్యారేజ్, దేవస్థానం ప్రాంగణమంతా వెలుగులతో నింపడానికి విద్యుదీపాలంకరణ చేయాలన్నారు. కృష్ణమ్మవారికి హారతులు వైభవంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవాలకు ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో దాతల సహకారం తీసుకోవాలన్నారు. విజయవాడ ఖ్యాతిని పెంచేలా ఉత్సవ నిర్వహణ చేయాలని సిఎం ఆదేశాల మేరకు పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ధ్యాన్‌చంద్, దేవదాయ శాఖ కమీషనర్ రామచంద్ర మోహన్, ఇఓ వికె శీ నా నాయక్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. - దుర్గమ్మవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం : దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116ల విరాళాన్ని విజయవాడకు చెందిన ఆర్ మురళి శ్రీనివాస్, భార్య నాగసౌజన్య, కుమారుడు ప్రణవ్ అర్జున్ పేరిట బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



దాతలకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న సిబ్బంది

## కేంద్రంలో మోడీ అబద్ధాలతో పాలన సాగిస్తున్నారు: డాక్టర్ చింతామోహన్




**తిరుపతి,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం,ప్రధాని మోదీ అబద్ధాలతో పాలనసాగిస్తున్నారని మాజీకేంద్రమంత్రి, సీనియర్‌కాంగ్రెస్ నేత డాక్టర్ చింతామోహన్ ధ్వజమెత్తారు. ప్రతి కుటుంబానికి 15లక్షలు రూపాయులు ఇస్తామని, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అది నెరవేర్చలేదన్నారు. అసలు 11ఏళ్ళలో 22కోట్ల ఉద్యోగాలు ఎక్కడ?అని ప్రశ్నించారు. ఇంటికి 15లక్షలు రూపాయలు ఇస్తామని 15 పైసలు కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. బుధవారం స్వర్గీయ మాజీప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాలలు మేసివేస్తోందన్నారు. సిఎం చంద్రబాబు నియంతలా పరిపాలన చేస్తున్నాడని విమర్శించారు. ఎస్సీలు కుప్పం నుండి ఇచ్చాపురం వరకు పాదయాత్ర చేపడితే ఆపేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు.

## నూతన విద్యా విధానంతో దేశాభివృద్ధి

### ఎస్వీయూ విసి అప్పారావు



**తిరుపతి విద్య ఆగస్టు 20 ప్రభాత వార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంతో సత్వర దేశాభివృద్ధి సాధ్యమని ఎస్వీయూ వీసీ అప్పారావు పేర్కొన్నారు. ఏబీఆర్ఎస్ఎం,వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఐపీ2020 విధానాన్ని ప్రవేశపెట్టి 5 సంవత్సరాలు పూరైన సందర్భంగా ఖిఎన్ ఈ పి 20 20 ఎట్ ది రేట్ ఫైవ్ ఇయర్స్,పాలసీ ,ప్రాక్టీస్, అండ్ ప్రోగ్రెస్‌ఖిఅనే అంశంపై సదస్సును బుధవారం ఎస్వీయూ సెనేట్ హాల్లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ నూతన విద్యావిధానాన్ని కేంద్ర 2020లో ప్రారంభించిందని,గత ఐదేళ్లుగా కేజీ టూ పీజీ వరకు ఎన్ఆపీని అమలు పరుస్తున్నారని తెలిపారు. అనంతర ముఖ్యవక్తగా విచ్చేసిన ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటనా కార్యదర్శి గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని, కానీ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య దాకా అంతా మాతృభాషలోనే జరుగుతుందని తెలిపారు.భారతీయ విద్యార్థులు జ్ఞానాన్ని అనుసరించే వారు కాకుండా జ్ఞానాన్ని తయారు చేసే వారుగా ఎదగాలని దీనికి జాతీయ విద్యా విధానంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు.ప్రస్తుతం దేశంలో 26 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని 1500 విశ్వవిద్యాలయాలు,

46 వేల కళాశాలలు, కొన్ని లక్షల పాఠశాలలు ఉన్నాయని వీటన్నింటిలో మౌలిక వసతుల మెరుగు కోసం బడ్జెట్లో కేటాయిస్తున్న జీడీపీ కనీసం 6శాతం పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు వైవీ రామిరెడ్డి,ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ సి వాణి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి రాజశేఖర్, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ ఎన్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ రంజని, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్య హైదరాబాద్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమిషయన్స్, పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, 300మంది విద్యావేత్తలు పాల్గొన్నారు.

## సీమలో రైల్వే జిఎం విస్తృత తనిఖీలు



సీమలో భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే జీఎం

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 20,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ బుధవారం రాయలసీమ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో విస్తృతంగా భద్రతా తనిఖీలను నిర్వహించారు. నిర్ణీత కార్యక్రమం ప్రకారం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో గుంతకల్లు డివిజన్ డోన్,గుత్తి మీదుగా తిరుపతి వెళ్లిన ఆయన తన పర్యటనను తిరుపతి నుంచి ప్రారం భించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా తిరుపతి దక్షిణం వైపు నిర్మిస్తున్న స్టేషన్ పనులను రాజంపేట,కడప రైల్వే స్టేషన్లలో మార్గమధ్యలో రైలు మార్గాలను విండో భద్రతా తనిఖీలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం గుంతకల్లుకు చేరుకుని డివిజనల్ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో జోనల్ ఉన్నతాధికారులు కె సూర్య నారాయణ,సాయిప్రసాద్,గుంతకల్లు డివిజన్ నుంచి డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా,అదనపు డిఆర్ఎం సుధాకర్,సిఎంఎస్ డాక్టర్ జీవి గోపాల్ రెడ్డి,రామక్రిష్ణ,మనోజ్, జిబిఎస్ శ్రీనివాస్,శ్రావణ్ కుమార్,డి సూర్యనారాయణ,చంద్రశేఖర్,సుదర్శన్‌రెడ్డి, వీరయ్య, మంగాచార్యులు, హెచ్ఎల్ఎన్ ప్రసాద్,వై సందీప్,ఆకాశ్ కుమార్,జైశ్వాల్,అనిల్ కుమార్,కె శ్రీనివాస్,లక్ష్మణ్,ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు, సీనియర్ సబార్డినేట్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుష్ లైసెన్సుల రెన్యువల్‌కు ప్రత్యేక మేళాలు

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల నిర్వహణ రెన్యువల్స్ కోసం ఆయుష్ శాఖ తొలిసారిగా ప్రత్యేక మేళాలను రాష్ట్రంలో నిర్వహించడం ప్రారంభించింది. ఈనెల 25నుండి మలి విడత మేళాలను నిర్వహించనున్నట్లు ఆయుష్ శాఖ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుష్ శాఖ అడిషనల్ డైరెక్టర్లు, డ్రగ్ ఇన్ స్పెక్టర్లు, సహాయక సిబ్బంది ఆయుష్ మేళాకు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన తయారీ యూనిట్లు, దుకాణాల యజమానులు, విక్రేతలు ఏలూరులోని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో ఈనెల 25, 26 తేదీల్లో, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఓల్డ్ రిమ్స్ హాస్పిటల్, గవర్నమెంట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్, ప్రకాశం భవన్ ఎదురుగా, ఒంగోలు చిరునామాలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో, ఉమ్మడి కర్నూలు, వైయస్సార్ కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల వారు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, ఓల్డ్ రిమ్స్ , 8రోడ్స్ దగ్గర, కడప చిరునామాలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో హాజరుకావాలని ఆయుష్ శాఖ డైరెక్టర్ కోరారు. లైసెన్సులు రెన్యువల్ చేయడంతో పాటు వారివారి సమస్యల పరిష్కారం కోసం ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు మచిలీపట్నంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్

**గన్నవరం(కృష్ణా), అగష్టు 20, ప్రభాతవార్త :** కృష్ణాజిల్లా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికయిన అభ్యర్దులకు కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు జిల్లాఎస్పీ గంగాధరరావు తెలిపారు. రెండుజిల్లాలకు కలిపి మచిలీ పట్నంలోని జిల్లాపోలీస్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుపుతున్నామని, ఈనెల 22, 23 తేదీల్లో కృష్ణాజిల్లా అభ్యర్దులకు, 25,26 తేదీల్లో ఎన్‌టిఆర్‌జిల్లా అభ్యర్దుల సర్టిఫికెట్ల పరిశీలన చేస్తామన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్దులు వారి వద్ద ఉన్న స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3 ధరఖాస్తులతోపాటు, ఫార్మెట్‌లో ఉన్న విధంగా సర్టిఫికెట్‌లు, 3సెట్ల జిరాక్స్ కాపీలపై అటెస్టేషన్ చేయించుకుని వాటితోపాటు 3 పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలను తీసుకు రావాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పోలీసులు సూచించిన తేదీలలో ఎంపికయిన అభ్యర్దులు తప్పనిసరిగా రావాలని, వెరిఫికేషన్‌కు రాని అభ్యర్దులను అనర్హులుగా ప్రకటిస్తామని తెలిపారు. పూర్తివివరాలకు సెల్- 9398 128969 సంప్రదించాలని జిల్లాఎస్పీ సూచించారు.

## కత్తి చూపి బెదిరింపు కేసులో నిందితులు అరెస్టు



**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 20, ప్రభాతవార్త :** కోవూరులోని పడుగుపాడు పంచాయతీకి సంబంధించి ఒక బిల్డర్‌ను కత్తి చూపి బెదిరించిన కేసులో ప్రధాన నిందితురాలు నిడిగుంట అరుణ, ఆమెకు సహకరించిన పల్లం వేణు, అంకెం రాజా, శీరం ఎలీషలను బుధవారం తెల్లవారుజామున పోలీసులు అద్దంకి టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు పడుగుపాడు ప్రాంతానికి చెందిన మునగ వెంకట మురళికృష్ణ మోహన్ వృత్తిరీత్యా బిల్డర్ 2010 సంవత్సరంలో పడుగుపాడు ప్రాంతంలో సాయి ఎన్‌క్లేవ్ పేరుతో 15 ప్లాట్లతో కూడిన ఒక అపార్ట్‌మెంట్ ను నిర్మించారు. అందులో 14 ప్లాట్లు అమ్ముడు కాగా 503 ప్లాట్‌ను తన దగ్గరే ఉంచుకున్నాడు. 2020 సంవత్సరంలో అదే ప్రాంతానికి చెందిన నిడిగుంట అరుణకు ఆ ప్లాట్‌ను 7500 రూపాయల అద్దెకు ఇవ్వడం జరిగింది. అనంతరం కొద్దిరోజులు అయిన తర్వాత అరుణ ఆ ప్లాట్ తనకే అమ్మాలని అడ్వాన్స్‌గా 3 లక్షలు చెల్లించి మిగిలిన 25 లక్షలను 2023 ఫిబ్రవరి 11వ తేది చెల్లించే విధగా అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. అయితే అప్పటి నుంచి ఆమె అద్దె చెల్లించకుండా డబ్బు కట్టకుండా వెంకట మురళికృష్ణ మోహన్‌ను ఇబ్బంది పెడుతూ వచ్చింది. ఈ మేరకు అతను ఆమెపై కోర్టులో కేసు కూడా వేశాడు. ఈ పరిస్థితుల్లో 2024 నవంబర్ నెల 1వ తేది నిడిగుంట అరుణ తన అనుచరులైన పల్లం వేణు, అంకెం రాజా, శీరం ఎలీషలతో కలిసి వెంకట మురళికృష్ణ మోహన్‌ను బెదిరించి ప్లాట్‌కు సంబంధించి 5 లక్షల రూపాయలు చెల్లించినట్లు ఒక ఒప్పంద పత్రాన్ని రాయించుకుని అతను సంతకం చేయకపోతే చంపేస్తానని వారు బెదిరించారు. ఈ మేరకు వెంకట మురళికృష్ణ మోహన్ కోవూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## బాధ్యతగా పనిచేయండి : గుంతకల్లులో రైల్వే జిఎం

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 20,ప్రభాతవార్త** వృత్తి పట్ల నిబద్ధత,బాధ్యత,అంకితభావంతో పనిచేసి నిర్ధేశిత లక్ష్యసాధనకు కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ రైల్వే యంత్రాంగాన్ని కోరారు. రాయలసీమలోని గుంతకల్లు రైల్వే డివిజన్‌లో బుధవారం తిరుపతి-రేణిగుంట-కడప-గుంతకల్లు సెక్షన్‌లో విస్తృత భద్రతా తనిఖీలు చేశారు. అనంతరం ఆయన గుంతకల్లుకు చేరుకుని సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. డివిజన్ పరిధిలో అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన స్టేషన్లలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను మౌలిక సదుపాయాల కల్పన, ప్రయాణికుల, ట్రాఫిక్ సౌకర్యాల కల్పన తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన డివిజనల్ కంట్రోల్ కార్యాలయాన్ని సందర్శించారు. కంట్రోల్ కార్యాలయం పనితీరు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.


## రూ.2కోట్ల విలువైన ఎర్రచందనం పట్టివేత

### - అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు

**తిరుపతి,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం పరిధిలో తిరుపతి అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు 2కోట్ల రూపాయలు విలువైన ఎర్రచందనం దుంగలను, లారీని పట్టుకున్నారు. అక్రమంగా రవాణి చేస్తున్న హర్యానాకు చెందిన స్మగ్లర్‌ను అరెస్టుచేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అధినేత ఎల్.సుబ్బ రాయుడు ప్రత్యేక కార్యాచరణతో ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలతో డిఎస్పీ ఎండి షరీఫ్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరధర్,ఆర్ఎస్ఐ కెఎస్‌కె లింగాధర్ సిబ్బందితో అందిన సమాచారం మేరకు విజయవాడ చెన్నై మార్గంలో కావలి ప్రాంతంలో కావలి పోలీసుల సహకారంతో ఎర్రచందనం అక్రమంగా రవాణాచేస్తున్న లారీని పట్టుకున్నారు. లారీనుండి ఒకడు పరావగా హర్యానాకుచెందిన వ్యక్తిని పట్టుకున్నారు. లారీని,2కోట్ల విలువైన 83 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. ఎర్రచందనం అక్రమరవాణ చేస్తూ పట్టుబడిన ముగ్గురు స్మగ్లర్లకు ఐదేళ్ళజైలుశిక్ష, 6లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ అదనపు జిల్లా జడ్జి జస్టీస్ నరసింహమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. గతంలో ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిపై కోర్టులో కేసు విచారణ సాగడంతో తమిళనాడు తిరువళ్ళూరుకు చెందిన పి.మురుగన్; ఎస్.సురేష్, ఎం,చిన్నపయ్యన్‌పై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష; జరిమానా విధించారు.

## పోర్టు ఆధారిత పరిశ్రమలతోనే అభివృద్ధి

### - భూములు ఇచ్చిన కుటుంబాలకు అండగా ఉంటాం - స్థానిక యువతకు ఇండో సోల్ పరిశ్రమలో - ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్ ఒ.ఆనంద్



**గుడ్లూరు (నెల్లూరు), ఆగస్టు 20, ప్రభాతవార్త :** పోర్టు ఆధారిత పరిశ్రమల రాకతో రామాయపట్నం పరిసర ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, అందులో భాగంగానే భూములిచ్చిన రైతుల కుటుంబాలకు అండగా ఉంటూ, స్థానిక యువత ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. బుధవారం ఉదయం గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో ఇండోసోల్ సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన కుటుంబాలకు , స్థానిక యువతకు 73 మందికి ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ఆనంద్, సబ్ కలెక్టర్ హిమవంశి, ఇండోసోల్ సిఓఓ బాలచందర్ కృష్ణన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమలకు భూములిచ్చిన రైతు కుటుంబాల్లోని యువతీ యువకులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించి వారికి తోడుగా ఉన్నామని చెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇండోసోల్, బిపిసిఎల్ కంపెనీల ఏర్పాటుతో పెద్దఎత్తున స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం ఇండోసోల్ కంపెనీలో స్థానికులకు 73 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారని, ప్రతినెలా కూడా యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేలా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడినట్లు చెప్పారు. కేవలం భూములు తీసుకున్న కుటుంబాల వారే కాకుండా ఇతరులకు కూడా వారి అర్హత మేరకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారందరూ కూడా తమ గ్రామాల్లోని మిగిలిన యువతకు అవగాహన కల్పించి వారంతా కూడా శిక్షణ పొంది ఉద్యోగాలకు వచ్చేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రామాయపట్నం పోర్టు ఆధారంగా అనేక పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, దీంతో ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి సాధిస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎప్పుడూ తామంతా అండగా నిలుస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. 2047 స్వ ర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకుసాగు తున్నారన్నారు. సీఎం అపార అనుభవం, దూర దృష్టితో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. లోకేష్ బాబు పాదయాత్ర సమయంలో ఇక్కడి ప్రజలు పనులు లేక దూరప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్న విషయాన్ని, ప్రజల గమనించి ప్రకాశం మారుస్తామని ఇచ్చినట్లు గుర్తుచేశారు.

## పోలీసుల అదుపులో ఆరుగురు గంజాయి నిందితులు

### - 10 కెజిల గంజాయి స్వాధీనం - సోలాపూర్ నుండి పుట్టపర్తికి దిగుమతి

**కదిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నివారణకు కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం విచ్చల విడిగా గంజాయి సరఫరా చేస్తూ యువత దానికి బానిసై పక్కదోవ పడుతున్నారు. ఒకవైపు పోలీసులు వివిధ శాఖల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ అందుకు భిన్నంగా కొందరు విచ్చల విడిగా గంజాయిని సేవిస్తున్నారు. మరోవైపు సోలార్ నుంచి పుట్టపర్తికి బిక్షగాళ్ల రూపంలో గంజాయి తీసుకొచ్చి కదిరి ప్రాంత వ్యక్తులకు అందజేసి తిరుగు ప్రయాణం అవుతున్నట్లు తెలుస్తోంది. దిగుమతి అయిన గంజాయిని కదిరికి ద్విచక్ర వాహనాలు, కార్లలో సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

## విజయవాడలో ఆరంభమైన యువ ఆంధ్ర ఛాంపియన్‌షిప్ -2025 పోటీలు

### టోర్నమెంట్‌లో తలపడనున్న 8 జట్లు..

**విజయవాడ , ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో యువ ఆంధ్ర ఛాంపియన్‌షిప్-2025 ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కబడ్డీ వంటి స్వదేశీ ఆటలకు ప్రోత్సాహం అందించడం, యువ ప్రతిభను వెలికితీయడం ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు.భవిష్యత్తులో తెలుగు కబడ్డీ లీగ్‌కి చేరే క్రీడాకారులకు ఇది ఒక మంచి వేదిక" అని తెలిపారు. కబడ్డీనే కాదు, ఏ ఆటైనా,క్రీడైనా ప్రభుత్వం వారిని అంతర్జాతీయ స్థాయికి చేరుకునే దిశలో ప్రోత్సహిస్తుందన్నారు.ఈ టోర్నమెంట్‌లో 8 జట్లు పోటీపడుతున్నాయి.

## అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వ్యవహారంలో పార్టీ అధిష్ఠానం సీరియస్

### దగ్గుబాటిపై పార్టీ అధిష్టాన వర్గానికి ఫిర్యాదులు

**అనంతపురం, ఆగస్టు 20 (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ పై తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం సీరియస్ అయింది. అనంతపురం నియోజకవర్గంలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న వివాదాలు, తాజాగా జూనియర్ ఎన్టీఆర్ ను, ఆయన తల్లిని దుర్భాషలాడుతూ అనంతపురం ఎమ్మెల్యే కు సంబంధించి ఆడియో వైరల్ అయిన సంఘటనపై తెలుగుదేశం పార్టీ అధిష్టానవర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలియ వచ్చింది. ఒకవైపు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసనలకు దిగుతుండడం మరోవైపు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వ్యవహార శైలి పార్టీ కార్యకర్తల్లో చర్చనీయాంశం కావడం నేతలకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం పార్టీ ముఖ్యులు కలవాలని ఆదేశించడంతో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి వేరువేరుగా సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర పార్టీ పెద్దలను కలిసినట్లు సమాచారం.. జూనియర్ ఎన్టీఆర్ సంబంధించి ఆడియో వైరల్ పైన, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సంఘటన పైన సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ఎమ్మెల్యే దగ్గుబాటిపై సీరియస్ అయినట్లు తెలియ వచ్చింది. ఇదే సమయంలో మంగళవారం రోజు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ను అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ప్రత్యేకంగా కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేసినట్లు తెలియ వచ్చింది.. ఎమ్మెల్యే కొందరిని బెదిరించారని, మూడు, నాలుగు ఆడియో రికార్డులు కూడా అందజేసినట్లు తెలియ వచ్చింది.

## ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న వరద ఉధృతి

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :కలెక్టర్ ప్రశాంతి

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఆగస్టు 20 (ప్రభాతవార్త):** ఎగువ రాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద ఉధృతంగా వచ్చి చేరుతుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.బుధవారం సాయంత్రం 8 గంటల నాటికి భద్రాచలం వద్ద నీటిమట్టం 47.4 అడుగులు ఉందని పేర్కొన్నారు. ధవళేశ్వరం వద్ద రాత్రి 8 గంటలకు ఇన్, ఔట్ ఫ్లో 8.28 లక్షల క్యూసెక్కులు ఉందని, రేపటిలోపు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు.ప్రభావితం చూపే తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని మండల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షి స్తూ అధికారులకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు

21-8P g7exHMNWJQE 11_21-8P g7exHMNWJQE.qxd 8/21/2025 12:21 AM Page 1



## గ్రామీణాభివృద్ధికి ఉపాధి హామీ పథకం పరిధిలో పూర్తి స్థాయిలో పనులు - సీఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ.ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణాభివృద్ధికి ఉపాధి హామీ పథకం పరిధిలో పూర్తి స్థాయిలో పనుల చేపడతామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.సచివాలయంలో బుధవారం నిర్వహించిన నరేగా పనులు,పెండింగ్ బిల్లుల చెల్లింపు తదితరంశాలపై నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు చర్చించారు.గత ప్రభుత్వ హయంలో నిలిపివేసిన నరేగా బిల్లులన్నింటిని చెల్లిస్తున్నామన్నారు.2014- 19 మధ్య కాలంలో జరిగిన ఉపాధి హామీ పథకం(నరేగా) పనులకు బిల్లుల చెల్లింపు విషయంలో కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన నరేగా పనులకు బిల్లులు చెల్లించలేదు. బిల్లులు ఇవ్వకుండా వర్కులను క్లోజ్ చేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సిఎం చంద్రబాబు ఈ విషయంపై పలు మార్లు చర్చించి నిధుల చెల్లింపులకు ఉన్న అడ్డంకులను తొలగించారు. ఇందులో భాగంగా వైసీపీ ప్రభుత్వం క్లోజ్ చేసిన 3,54,177 పనులు ప్రస్తుతం ఆన్ గోయింగ్ వర్కులుగా మార్పుచేశారు. కేంద్రం ఇచ్చిన ఈ వెసులుబాటుతో పనులు చేసిన వారికి బిల్లులు చెల్లింపు చేయడం ద్వారా న్యాయం చేసే అవకాశం ఏర్పడింది. ఈ ప్రక్రియపై సిఎం చంద్రబాబు సమీక్షా సమావేశాల్లో అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. మొత్తం రూ.179.38 కోట్ల బిల్లుల చెల్లింపునకు సంబంధించి 5.54 లక్షల పనులను ఆన్ గోయింగ్ వర్కులుగా నమోదు చేశారు. దీనికి సంబంధించి కసరత్తు పూర్తి చేసిన పంచాయతీ రాజ్ శాఖ రూ.179 కోట్లకు గాను రూ.145 కోట్లను ప్రస్తుతం అప్లోడ్ చేసింది. ఈమొత్తానికి సంబంధించి ఆర్థిక శాఖ ఎన్ఐసికి నిధులు విడుదల చేసింది. పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లు, గ్రామస్తుల అకౌంట్లలో 23వ తేదీన ఈ మొత్తం నిధులు జమకానున్నాయి. మిగిలిన మొత్తానికి సంబంధించి పలు సాంకేతిక కారణాలతో చెల్లింపు ప్రక్రియ నిలిచింది. అవసరమైన ఎస్టిమేషన్ లేకపోవడం, ఖర్చు చూపకపోవడం, ఆ పనిచేసిన ప్రాంతాలు పట్టణ ప్రాంతంలో విలీనం కావడం వంటి కారణాలతో ఆయా పనుల బిల్లుల చెల్లింపు ప్రక్రియ పెండింగ్‌లో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

## చెంచు గిరిజనుల అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు మంజూరు

### ఆత్మకూరు పట్టణంలో నన్నారి కేంద్రం ప్రారంభం

**ఆత్మకూరు,ఆగష్టు20,ప్రభాతవార్త:** నల్లమలలో నివశించే చెంచు, గిరిజనుల అభివృద్ధికి ఐటిడిఏ శాఖ ద్వారా రూ.10కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యరాణి, శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డిలు అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని వెంగళరెడ్డి నగర్ కాలనీలో నన్నారి కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా మంత్రిని మర్యాద పూర్వకంగా నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజాకుమారి ఘనియా ఆహ్వానించారు. శిలాఫలకం ప్రారంభించి నన్నారి తయారి విదానం చెంచు గిరిజనులతో మంత్రి అడిగి తెలుసుకున్నారు. నల్లమల అడవిలో నివశించే చెంచు గిరిజనుల స్థితిగతులపై చెంచు గిరిజనులతో ముఖాముఖిగా మాట్లాడారు.. అక్కడే చేతివృత్తులతో తయారి చేసిన సంచులు, ఇతర వస్తువుల కేంద్రం ప్రారంభించారు. గిరిజనులకు మంచినీటి మౌళిక సదుపాయాలు కల్పించేందుకు నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు పెద్దపీత వేసిన చరిత్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కిందన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని 1500ల మంది కుటుంబాలకు జీవనోపాధి కల్పించే విదంగా ప్రధానమంత్రి జననందన్ యోజన పథకం క్రింద రూ.25లక్షలతో తయారు కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. చెంచు గిరిజనులు తన ఉపాధి కోసం అడవి ప్రాంతంలో నన్నారి గడ్డలు సేకరించి మూడు రోజుల పాటు తయారు చేసే ఈ విదానాన్ని కేవలం ఒకరోజులోనే తయారు చేసే విదంగా అవకాశం కల్పించారు.

## ఉద్యోగుల సమస్యల సానుకూల పరిష్కారానికి అన్నివిధాలా ప్రయత్నం చేస్తాం - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్ల సమస్యల సానుకూల పరిష్కారానికి అవసరమైన ప్రయత్నం చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సిఎస్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది.ఈసమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉద్యోగులకు సంబంధించిన పెండిగ్ డిఏలు,పిఆర్సీ బకాయిలు,ఆర్జిత సెలవుల నగదు చెల్లింపు బకాయిలు తదితర అంశాలను సిఎస్ దృష్టికి తెచ్చారు.అనంతరం సిఎస్ మాట్లాడుతూ ఈప్రభుత్వం వచ్చాక మొదటి సారి జరిగిన ఈ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపిన అన్ని అంశాలను నోట్ చేయడం జరిగిందని వాటన్నిటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సకాలంలో పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నం చేయడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ ఉద్యోగ సంఘాలకు చెప్పారు. సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్,వైద్య ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు,రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి,ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్,ఆర్థిక,ప్రణాళికా శాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్,విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్,వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు,కళాశాల విద్యా డైరెక్టర్ భరత్ గుప్త,ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ తదితర అధికారులు పాల్గొన్నారు.అలాగే ఉద్యోగ సంఘాల నుండి ఏపి ఎన్జిజిఓ అధ్యక్షులు విద్యాసాగర్,ఏపి సచివాలయ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ మోహన్,రాష్ట్ర టీచర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ ఉన్నారు.

## ఆక్వా రంగానికి అన్ని విధాల అండగా నిలుస్తాం - మంత్రి నారా లోకేష్


### -సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుందాం..

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆక్వా రంగానికి అన్ని విధాల అండగా నిలుస్తామని, సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుందామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమెరికా ప్రతీకార సుంకాల నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్, వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నేతృత్వంలో ఆక్వా కల్చర్ అడ్వైజరీ కమిటీ సమావేశమైంది. ఈ భేటీలో ఆక్వా ఎగుమతి దారులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, రైతులు, ఫీడ్ కంపెనీ, హేచరీస్ యజమానులు, అధికారులు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారం కోసం సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేలాది మంది ఆక్వారంగంపై ఆధారపడి ఉన్నారు. ఈ రంగం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఇప్పటికే ఆక్వా ఎగుమతులపై అమెరికా 25శాతం సుంకాలు విధించింది. మరో 25 శాతం సుంకాలు పెంచే ప్రమాదం కూడా పొంచి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆక్వా ఇండస్ట్రీ కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషిచేద్దాం. ఇటీవల ఢిల్లీ పర్యటనలోనూ ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర పెద్దలకు వివరించడం జరిగింది. రష్యా, యూరోపియన్ యూనియన్ మార్కెట్ పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి వ్యయం తగ్గించడంతో పాటు పవర్ టారిఫ్ లపైనా చర్చించాల్సిన అవసరం ఉంది. సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుందామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టిసారించారని అన్నారు.వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కేవలం విదేశీ ఎగుమతులపైనే ఆధారపడకుండా దేశీయంగా రొయ్య వినియోగం పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా ఇతర దేశాల మార్కెట్ పైనా దృష్టిసారించాల్సిన అవసరమన్నారు.

# స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించాలి

### ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు త్వరలో సిఎం శంకుస్థాపన: మహేష్‌కుమార్

**హైదరాబాద్ ఆగస్టు 20,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమంను ప్రజలకు వివరించి వారి మద్దతు కూడగట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికలలో విజయదుందిభి మ్రోగించాలని వందకు వంద సర్పంచ్‌లు,ఎంటిపిసిలు,జడ్పీటిసిలు, ఎంపిపిలు, జడ్పీచైర్మన్లు కైవసం చేసుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. బుధవారం గాంధీభవన్‌లో ఆర్మూర్ ఇంచార్జ్ వినయ్ రెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తలతో టిపిసిసి చీఫ్ సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రతి బూత్ లెవల్ లో పార్టీని పటిష్ఠంగా ముందుకు తీసుకొని పొయే అవకాశం ఉంటుందని దాని కోసం కృషిచేయాలని ఆయన మార్గనిర్ధేశనం చేశారు. ఆర్మూర్ నియోజక వర్గంలో స్థానిక సంస్థల అన్నింటనిగెలవాలని అందుకు క్షేత్రస్థాయి లో పనిచేయాలని ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆయనకోరారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కష్టపడి పని చేసి సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ లు అన్ని కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా పకడ్బందీగా ప్రణాళికతో ముందుకు పోవాలని అన్నారు. ఆర్మూర్ నియోజక వర్గాన్ని నా స్వంత నియోజక వర్గంగా చూసుకుంటా అని చెప్పారు. కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి సమస్యలు వచ్చినా కలిసికట్టుగా పని చేసుకొని పరిష్కరించుకుందామని చెప్పారు. సమస్యలు ఉంటే ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళితే నేనే వెంట ఉండి పని చేసి పెడతా అని అన్నారు. ఆర్మూర్‌కు ప్రభుత్వం నుంచి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు అయిందని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నామని అన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ,రాజకీయ రంగాలలో అమలు అయ్యేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేసిందని అన్నారు. బీజేపీ కేంద్రంలో అటు బిల్లు అమలు కాకుండా ఇటు ఆర్డినెన్స్ అమలు కాకుండా అడ్డు పడుతుందని బిజెపి, బిఆర్ ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కు అయ్యి బిసి రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుపడుతున్నాయని ఇది ప్రజలు గమనించాలని ఆయన అన్నారు.కులాల వాటా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ గాంధీ గారు మొట్టమొదట ఉద్యమాన్ని లేవనెత్తారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గం ఎంతో కృతనిశ్చయంతో బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నారని అందుకోసం వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అన్నారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ, ఆర్టీసీ లలో మహిళలకు ఉచిత రవాణా, 500 రూపాయలకు గ్యాస్, 2 లక్షల రూపాయల వ్యవసాయ రుణాల మాఫీ, ఎకరాకు 12 వేల రైతు భరోసా, రెసిడెన్షియల్ స్కూల్స్, స్పోర్ట్స్ పాలసీ, ఫోర్త్ సిటీ లాంటి అనేక విప్లవాత్మక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ఇవన్నీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో ఏ ప్రభుత్వం చేయనంత వేగంగా పకడ్బందీగా చేస్తున్న అంశాలలో ప్రచారం చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా చూడాలని అన్నారు.



## రాజీవ్‌కు ఘనంగా నివాళులు

### ఎన్ఎస్‌యుఐ రక్తదాన శిబిరంప్రారంభించిన టిపిసిసి చీఫ్

**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గాంధీభవన్‌లో మాజీప్రధాన మంత్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, మాజీ ఎంపీ వి హనుమంతరావు.తదితరులు పాల్గొని రాజీవ్ చేసిన కృషి కారణంగానే దేశంలో సాంకేతిక విప్లవం అభివృద్ధి చెందినదని అన్నారు. టపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో కంప్యూటర్ యుగంలోకినడిపారని,నవోదయ విద్యాలయం భావనతో విద్యలో మెరుగైనపద్ధతులు తీసుకొచ్చారని కొనియాడారు. ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంను టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు.

# మద్యం షాపుల టెండర్లకు ఆహ్వానం

**దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు**

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానించింది. డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు లైసెన్స్ కాలం ఉంటుందని, ఈ సారి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడకుల స్తులకు 15 శాతం,ఎస్సీ సామాజిక వర్గాలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను కేటాయించనున్నారు.తెలంగాణ ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ప్రకటించింది.2025-2027 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ఎక్సైజ్‌శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.తెలంగాణలోని 2620 మద్యం షాపుల కు లైసెన్స్ కొరకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న దుకాణాల గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఈ కొత్త లైసెన్సుల గడువు డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు ఉంటుంది. ఈసారి దరఖాస్తు రుసుమును రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయలకు పెంచారు. దుకాణాల లైసెన్సులను వార్షిక ఎక్సైజ్ పన్ను ఆధారంగా లాటరీ ద్వారా కేటాయించనున్నారు.ఈ మద్యం పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చింది. గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను రిజర్వ్ చేశారు. ఇలా మొత్తం 30 శాతం రిజర్వేషన్లకు కేటాయించారు. వీటితో పాటు.. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అంతేకాకుండా ఒకే దరఖాస్తుదారుడు ఒక దుకాణానికి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించేందుకు అవాకాశం కల్పించారు.మొత్తం ఆరు స్లాబులుగా ఈ లైసెన్సుల ఫీజులను నిర్ణయించారు. ఇది 2011 జనాభా లెక్కల ఆధారంగా రూపొందించబడింది. ఐదు వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో వార్షిక ఎక్సైజ్ పన్ను రూ. 50 లక్షలుగా, 5,000 నుండి 50,000 మధ్య జనాభా ఉన్నచోట రూ. 55 లక్షలుగా, 50,000 నుంచి ఒక లక్ష వరకు ఉన్న ప్రాంతాలకు రూ. 60 లక్షలుగా, ఒక లక్ష నుంచి ఐదు లక్షల మధ్య జనాభా ఉన్న ప్రదేశాల్లో రూ. 65 లక్షలుగా నిర్ణయించారు. ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు జనాభా ఉంటే రూ. 85 లక్షలు, ఇక 20 లక్షల పైన జనాభా ఉన్న నగరాల్లో వార్షిక ఫీజు రూ. కోటి పది లక్షలుగా ఖరారు చేశారు.లాటరీ ద్వారా దుకాణాలను పొందినవారు వార్షిక లైసెన్స్ రుసుమును ఆరు సమానవాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. 25 నెలల లైసెన్స్ కాలానికి గాను, పావు వంతు (25 శాతం)కు సమానమైన బ్యాంక్ గ్యారెంటీని ప్రభుత్వానికి సమర్పించాలి. జీహెచ్ఎంసీ, నగర పంచాయతీ పరిధిలో మద్యం దుకాణాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరవడానికి అనుమతి ఉందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఐ సెట్ కౌన్సెలింగ్‌కి 2065 మంది దరఖాస్తు

### 28 వరకు స్లాట్ బుకింగ్‌కి: సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కాగా.. మొదటి రోజు 2065 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించడానికి షెడ్యూల్‌ను జారీ చేశారు. అయితే ఈ నెల 27 ఆదివారం కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నా ఎందుకు హైకోర్టుకు వెళ్లడం?

### పిసిఘోష్ నివేదికపై ఎందుకు కెసిఆర్, హరీష్ భయపడాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** మా ప్రభుత్వం అత్యంత ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తోందని,పిసిఘోష్ నివేదిక అంశంపై కెసిఆర్ హరీష్ రావు హైకోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ కాళేశ్వరం అవినీతి పైన పిసి ఘోష్ ఇచ్చిన కమిషన్ రిపోర్ట్ సారాంశం ప్రజలకు తెలియకుండా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్దకు వెళ్లారని అన్నారు.నివేదిక అసెంబ్లీలో పెట్టకముందే హైకోర్టును ఆశ్రయించడం వల్ల ప్రజలకు నీళ్ళు ఏవో పాలు ఏవో తెలియకుండా పోతుందని అన్నారు. అసెంబ్లీ ముందు నివేదిక ను ఉంచుతామని ఇప్పటికే క్యాబినెట్ తేల్చి చెప్పిందని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి నతర్వాత నివేదిక పైన ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన అన్నారు. కాళేశ్వరం కమిషన్ ను చూసి కెసిఆర్, హరీష్ రావు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ పైనహైకోర్టును ఆశ్రయించడంతోనే కెసిఆర్ హరీష్ రావు తాము తప్పు చేశామని ఒప్పుకున్నట్లైందని భాష్యం చెప్పారు. కాళేశ్వరం కమిషన్ కూడా స్వయంగా కోర్టు లాంటిదే.. కమిషన్ ఛైర్మన్ కూడా స్వయంగా మాజీ న్యాయమూర్తి అని ఆయన అన్నారు.కాళేశ్వరం కమిషన్ లేవనెత్తిన అంశాలపైన సమాధానం చెప్పే దమ్ము లేక తప్పించుకోవడానికే కోర్టుకు వెళ్లారని విమర్శించారు. కాళేశ్వరంలో జరిగిన అనేక అవకతవకలను కమిషన్ స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. దాదాపు ఆరు నెలల పాటు అనేక మందిని విచారించిన తర్వాతే కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది.ఇంజనీర్ల ను కాదని కెసిఆర్ సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారని ఇంజనీర్ల అఫిడవిట్ ఆధారంగా కమిషన్ తేల్చిందని ఆయన చెప్పారు. హరీష్ రావు, ఈటెల రాజేందర్ కూడా అడ్డగోలుగా వ్యవహరించిందని కమిషన్ స్పష్టం చేసిందని శ్రీనివాస్ ఆరోపించారు. తమ తప్పు లను కమిషన్ ఎత్తి చూపడంతో కెసిఆర్ , హరీష్ రావు ఆత్మరక్షణలో పడ్డారని ఆయన అన్నారు. యూరియా కేటాయింపులు ఎవరి పరిధిలో ఉంటాయో కెటిఆర్‌కు తెలియదా అని ఆది ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం 9.80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని కేంద్రానికి ఇండెంట్ పెట్టిందని ఈ ఆగస్టు వరకు 8.30 మెట్రిక్ టన్నులు రావాలి, కాని 5.40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. యూరియా కేటాయింపు పైన కేంద్రం తీరు పైనప్రతిపక్షనేత కెసిఆర్ ఎందుకు స్పందించడలేదు అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుళ్ళు పైనే కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని అన్నారు. రైతులపైన కెటిఆర్ కపట ప్రేమ చూపిస్తున్నారని దుయ్య బట్టారు.మా ఎంపీలు పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తున్నారు.కెటిఆర్ కెసిఆర్ థర్డ్‌క్లాస్ ఆలోచనలు చేశారు కాబట్టే ప్రజలు ఓడించారని అన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి పైన ఇండియా కూటమి రాజకీయపరమైన నిర్ణయం తీసుకుంది. గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని కెసిఆర్ చెప్పి మోసం చేశారు.కంచె ఐలయ్యకు మాపార్టీ ఎంతో గౌరవం ఇచ్చిందని ఆయన తెలిపారు.

## అర్చకులు ఇతర కార్యక్రమాలకు వెళ్లకూడదనే ఉత్తర్వులు సరికాదు

### తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీ నివాసచార్యులు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** దేవాలయ అర్చకులు ఇతర కార్యక్రమాలకు వెళ్ళకూడదు అని దేవాదాయశాఖ ఇచ్చిన ఉత్తర్వులు సరికాదని తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీ నివాసచార్యులు ఒక ప్రకటనలో విమర్శించారు. దేవాలయాల్లో అర్చక విధులు నిర్వహిస్తున్నవారు బయట ఈ ఇతర వివాహాది కార్యక్రమాలకు కానీ ఆశీర్వచనాలకు ఇతర దైవిక కార్యక్రమాలకు వెళ్లకూడదు అనేటువంటి ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఇది కేవలం ఆలయాలలో అర్చకత్వం నిర్వహిస్తున్నటువంటి అర్చకులకే కాదు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి హిందూ మత ప్రచారం పై జరుగుతున్నటువంటి ఒక దౌర్జన్యం అని కూడా అనుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆలయాల అభివృద్ధి దిశగా తీసుకు వెళుతున్న ఈ సమయంలో ఇటువంటి ఉత్తర్వులు మంచిది కాదని ఆయన హితవు పలికారు.ఈ అంశంపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడానికే కేంద్రం బిల్లు

**అసెంబ్లీలో పిసిఘోష్ నివేదికపై చర్చిస్తాం, ఆ తరువాత కోర్టుకు వెళ్లు కెసిఆర్: షబ్బీర్‌అలీ**



**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** ప్రతి పక్షాలను ఇబ్బందులు పెట్టడానికే జైలుకు వెళ్లిన ముఖ్యమంత్రులను తప్పపించాలని కేంద్రం బిల్లు పెడుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలి ఆరోపించారు. గాంధీభవన్‌లో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి విన్న పాలు స్వీకరించి అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ఈసందర్బంగా ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ మాట్లా డుతూ కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఇంకా పబ్లిక్ లో పెట్టక ముందే కెసిఆర్ కోర్టుకు పోతుండు అంటేనే కెసిఆర్ తప్పిదాలు ఉన్నట్లే భావించాలని ప్రజలకు తెలిపారు. కమిషన్ పై అసెంబ్లీలో బిల్లు పెట్టి చర్చి స్తామని తర్వాత కెసిఆర్‌ను ఎక్కడికైనా పొమ్మను కాళేశ్వరం పై జస్టిస్ గోష్ 15 నెలలు విచారణ చేశారు. అందులో అన్ని తప్పులు ఉన్నట్లు గోష్ కమిటీ చెప్పిందని ఆయన వివరించారు 60 సంవత్సరాల నుండి వర్గీకరణకోసం పోరాటం చేస్తున్న మాదిగల కోసం శమీమ్ అక్తర్ తో కమిషన్ వేసి వర్గీకరణ చేసినం ఎవరి వాటా వారికి కల్పించినం అని ఆయన చెప్పారు. క్యాస్ట్ సెన్సు చేయడం తో 46.25 శాతం రాష్ట్రంలో బిసిలు ఉన్నారని తేలిందని ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలు రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి క్యాస్ట్ సెన్సు చేశారని ఆయన అన్నారు. అన్ని రాష్ట్రాలు కూడా తెలంగాణ లాగ కులగణన చేయాలని అడుగుతున్నారని చెప్పారు. బిసి రిజర్వేషన్ లో ముస్లిం లను తీసివేస్తే సపోర్ట్ చేస్తాం అని బిజెపి అంటుందని,గుజరాత్ లో ఉంది అన్ని రాష్ట్రాలలో ఉందిదమ్ముంటే బిజెపి రాష్ట్రాలలో ముస్లిం ల రిజర్వేషన్ తీసివేయండని సవాల్ విసిరారు. మీ బిజెపి పార్టీ జాతీయ పార్టీనా కదా?మత పరమైన రిజర్వేషన్ అని బిజెపి నేతలు అంటున్నారు అని ఆయన అన్నారు.స్వాతంత్రం రాకముందు నుండే ముస్లింలకు రిజర్వేషన్ ఉందని ఆయన చెప్పారు. వృత్తి పరంగానే రిజర్వేషన్ ఇస్తున్నాం మతప రంగా కాదు అని ఆయన చెప్పారు. ముస్లింలలోబీద వారు ఉన్నారు.ముస్లింలు బతకొదా అని రాజశేఖర్ రెడ్డి వచ్చాక 4శాతం ఉపాధి,ఉద్యోగాలలో రిజర్వేషన్ ఇచ్చారని ఆయన చెప్పారు. రేవంత్ రెడ్డి ఇంటి ఇంటి సర్వే చేసి ముస్లిం లు బీదవారు ఉన్నారని గుర్తించారని చెప్పారు. ముఖాముఖిలో వచ్చిన అభ్యర్థనలలో ఇందిరమ్మ ఇండ్లు కావాలని పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి అని ఆయన చెప్పారు. భూమి ఉన్న వారికి మొదటి దపా భూమి లేని వారికి రెండో దపా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని తెలిపారు.



# బాలుర ఆశ్రమ పాఠశాలలో నిద్రించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో నిద్రించిన మంత్రి జూపల్లి కృష్ణారావు..ఉదయం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అంతకుముందు కిచెన్ ను పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థులను పలు విషయ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు.ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థులను పలు విషయ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.

అనంతరం ఉపాధ్యాయుల రిజిస్ట్రార్ ను పరిశీలించి. వారితో ముఖాముఖి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా? వార్డెన్ల పర్యవేక్షణ ఎలా ఉంది? విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై చర్చించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడటంతోపాటు వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో పేద విద్యార్థులే వసతి పొందుతున్నారు. అందులో రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చినవారే అధికంగా ఉంటున్నారు.వీరందరికీ హాస్టళ్ల లో నాణ్యమైన భోజనంతో పాటు మోలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కల్పిస్తున్న వసతులను తనిఖీచేసేందుకు విద్యార్థులతో కలసి వసతి గృహంలో బస చేశాను. విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యాను. బేసిక్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు.మన విద్యా విధానం, బోధన పద్ధతులు మార్చాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు.

## నా పుస్తకం- నా కథ పేరుతో కార్యక్రమం: పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పఠనాశక్తిని పెంపొందించడం కోసం పాఠశాల విద్య శాఖ చర్యలు ప్రారంభించింది. ఇందకు సంబంధించి సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ అయిన పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ బుధవారం తన కార్యాలయంలో ఇందుకు సంబంధించి రూపొందించిన రీడింగ్ క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్(జెడి-బోధన)రాజీవ్, రూమ్ టు రీడ్ రాష్ట్ర లీడ్ నరసింహచారి పాల్గొన్నారు. తెలంగాణలో అక్షరాస్యతను బలోపేతం చేయడానికి రీడింగ్ క్యాంపెయిన్ ప్రారంభించాలని భావించిన పాఠశాల విద్య శాఖ అధికారులు రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల్లో పఠనాశక్తిని చదవడం అనే నైపుణ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో "నా పుస్తకం- నా కథ" అనే థీమ్ తో. రీడింగ్ క్యాంపెయిన్‌ను అధికారికంగా ప్రారంభించింది. ఈ ప్రచారాన్ని బుధవారం రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఈఆర్‌టి) భాగస్వామ్యంతో నిర్వహించిన లైబ్రరీ పాయింట్ ఉపాధ్యాయుల రాష్ట్ర వ్యాప్త శిక్షణతో సహా పాఠశాల విద్యశాఖ చేపట్టిన ప్రయత్నాలకు కొనసాగింపుగా ఈ ప్రచారాన్ని ప్రారంభించడం జరిగిందని డైరెక్టర్ తెలిపారు.

### మహిళల ఛాంపియన్‌షిప్
# తొలి మ్యాచ్‌లో విజయం



**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్ 17, మహిళల ఛాంపియన్‌షిప్ 2025లో ప్రారంభ మ్యాచ్‌లో భారత్ నేపాల్‌ను ఓడించింది. భూటాన్‌లోని థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో బుధవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు నేపాల్‌పై 7-0 తేడాతో విజయం సాధించి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చింది. భారత్ తరఫున అబిస్టా బస్నెట్ (16, 41), నీరా చాను లాంగ్‌జామ్ (25, 56), అనుష్క కుమారి (33, 62), జులన్ నోంగ్‌మైథెమ్ (45+1) గోల్స్ చేశారు. యువ టైగ్రెస్‌లు మొదటి అర్ధభాగాన్ని 5-0 ఆధిక్యంతో ముగించాయి. 16వ నిమిషంలో అభిస్తా బాస్నెట్ గోల్ చేయడం మ్యాచ్‌కు ఊపునిచ్చింది. కాగా 2023లో జరిగిన మ్యాచ్‌లో భారత్ నేపాల్‌ను 4-1 తేడాతో ఓడించింది. తాజా విజయం నేపాల్‌పై భారత్ అజేయ పరంపరను కొనసాగించింది. ఇక ఈ టోర్నమెంట్ ఫార్మాట్‌లో నాలుగు జట్లు భారతదేశం, నేపాల్, బంగ్లాదేశ్, ఆతిథ్య భూటాన్ డబుల్ రౌండ్‌రాబిన్ లీగ్‌లో ఒకదానితో ఒకటి ఆడతాయి. ఇది ఏడవ టోర్నమెంట్. ప్రతి జట్టు ఆరు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ నెల 31న జరిగే చివరి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు ఛాంపియన్‌గా నిలుస్తుంది. భారత్ ఈ నెల 22న బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# సురుచి, సౌరభ్ జోడీకి కాంస్యం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జంట సురుచి సింగ్ మరియు సౌరభ్ చౌదరి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో బుధవారం జరిగిన ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఈ జంట 4 పాయింట్ల లోటు నుండి పుంజుకుని సత్తా చాటింది. మొదటి కాంస్య పతక మ్యాచ్‌లో చైనీస్ తైపీ జోడీ హెంగ్ యులియు మరియు హ్సి యాంగ్ చెన్‌హ్సీహ్‌లను 17-9 స్కోరుతో ఓడించింది. అర్హత రౌండ్‌లో, భారత జంట మొత్తం 578 (20+)తో 5వ స్థానంలో నిలిచింది. ఇందులో సురుచి 292తో టాప్ స్కోరర్‌గా నిలవగా, సౌరభ్ 286తో వెనుకబడి ఉన్నాడు. ఇక రెండో భారత జంట పాలక్ గులియా మరియు ఆదిత్య మల్రా పతక పోరులో పాల్గొనలేకపోయారు. అర్హత రౌండ్‌లో మొత్తం 575 (20+) పాయింట్లతో 10వ స్థానంలో నిలిచారు. కాగా సీనియర్ పోటీలో ఇది భారతదేశానికి నాల్గవ పతకం, 1 రజతం మరియు 3 కాంస్య పతకాలు సాధించింది. జూనియర్ ఎయిర్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో, భారత జంట వంశిక చౌదరి మరియు జోనాథన్ గవిట్ మొత్తం 578 (18+) పాయింట్లతో బంగారు పతక పోరులో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు.




### యూరప్ స్మాష్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు
# మనుష్, దియా జోడీ
### శ్రీజ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** యూరప్ స్మాష్-2025లో భారత్ మిక్స్‌డ్ జోడీ మనుష్-దియా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి, తెలంగాణకు చెందిన ఆకుల శ్రీజ టోర్నీ నుండి నిష్క్రమించింది. అలాగే మహిళల డబుల్స్‌లో దియా చిటాలే-యశస్విని ఘోర్పడే ద్వయం రెండో రౌండ్‌కు చేరుకున్నారు. స్వీడన్‌లోని మాల్మో అరీనాలో బుధవారం జరిగిన ఈవెంట్‌లో ఆరో సీడ్, భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మనుష్ షా-దియా చిటాలే క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.

ఈ జంట బలమైన సింగపూర్ జంట యూ ఎన్ కోయెన్ పాంగ్-జెంగ్ జియాన్‌లను 11-8, 11-7, 8-11, 12-10 తేడాతో నాలుగు గేమ్‌లలో ఓడించి, ఈ ఏడాది మూడవ డబ్ల్యూటిటి గ్రాండ్ స్మాష్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. తదుపరి ఈ నెల 21వ తేదీన జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో రొమేనియన్ ద్వయం ఎడ్వర్డ్ ఐయోనెస్కు-బెర్నాడెట్ స్జోక్స్‌తో తలపడనున్నారు. మరోవైపు, మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి ఆకుల శ్రీజ రెండో రౌండ్‌లో ఏడో సీడ్ జు యులింగ్ (మకావో) చేతిలో 9-11, 8-11, 11-6, 2-11 తేడాతో ఓడిపోవడంతో ముగిసింది. ఇక మహిళల డబుల్స్ విభాగంలో దియా చిటాలే-యశస్విని ఘోడ్పాడేతో కలిసి తొలి రౌండ్ విజయాన్ని సాధించి, ఈజిప్టు ద్వయం హనా గోడా-దినా మెష్రెఫ్‌లను ఓడించింది. ఈ జంట 11-6, 11-7, 11-5 తేడాతో వరుస గేమ్‌ల విజయం సాధించి 16వ రౌండ్‌కు చేరుకుంది.

# అసియా కప్ టీంలో..
# బ్యాడ్‌లక్ హీరోస్
### ఒక్క మ్యాచ్‌కూ నో ఛాన్స్.. భారత్ జట్టులో స్టాండ్‌బై ఆటగాళ్లు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025లో పాల్గొనేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి తన 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఈ టోర్నీ కోసం ఎంపిక చేసిన భారత్ జట్టులో అనుభవంతో పాటు, ఇప్పటి వరకూ ఈ టోర్నీలో బెర్త్ దక్కించుకోని యువకులకూ గొప్ప మిశ్రమంగా మారింది. ఈ జట్టును నడిపించే బాధ్యత సూర్యకుమార్ యాదవ్ చేతుల్లో ఉంటుంది. అతను కొంతకాలంగా ఈ ఫార్మాట్‌లో టీమ్ ఇండియాకు నాయకత్వం వహిస్తున్నాడు. అదే సమయంలో, శుభ్‌మాన్ గిల్ కూడా టీ20 జట్టులోకి తిరిగి వచ్చాడు. అతను వైస్ కెప్టెన్ బాధ్యతను కూడా వ్యవహరిస్తాడు. దీంతో పాటు, ఈ టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేని ఐదుగురు ఆటగాళ్లను కూడా బీసీసీఐ సెలక్టర్లు ఎంపిక చేశారు. 15 మంది సభ్యుల జట్టుతో పాటు, ఐదుగురు ఆటగాళ్లను స్టాండ్‌బైగా బీసీసీఐ ఎంపిక చేసింది. వీరిలో ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ ఉన్నారు. స్టాండ్‌బై ఆటగాళ్లను ప్రధాన జట్టులో చేర్చలేదు. కాబట్టి వారికి మ్యాచ్‌లు ఆడే అవకాశం లభించదు. అయితే, జట్టుకు అవసరమైతే, ఈ ఆటగాళ్లలో ఎవరినైనా ప్రధాన జట్టులోకి తీసుకోవచ్చు. అప్పుడు వారు ప్లేయింగ్ 11లో కూడా భాగం కావొచ్చు. స్టాండ్‌బై ఆటగాళ్ళు నేరుగా టోర్నమెంట్‌లో పాల్గొనరు. కానీ, వారు జట్టుకు బలమైన బ్యాకప్‌గా ఉంటారు.

ప్రధాన జట్టులోని ఒక ఆటగాడు గాయం లేదా ఇతర కారణాల వల్ల టోర్నమెంట్‌కు దూరంగా ఉంటే, ఈ స్టాండ్‌బై ఆటగాళ్లకు అవకాశం లభిస్తుంది. ఇటువంటి పరిస్థితిలో, అవసరమైతే జట్టుకు మ్యాచ్ విన్నర్లుగా నిరూపించగల ఆ ఐదుగురు ఆటగాళ్లను బిసిసిఐ స్టాండ్ బైలో ఉంచింది. ప్రసిద్ధ్ కృష్ణ తన ఫాస్ట్ బౌలింగ్‌తో, వాషింగ్టన్ సుందర్ తన ఆల్ రౌండ్ సామర్థ్యంతో, రియాన్ పరాగ్, యశస్వి జైస్వాల్ తమదూకుడు బ్యాటింగ్‌తో, ధ్రువ్‌జురెల్ తన వికెట్ కీపింగ్, బ్యాటింగ్‌తో ఎప్పుడైనా జట్టులో చేరడానికి సిద్ధంగా ఉంటారు.



# తొలి వన్డేలో
# దక్షిణాఫ్రికా విజయం
### 98 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా చిత్తు

**న్యూఢిల్లీ:** తొలి వన్డేలో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా విజయం సాధించింది. కైర్న్స్‌లో వన్డే ఇంటర్నేషనల్ సిరీస్ తొలి మ్యాచ్‌ను 98 పరుగుల తేడాతో కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 296 పరుగులు చేసింది. మార్క్రమ్ (81 బంతుల్లో 82, 9 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, కెప్టెన్ తెంబా బవుమా (74 బంతుల్లో 65, 5 ఫోర్లు), మాథ్యూ బ్రీజ్కె (56 బంతుల్లో 57, 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. రికెల్టన్ (33, 3 ఫోర్లు), ముల్డర్ (26 బంతుల్లో 31 నాటౌట్, 2 ఫక్షర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ట్రావిస్ హెడ్ 9 ఓవర్లు వేసి 57 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. కేశవ్ మహరాజ్ 5 వికెట్లుతో చెలరేగి ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేల్ చేశాడు. దీంతో 40.5 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌట్ అయింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (96 బంతుల్లో 88, 10 ఫోర్లు) మినహా టాపార్డర్ విఫలమైంది. లబుషేన్ (1), కామెరూన్ గ్రీన్ (3), జోష్ ఇన్‌గ్లిస్ (5), అలెక్స్ కేరీ (0), అరోన్ హార్డీ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

తొలి వికెట్‌కు హెడ్ (24 బంతుల్లో 27, 6 ఫోర్లు)తో కలిసి 60 పరుగులు జోడించిన మార్ష్ ఏడో వికెట్‌కు డ్వార్షుయ్ (52 బంతుల్లో 33, 3 ఫోర్లు) తో కలిసి 71 పరుగులు జోడించాడు. దక్షిణాఫ్రికా బౌలర్ కేశవ్ మహరాజ్ లబుషేన్ (1)తో పాటు, కామెరాన్ గ్రీన్ (3), జోష్ ఇంగ్లిస్ (5), అలెక్స్ క్యారీ (0) రూపంలో నలుగురు కీలక బ్యాటర్లను ఔట్ చేశాడు.

## వాణిజ్యం



# స్వల్ప నష్టాల్లో సూచీలు, సెన్సెక్స్‌లు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** అంతర్జాతీయ సంకేతాలకు అనుగుణంగా దేశీయ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. ఉదయం వేళల్లోనే సెన్సెక్స్ 108పాయింట్లు నష్టపోయి 81,536, నిఫ్టీ 33పాయింట్లు కుంగి 24,947వద్ద కొనసాగుతున్నాయి. అయితే గెలాక్సీ సర్ఫాక్ట, పిఎస్ గాడ్గిల్ జ్యువెలర్స్, మాక్స్ ఎస్టేట్, లాయిడ్స్ మెటల్స్ లాభాల్లో ఉండగా..నజారా టెక్నాలజీస్, డెల్టాకార్ప్, సిఎస్‌బి బ్యాంక్, పవర్ మైక్ ప్రాజెక్ట్స్ నష్టాల్లో ఉన్నాయి. నాలుగు రోజులుగా సూచీలు భారీగా పెరగడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఈ క్రమంలో రూపాయి మారకం విలువ భారీగా పతనమై ట్రేడింగ్‌ను ప్రారంభించింది. నిన్నటితో రూ.86.95తో పోలిస్తే 21పైసలు తగ్గి రూ.87.16వద్ద ఉంది. ఇక ఆసియాలో ఫసిపిక్ మార్కెట్ ప్రధాన సూచీలు ఆస్ట్రేలియా ఎసిఎక్స్200, న్యూజిలాండ్ ఎస్‌జెడ్ఎక్స్ 50 మినహా మిగిలిన ప్రధాన సూచీలన్ని కుంగాయి. చైనాకు చెందిన షాంఘై, జపాన్, నిక్కీ, హాంకాంగ్, హెచ్ఎస్ఐ, దక్షిణ కొరియా కోస్పి, తైవాన్ సూచీలు పతనమయ్యాయి.

### ఎగుమతుల్లో సత్తాచాటుతున్న
# తెలుగు రాష్ట్రాలు



**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** కొంత కాలంగా ఎగుమతుల్లో తెలుగు రాష్ట్రాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయి. గతంలో ఎక్కువగా ధాన్యం, ఎలక్ట్రానిక్స్, ఔషధాల ఎగుమతుల్లో ముందుండగా ఇటీవలి కాలంలో ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ ఉత్పత్తిలో ముందు వరుసలో ఉంటున్నాయి. ఇప్పుడు ఏపీ, తెలంగాణ వరుసగా 6,7 స్థానాల్లో నిలవగా.. త్వరలో టాప్ 5 లో చోటు దక్కించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎగుమతుల్లో సత్తా చాటుతున్నాయి. కొంత కాలంగా చూస్తే ఆసక్తికర వృద్ధిని కనబరుస్తున్నాయని చెప్పొచ్చు. ఇక్కడ ప్రతి సంవత్సరం ఎగుమతులు పెరగడమే కాకుండా.. ఎగుమతుల శ్రేణి కూడా విస్తరిస్తూ వస్తోంది. ఇంకా తెలుగు రాష్ట్రాల నుంచి చాలా ఏళ్లుగా ఎక్కువగా ఎగుమతి అవుతున్నటువంటి వస్తువుల జాబితాలో వ్యవసాయ ఉత్పత్తుల్లో ముందుంటూ వచ్చాయి. ఇప్పుడు మాత్రం పరిస్థితి మారుతోంది. దానిని దాటేసి ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. దీనికి తోడు ఫార్మా ప్రొడక్ట్స్ (ఔషధాలు), కెమికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి ఎగుమతులు కూడా ఎగబాకుతూనే ఉన్నాయి. ఇటీవలి పరిస్థితుల్ని గమనిస్తే ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు సాధిస్తున్న ప్రగతి దేశానికే ఆదర్శంగా ఉంది. రాబోయే రోజుల్లో ఈ ఉత్పత్తులకు సంబంధించి ఇంకా మెరుగైన రికార్డులు నమోదవుతాయని, అందుకు తగిన పరిస్థితులు ఇక్కడ ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇక గత ఆర్థిక సంవత్సరం (2024-25) అత్యధికంగా ఎగుమతులు సాధించిన రాష్ట్రాల లిస్టులో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉండగా తెలంగాణ ఏడవ స్థానంలో నిలిచింది. త్వరలోనే ఈ రెండు రాష్ట్రాలు టాప్5లోకి వచ్చే అవకాశం ఉందని కూడా అంచనా వేస్తున్నారు. మన దేశంలోనే తెలంగాణ రాష్ట్రం.. అంతరిక్ష, రక్షణ రంగ పరిజ్ఞానానికి వెన్నెముకగా నిలుస్తోందనే మాట వినిపిస్తోంది. రక్షణ ఉత్పత్తుల తయారీకి హైదరాబాద్ మూలకేంద్రంగా ఉంది. మిధాని, తీదీలి, దీళిదీలి వంటి సంస్థలు ఉండటమే కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా ఎన్నో సంస్థలు కీలక రక్షణ ఉత్పత్తుల్ని భారత సైన్యానికి అందిస్తున్నాయి. ఇంకా పెద్ద ఎత్తున విదేశాలకు ఎగుమతి కూడా చేపట్టాయి.

### ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్‌మెంట్
# 'గోల్డ్' పథకాలు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ రెండు సరికొత్త కొత్త గోల్డ్ పథకాలను ప్రారంభించింది. గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసినట్లు ఎంఎంసి వెల్లడించింది. పథకాల సబ్‌స్క్రిప్షన్స్ బుధవారం మొదలైనట్లు వివరించింది. ఇందులో కనీస సిప్ పెట్టుబడి రూ. 250 ఉండగా, లాంగ్ సిప్ పెట్టుబడి రూ. 1000గా ఉంది. బంగారం ఆధారితంగా రిటర్న్స్ అందించేలా గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్స్ తీసుకొచ్చింది. అవే ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ( ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ఉన్నాయి. దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం ధరలను ట్రాక్ చేస్తూ రిటర్న్స్ అందించేలా ఈ ఫండ్స్ తీసుకొచ్చినట్లు ఏజెంల్ వన్ తెలిపింది. ధరల్లో పారదర్శకత, సులభంగా పెట్టుబడి పెట్టే అవకాశాన్ని తమ ఇన్వెస్టర్లకు కల్పిస్తున్నట్లు



వెల్లడించింది. సబ్‌స్క్రిప్షన్స్ సెప్టెంబర్ 3, 2025 వరకు కొనసాగుతుంది. ఎన్ఎఫ్ఓ ముగిసిన తర్వాత సైతం ఇదే పెట్టుబడితో యూనిట్లు కొనుగోలు చేయవచ్చని తెలిపింది. అలాగే డిమ్యాట్ అకౌంట్ లేకున్నప్పటికీ బంగారంపై పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని ఈ ఫండ్స్ కల్పిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే ఇందులో సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ పెట్టుబడి ఉంటుంది. బంగారం ధరలు భారీగా పెరుగుతున్న క్రమంలో ఆయా లాభాలను అందుకునేలా ఈ రెండు ఫండ్స్ అవకాశం కల్పిస్తున్నారు. స్కీమ్‌లో ఎన్ఎస్ఈలో లిస్ట్ అవుతుంది. 99.5 శాతం ప్యూర్ గోల్డ్ ప్రకారం ట్రేడింగ్ నిర్వహిస్తుంది. దీంతో మేకింగ్ ఛార్జ్, స్టోరేజ్ రిస్క్ ఉండదని తెలిపింది. అలాగే ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సిప్ పెట్టుబడి రోజుకు రూ.250, వారానికి, 15 రోజులకు, నెల రోజులకు రూ.500గా నిర్ణయించగా మూడు నెలలకు ఒకసారి రూ. 1500గా నిర్ణయించినట్లు ఏఎంసీ తెలిపింది.




# ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 80% బోనస్ పెంపు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ప్రముఖ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ఉద్యోగులకు భారీ వేతనాలు పెంచింది. ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికానికి పనితీరు ఆధారిత బోనస్‌లను ప్రకటించింది. అర్హులైన ఉద్యోగులకు సగటున 80శాతం చొప్పున చెల్లించనుంది. ఆగస్టు నెల వేతనంతో మొత్తం ఇవ్వనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇందుకై ఇంటర్నల్‌గా మెస్సేజ్‌లను పంపిస్తుంది. అయితే క్యూ1లో మెరుగైన పనితీరు నేపథ్యంలో కంపెనీ ఈ స్థాయిలో బోనస్‌లను ప్రకటించడం విశేషం. పనితీరు ఆధారంగా చెల్లింపులు లెవల్ పీఎల్4 ఉద్యోగుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి అత్యధికంగా 89శాతం బోనస్ చెల్లిస్తారు. అంచనాలు అందుకున్న ఉద్యోగులకు 80శాతం చొప్పున చెల్లింపులు చేయనున్నారు. అలాగే లెవల్, పిఎల్5, లెవల్ పిఎల్6 ఉద్యోగులకు 78-87శాతం, 75-85 శాతం చొప్పున చెల్లిస్తారు. పీఎల్4, పిఎల్5, పిఎల్6 కేటగిరిల్లో దృష్టిసారించాల్సిన ఉద్యోగులకు కూడా 80 శాతం, 75, 70, శాతాల చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు ఇంటర్నల్ మెమోలో ఇన్ఫోసిస్ తెలిపింది.

వ్యక్తిగత బోనస్ లెటర్లను ఉద్యోగుల ఇ-డాకెట్స్‌లో అప్‌లోడ్ చేస్తామని వివరించిదంది. అయితే జులై 23న వెలువరించిన త్రైమాసిక ఫలితాల్లో సంస్థ అంచనాలను మించి రాణించింది. గతేడాదితో పోలిస్తే కంపెనీ నికర లాభం 8.7శాతం వృద్ధి చెంది రూ.6921 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 7.5శాతం వృద్ధితో రూ.42,279 కోట్లుగా పేర్కొంది. రెండు మెట్రిక్స్‌లోనూ అంచనాలను మించిన పనితీరు కంపెనీ సాధించింది.

# టిసిఎస్‌లో లేఆఫ్‌లపై ఆందోళనలు!

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ప్రముఖ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో తలపెట్టిన లేఆఫ్‌లను యూనియన్ ఆఫ్ ఐటీ, ఐటీఈఎస్ ఎంప్లాయిస్ (యునైట్) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. లేఆఫ్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతుంది. అయితే లేఆఫ్‌ల కారణంగా దాదాపు 30వేల మందిపై ప్రభావం పడుతుందని యూనియన్ ఆరోపించగా టిసిఎస్ స్పందించింది. కేవలం 12వేలమంది



ఉద్యోగులను తొలగించాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా చెన్నైలో ఆందోళన చేపట్టారు. టిసిఎస్ సీనియర్, మేనేజర్‌స్థాయి ఉద్యోగులను తొలగిస్తుందని, దీంతో సుమారు 30వేల నుంచి 40వేల మందిపై ప్రభావం ఉంటుందని యునైట్ సభ్యురాలు జనని ఆవేదన వ్యక్తం చేశారు. అనుభవజ్ఞులైన స్థానంలో కొత్త వాళ్లను 80 నుంచి 85శాతం తక్కువ జీతానికి నియమించుకుంటుందని యునైట్ ఆరోపిస్తుంది. ఉద్యోగులను తొలగించే బదులు వారి నైపుణ్యాలను పెంచాలని డిమాండ్ చేసింది. రూ.2.55లక్షల కోట్ల ఆదాయం కలిగిన కంపెనీ లాభార్జన కోసం ఉద్యోగులను తొలగించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేసింది. 30వేల మందిని తొలగిస్తున్నామనే ఆరోపణలను టిసిఎస్ ఖండించింది. ముందస్తుగా చెప్పినట్లు కేవలం 2శాతమే దాదాపు 12వేలమందిని తొలగించనున్నట్లు పేర్కొంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14